
ఆంధ్రభూమి

సంపుటి: 29 . సంచిక: 214 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | బుధవారం 3 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119
శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం।
దక్షిణాయణం, హేమంత ఋతువు,
పుష్యమాసం, కృష్ణపక్షం; తిథి: శుద్ధ బహుళ
విదియ రా.తె.4.16; నక్షత్రం: పునర్వసు
ఉ.11.48 ; వర్జ్యం: రా.7.12 నుండి 8.42
వరకు; దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి
12.24 వరకు ; రాహుకాలం: మ.12.00
నుండి 1.30 వరకు



భారత ఐటీకి ఎసరు!

• హెచ్1బి వీసాల్లో కఠిన మార్పులు • అమలైతే ఏడున్నర లక్షలమంది వెనక్కే

వాషింగ్టన్, జనవరి 2: అధికారంలోకి వచ్చిన వెంటనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన 'బై అమెరికన్, హైర్ అమెరికన్' ఆలోచన క్రమంగా అమల్లోకి వస్తోంది. తాజాగా హెచ్1బి వీసాలకు సంబంధించి నియమ నిబంధనల్లో చేస్తున్న మార్పుల వల్ల భారత ఉద్యోగులపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. అమెరికా ఉద్యోగాలను పరిరక్షించడంతోపాటు వాటిని పెంపొందించుకోవాలన్న లక్ష్యంతో ట్రంప్ ప్రభుత్వం హెచ్1బి వీసాలకు సంబంధించిన బిల్లును రూపొందించింది. ఇందులో భారత ఐటీ కంపెనీలపైన అలాగే హెచ్1బి వీసాలను ఉపయోగిస్తున్న వారిపైన అనూహ్యరీతిలో షరతులను విధించింది. ఇవి అమల్లోకి వస్తే ఐదు లక్షల నుంచి ఏడున్నర లక్షల మంది వరకూ భారత హెచ్1బి వీసా హోల్డర్లను వెనక్కి పంపేసే అవకాశం ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే వీసాలకు సంబంధించిన అనేక అంశాలను తాము అమెరికా సెనెటర్లు, కాంగ్రెస్ సభ్యులు, ట్రంప్ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నాస్కాం ప్రకటించింది. ఈ తాజా శాసనానికి సంబంధించి అనేక ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ మార్పులపై అమెరికా అధికారులతో విస్తృతస్థాయి చర్చలు జరపుతామని ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడి విధానాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ బిల్లు స్థానిక అమెరికా ఉద్యోగాలకు పూర్తి రక్షణ కల్పించడంతోపాటు హెచ్1బి వీసాల దుర్వినియోగాన్ని, తప్పుడు మార్గంలో వాటి ద్వారా లబ్ధిపొందడాన్ని అరికడుతుంది. అలాగే వీసా ఆధారిత కంపెనీలు అన్న నిర్వచనాన్ని ఈ బిల్లు ద్వారా ట్రంప్ ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. అలాగే, కనీస జీతం, నిపుణులైన ఉద్యోగుల బదిలీ వంటి అంశాలపైనా కఠినమైన ఆంక్షలనే విధిస్తోంది. యథాతథంగా దీన్ని అమల్లోకి తెచ్చినట్టయితే హెచ్1బి వీసాలు కలిగిన వారు భారీ సంఖ్యలోనే స్వదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ముఖ్యంగా గ్రీన్‌కార్డు కోసం - మిగతా 7వ పేజీలో

పరీక్ష గదుల్లో సీసీ కెమెరాలు

• ఎస్సెస్సీ, ఇంటర్ మాస్ కాపీయింగ్‌పై హైకోర్టు సీరియస్

• నివేదిక కోరుతూ రెండు రాష్ట్రాలకు ప్రత్యేక ఆదేశాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఏలూరుకు చెందిన గుంటుపల్లి డాక్టర్ శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ , జస్టిస్ జి శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. పరీక్ష నిర్వహించే గదుల్లో సీసీ టీవీ కెమెరాలను అమర్చాలని హైకోర్టు ఆదేశించింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు మాస్ కాపీయింగ్‌ను నిరోధించడంపై తీసుకున్న చర్యలను వివరిస్తూ నివేదిక ఇవ్వాలని కోరింది. మాస్ కాపీయింగ్ వల్ల విద్యా ప్రమాణాలు పతనమవుతాయని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఒక ఏడాది విద్యార్థి పరీక్ష తప్పినంత మాత్రాన నష్టమేమీ ఉండదని, విద్యా ప్రమాణాలను కాపాడేందుకు ప్రభుత్వ చర్యలు మాత్రం కఠినంగా ఉండాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం కేసు విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

నాది పేదల కులం

• 2029 నాటికి ఆనందాంధ్రగా తీర్చిదిద్దుతా • త్వరలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ లాకర్ ఇస్తాం

• 2019నాటికి వెలుగొండ ప్రాజెక్టు పూర్తి • కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు ప్రయత్నాలు

• ప్రకాశం జిల్లా జన్మభూమిలో సీఎం చంద్రబాబు ప్రకటన

ఆంధ్రభూమి బ్యూరో

ఒంగోలు, జనవరి 2: సమాజంలో రెండు వర్గాలు ఉంటాయని అందులో ఒకటి డబ్బు ఉన్న వారి కులం, మరొకటి డబ్బులేని పేదకులమని తాను మాత్రం పేదల కులమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. మంగళవారం ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ కేంద్రంలోని శివరాజ్‌నగర్ ఆదర్శపాఠశాలలో పండగ వాతావరణాన్ని తలపించే విధంగా జన్మభూమి -మాఊరు కార్యక్రమం రాష్ట్ర అటవీశాఖమంత్రి శిద్దా రాఘవరావు ఆధ్వర్యంలో జరిగింది. జన్మభూమి -మాఊరు కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో కుల వ్యవస్థ వల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. ఆ అసమానతలను తగ్గించేందుకు తాను కృషిచేస్తానని తెలిపారు. గత జన్మభూమి కార్యక్రమాలు పదిరోజుల పాటు నోడల్ ఆఫీసర్లే వచ్చి స్వయంగా సమస్యలను పరిష్కరించేవారని కాని ప్రస్తుత జన్మభూమి కార్యక్రమాల్లో ప్రజల్లోనుండి చైతన్యం తెచ్చేందుకు, అవగాహన పెంచేందుకు, భాగస్వామ్యం చేసేందుకు తొమ్మిదిరోజులపాటు తొమ్మిది అంశాలపై చర్చ జరిగిన పదోరోజున ఆనందలహరి కార్యక్రమాన్ని నిర్వహిస్తాన్నారు. రాష్ట్రవిభజన ప్రజలు కోరుకుంటే రాలేదని, ఆనాటి కాంగ్రెస్ పెద్దల రాష్ట్రప్రజల



ప్రకాశం జిల్లాలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి-మావూరు గ్రామసభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పొట్టకొట్టి హేతుబద్ధత లేకుండా విభజించారని, ఆదాయం హైదరాబాదుకు,ఖర్చులు నవ్యాంధ్రాకు మిగిల్చారన్నారు. ఆ సమయంలో ప్రతిఒక్కరు ఆందోళన చెందారని, బాధపడ్డారన్నారు. తాను రాత్రింబవళ్ళు రాష్ట్రం కోసం కష్టపడటంతో రాష్ట్రం కుదుటపడుతోందన్నారు. రైతుల కష్టాలు చూసి వారిని అన్నివిధాల ఆదుకునేందుకు, రైతులకు అండగా నిలిచేందుకు దేశంలో ఎక్కడాలేని విధంగా 24వేల కోట్లరూపాయలు రుణమాఫీ చేశామన్నారు. రైతుల రుణమాఫీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకుని మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు రుణమాఫీ చేసేందుకు ముందుకు వచ్చాయన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో నీటిపై ప్రత్యేక శ్రద్ధపెట్టామని నీటి భద్రత కింద ఒకపంటను కాపాడుకునేందుకు నీరు అందిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు కల్పిస్తుందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ధరలు లేక - మిగతా 7వ పేజీలో



తలాక్‌కు మెలిక?

నేడు రాజ్యసభకు రానున్న బిల్లు

ఏకాభిప్రాయ సాధనకు బీజేపీ కృషి

ససేమిరా అంటున్న కాంగ్రెస్ పక్షాలు

మూడేళ్ల జైలు క్లాజుపై అభ్యంతరాలు

సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్

తప్పనిస్థితిలో ఒప్పుకోనున్న ఎన్డీయే

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: చారిత్రక ట్రిపుల్ తలాక్ బిల్లు బుధవారం రాజ్యసభలో చర్చకువస్తోంది. బిల్లును మంగళవారం రాజ్యసభ కార్యకలాపాల్లో పొందుపర్చినా, దాన్ని సభలో ప్రతిపాదించక పోవటంతో చర్చించే ఆస్కారం కలగలేదు. ఎన్డీయేకు నాయకత్వం వహిస్తున్న బీజేపీకి కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు జరుగుతున్న తెరవెనుక చర్చలు కొలిక్కి రాకపోవడంతోనే బిల్లుపై మంగళవారం ఎలాంటి అడుగూ పడలేదు. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి. అయితే బీజేపీ సర్కారు మాత్రం వీలైనంత వరకూ శీతాకాల సమావేశాల్లోనే ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం తీసుకుని చట్టరూపం ఇవ్వాలనే పట్టుదలతో ఉంది. ట్రిపుల్ తలాక్ బిల్లు లోక్‌సభకు వచ్చినప్పుడు ప్రతిపాదిత సవరణలపై పట్టుపట్టని కాంగ్రెస్, ఇప్పుడు రాజ్యసభలో ఎందుకిలా వ్యవహరిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ ప్రశ్నించారు. 'శీతాకాల సమావేశాల్లోనే రాజ్యసభలోనూ బిల్లు ఆమోదింప చేసేందుకు కాంగ్రెస్‌తో నిరంతర చర్చలు జరుపుతున్నాం. కాంగ్రెస్ తమ వాదనతో ఏకీభవిస్తుందనే విశ్వాసం ఉంది' అని అనంతకుమార్ - మిగతా 7వ పేజీలో

అన్యాయం చేస్తున్నారు

• జగన్‌ముందు కన్నీటి పర్యంతమైన మహిళలు

• 50వ రోజుకు చేరిన సంకల్ప యాత్ర

వాల్మీకిపురం (చిత్తూరు), జనవరి 2: రుణ మాఫీ చేస్తామని నమ్మించిన చంద్రబాబు తమను అన్యాయం చేశాడని వాల్మీకిపురంలో మహిళలు మంగళవారం వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి వద్ద కన్నీటి పర్యంతమైయ్యారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ఆయన చిత్తూరు జిల్లా వాల్మీకిపురం మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా మహిళలు, డ్వాక్రాసంఘాల మహిళలు ఆయన పాదయాత్రలో కలిశారు. ఈసందర్భంగా వారు జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణాలు మాఫిచేస్తామని మహిళలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. బ్యాంకులలో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక తాము ఆస్తులు, నగలు అమ్ముకోవాల్సి వస్తున్నదని వారు ఏడ్చుకుంటూ జగన్ ముందు గోడు వెళ్లబొసుకున్నారు. దీనిపై జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నాడని రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధిచెప్పి వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకరావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్‌ఆర్ పార్టీ అధికారంలోకి రాగానే వేరుశనగ పంటకు గిట్టుబాటుధరను కల్పిస్తాం అని - మిగతా 7వ పేజీలో



చిత్తూరు జిల్లా వాల్మీకిపురం ప్రజా సంకల్పయాత్రలో భాగంగా మహిళలతో కలిసి అడుగువేస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్

తరలింపునకు సమ్మతమే

• ప్రత్యేక హైకోర్టుపై ఏపీ అంగీకారం

• కొన్ని సూచనలు కోరుతూ హైకోర్టుకు లేఖ?

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: ఆంధ్రలో ప్రత్యేక హైకోర్టు నెలకొల్పేందుకు సమ్మతిస్తూ హైకోర్టుకు ఆ రాష్ట్ర సర్కారు ఒక లేఖ ఇచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆంధ్ర న్యాయ శాఖ ఒక లేఖను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి ఏజీ డి శ్రీనివాస్ ద్వారా పంపించినట్లు సమాచారం. ఇందులో మూడు వసతి సదుపాయాలను ప్రస్తావించారు. ఒక్కో సదుపాయం రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగి ఉంది.

ఈ ప్రదేశాలను సందర్శించి ఖరారు చేసేందుకు కమిటీని నియమించాలని కూడా అభ్యర్థించింది. ఇందులో ఎంపిక చేసిన భవన సముదాయానికి మార్పులు చేర్పులను సూచించాలనీ, ఏప్రిల్‌నాటికి భవనాలను సిద్ధం చేస్తామని పేర్కొంది. ఏప్రిల్ 30 నుంచి జూన్ 1 మధ్య హైకోర్టు రికార్డులను ఎంపిక చేసిన భవనానికి తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని కూడా హైకోర్టుకు తెలిపినట్లు సమాచారం. జూన్ 2 నుంచి హైకోర్టు ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఆ లేఖలో పేర్కొన్నట్టు చెబుతున్నారు. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఈ భవన సముదాయాలను సందర్శించి ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం.


ఘనగామా



ఎన్నికల బాండ్లు వచ్చేశాయ్

• డోనర్ పేరుండదు • పక్షం రోజుల్లో నగదుగా మార్చు • విధివిధానాలు ప్రకటించిన జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 2: ఎన్నికల వ్యయ ప్రక్షాళనకు సంబంధించి కేంద్రం మంగళవారం కీలక ప్రక్రియను తెరపైకి తెచ్చింది. ఈ ప్రక్షాళనలో భాగంగా ఎన్నికల బాండ్లను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. వీటివల్ల రుణదాతల పేరు బయటకు వచ్చే అవకాశం ఉండదు. బ్యాంకులను మధ్యవర్తులుగా చేసి రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చేందుకు ఈ బాండ్లు దోహదం చేస్తాయి. ఈ కొత్త ఎన్నికల బాండ్లు సంబంధించిన విధివిధానాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వదలిచే రుణదాతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు. వీటిని విరాళంగా రాజకీయ పార్టీలకు అందించవచ్చు. ఇలా తమకు అందిన బాండ్లను ఓ ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ద్వారా ఆయా రాజకీయ పార్టీలు నగదు రూపంలోకి మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకూ రాజకీయ పార్టీలకు లభిస్తూ వస్తున్న నగదు చెల్లింపులకు ప్రత్యామ్నాయంగా ఈ ఎన్నికల బాండ్లను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఈ బాండ్లు ఎస్బీఐ ప్రత్యేక బ్రాంచిల వద్ద జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో పదేసి రోజులపాటు అందుబాటులో ఉంటాయి. పదిహేను రోజుల చెల్లుబాటు వ్యవధి కలిగిన ఈ బాండ్లపై రుణదాతల పేరు ఉండదు. అయితే, వీటిని కొనుగోలు చేసే వ్యక్తులు బ్యాంకువద్ద కేవైసీ నిబంధనలను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ప్రకటనను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం లోక్‌సభలో చేశారు. 2017 ఫిబ్రవరి 1న ఎన్నికల బాండ్ల ఆలోచనను వెలుగులోకి తెచ్చిన ఆయన, రాజకీయ పార్టీలకు లభించే విరాళాల ప్రక్రియను పారదర్శకంగా తీర్చిదిద్దమే దీని ఉద్దేశమన్నారు. నాడు తాను చేసిన ప్రకటనకు తుదిరూపం లభించిందని, నేటినుంచే ఎన్నికల బాండ్లపై అధికారికంగా నోటిఫికేషన్ వెలువడుతుందని చెప్పారు. బాండ్‌గా పేర్కొంటున్నప్పటికీ వీటిపై ఎలాంటి వడ్డీ ఉండదు. ఇప్పటి వరకూ అన్ని రాజకీయ పార్టీలకూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచే విరాళాలు అందుతూ వస్తున్నాయి. ఇప్పుడు దానికి బదులు బ్యాంకుల మధ్యవర్తిత్వంలో రాజకీయ పార్టీలకు నిధులు చెల్లించే అవకాశం ఉంటుంది. కాగా, దీనిపై జరిగిన చర్చలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే 'రుణదాత పేరు లేనపుడు ఈ బాండ్లను విడుదల చేయాలనే ఉద్దేశం ఏవిధంగా - మిగతా 7వ పేజీలో



అమరావతికి 3324 కోట్ల రుణం

• ప్రపంచ బ్యాంకు వద్ద ఏపీ దరఖాస్తు • ప్రాథమిక దశలో అధ్యయనం, మదింపు 5



వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీలో 2018 నూతన సంవత్సర వేడుకలను మంగళవారం నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కేక్ కట్ చేశారు. బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు, అసెంబ్లీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ కోడెల, విష్ణుకుమార్ రాజు ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు.
- బ్యూరో, విజయవాడ.

తొలిరోజు జన్మభూమి సక్సెస్

● పార్టీలో సంతృప్తి ● దర్శిలో అదిరిన సభ
● జనంతో తమ్ముళ్లు మమేకం
● రాష్ట్రంలో సభలపై సానుకూల నివేదిక

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 2: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జన్మభూమి తొలిరోజు సభలు విజయవంతమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో పాల్గొన్న తొలి సభ సక్సెస్ అవడంపై నాయకత్వం సంతృప్తి వ్యక్తం చేసింది. దర్శి సభను విజయవంతం చేయడంలో ఆ జిల్లాకు చెందిన మంత్రి శిద్దారాఘవ రావు కష్టపడ్డారు. పార్టీ శ్రేణుల భాగస్వామ్యంతోపాటు, సంక్షేమ పథకాల లబ్ధిదారులను మండలాల వారీగా సభకు తీసుకువచ్చేలా చూడటంతో సభ లబ్ధిదారులతో కిటకిటలాడింది. దీనితో మంత్రి శిద్దా గత వారం నుంచీ చేసిన కసరత్తు ఫలించినట్టయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్న తొలి సభపై మంత్రి శిద్దాతో పాటు ప్రభుత్వ యంత్రాంగం తొలి నుంచీ దృష్టి సారించింది. జన్మభూమి తొలి కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లాను వ్యూహాత్మకంగా ఎంచుకున్న ముఖ్యమంత్రి ఆశలు, అంచనాలకు మించి సభ విజయవంతం కావడంపై అటు సీఎం కూడా సంతృప్తి వ్యక్తం చేసి, మంత్రి శిద్దాను అభినందించారు. దానితో మంత్రి శిద్దా కోరిక మేరకు ఆ నియోజకవర్గంలో హౌసింగ్ స్కీముకు ఆమోదం తెలిపారు. ప్రధానంగా మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండటం, 55 వేల నుంచి 60 వేల మంది జనసమీకరణ, మారుమూల ప్రాంతాల నుంచి లబ్ధిదారులు ఎక్కువ సంఖ్యలో హాజరుకావడం, 245 కోట్ల అభివృద్ధి పనులకు వినూత్నంగా ఒకేసారి ఒక్కచోట నుంచే ప్రారంభించడం, సభ సందర్భంగా చంద్రబాబు స్వయంగా చిన్నారులతో ముచ్చటించడం వంటి అంశాలు దర్శి సభ విజయవంతానికి కారణమయ్యాయి. జన్మభూమి- మా ఊరు తొలిరోజు కార్యక్రమంపై పార్టీ నాయకత్వం జరిపిన విశ్లేషణలో స్థానిక కార్యకర్తల భాగస్వామ్యం పెరగడాన్ని గుర్తించింది. సాయంత్రానికి రాష్ట్రంలో జరిగిన జన్మభూమి సభల వివరాలు, వాటిలో నేతల భాగస్వామ్యం, హాజరైన నేతలు, సభలు జరగని వివరాలపై పార్టీ నేతలు విశ్లేషణ చేస్తున్నారు. జన్మభూమి సభలతో టీడీపీ కార్యకర్తలు మరోసారి జనంలోకి వెళుతున్నారు. ఇప్పటివరకూ స్థానిక నేతలపై అసంతృప్తి, వివిధ కారణాల వల్ల ఇటు పార్టీ, అటు ప్రభుత్వ కార్యక్రమాల్లో అంటీముట్టనట్లు వ్యవహరిస్తోన్న పార్టీ కార్యకర్తలు, కిందిస్థాయి నాయకులు జన్మభూమితో చాలాకాలం తర్వాత మళ్లీ జనంతో మమేకమవుతుండటంపై పార్టీలో సంతృప్తి వ్యక్తమవుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో సభలు సంతృప్తికరంగానే జరగడం, ఎక్కడా చెప్పుకోదగ్గ సంఘటనలు చోటుచేసుకోకపోవడంపైనా పార్టీ నాయకత్వంలో సంతృప్తి వ్యక్తమవుతోంది. జి+3 విధానంలో 2000 ఇళ్లను సీఎం మంజూరు చేశారు. మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్సీ కరణం బలరాంలతో కలిసి సీఎం చంద్రబాబు ఎడ్లబండి ఎక్కి కాసేపు సందడి చేశారు.

నాలా చట్టం ఆమోదంలో ఇంత జాప్యమా?

● అవసరమైతే ప్రధాని కాళ్లు పట్టుకుంటా ● ఏపీపై గవర్నర్ చిన్నచూపు
● బీజేపీ శాసనసభా పక్ష నేత విష్ణుకుమార్ రాజు ఆగ్రహం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతం ఇచ్చే నాలా పన్ను చట్టం ఆమోదంలో జాప్యం జరగడంపై బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుకు చట్ట రూపాన్ని ఇచ్చేందుకు ఆమోదం తెలపడంలో జాప్యంపై రాష్ట్ర గవర్నర్ వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలగపూడి సచివాలయంలో ఆయన పబ్లిసిటీ సెల్ వద్ద మంగళవారం మీడియాతో మాట్లాడుతూ దాదాపు 8 నెలలుగా నాలా పన్ను చట్టంపై స్పష్టత లేక పారిశ్రామిక అభివృద్ధి త్రిశంకు స్వర్గంలో ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటు సమయంలో నాలా పన్ను చెల్లింపు భారంగా మారిందని ప్రభుత్వం గుర్తించి ఒక మంత్రుల బృందాన్ని నియమించిందని గుర్తు చేశారు. 10 ఎకరాల స్థలాన్ని వ్యవసాయేతర కార్యకలాపాలకు ఉపయోగించుకోవాలంటే అందులో దాదాపు ఒక ఎకరాను పన్ను కోసం అమ్మాల్సి వస్తోందన్నారు. భూ వినియోగం మార్పిడి జరగకపోతే, బ్యాంక్‌లు పరిశ్రమలు, ఇతర వాణిజ్య అవసరాలకు రుణాలు ఇవ్వవన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మంత్రుల బృందం, మంత్రివర్గం కూడా సమీక్షించి పన్నును 9 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ తీర్మానించిందన్నారు. విజయవాడ, విశాఖల్లో 5 శాతం పన్నును 2 శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో కూడా ఈ మేరకు బిల్లును ఆమోదించి, గవర్నర్ ఆమోదానికి గత డిసెంబర్ 4న ప్రభుత్వం పంపిందన్నారు. 28 రోజులు గడుస్తున్నా, ఇప్పటికీ గవర్నర్ ఆమోదం లభించలేదన్నారు. ఏవో కొర్రీలతో ఫైల్ వెనక్కు పంపుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం 2016 జనవరిలోనే నాలా పన్ను చట్టం సవరించి, అమలు చేస్తోందన్నారు. అదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని ఆమోదించడంలో జాప్యం ఎందుకు అంటూ గవర్నర్ వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉంటున్న కారణంగా ఏపీపై గవర్నర్ చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఆ చట్టాన్ని వెంటనే ఆమోదించి, ఏపీ చట్టాన్ని ఆమోదించకపోవడంలో ఆయనకు ఉన్న సమస్య ఏంటో అంటూ వ్యాఖ్యానించారు. ఆదాయం తగ్గుతున్నా, పరిశ్రమల రాక కోసం సీఎం చర్చించి నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. పన్నుపై స్పష్టత లేక గత ఎనిమిది నెలలుగా రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు నిలిచిపోయిందన్నారు. గవర్నర్ ఆమోదంలో జాప్యం విషయం సీఎం సహా మంత్రులందరికీ తెలుసునన్నారు. ఎంత పన్ను కట్టాలి? కట్టాలా? వద్దా? అన్న అంశంపై స్పష్టత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాము ప్రజాప్రతినిధులమని, ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు. ఈ విషయమై గవర్నర్‌ను కలుస్తానన్నారు. అవసరమైతే ప్రధాని కాళ్లు పట్టుకుని ఈ సమస్య పరిష్కారమయ్యేలా చూడమని కోరతానన్నారు.

చంద్రన్న చెప్పారు సరే.. తమ్ముళ్లు పాటిస్తారా?

● ఏ పార్టీ వారికైనా ఫలాలు అందించాలంటున్న సీఎం
● నెగెటివ్ ఓటు పాజిటివ్‌గా మారుతుందన్న ముందుచూపు
● స్థానికంగా అది కష్టమేనంటున్న ఎమ్మెల్యేలు
● క్యాడర్ ఒప్పుకోదని వాదన

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

అమరావతి, జనవరి 2: ప్రభుత్వ పథకాలు పార్టీల రహితంగా అందించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన. కానీ, అది క్షేత్రస్థాయిలో సాధ్యం కాదన్నది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్చార్జుల వాదన. సంక్షేమ కార్యక్రమాలపై రెండు వ్యవస్థల మధ్య తలెత్తిన భిన్నాభిప్రాయతాలివి. గత కొంతకాలం నుంచీ సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలపై సీరియస్‌గా దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలతో అమలుచేస్తున్న వివిధ పథకాలు క్షేత్రస్థాయిలో అందరికీ అందాలని ప్రతి సమావేశంలోనూ చెబుతున్నారు. ముఖ్యంగా పార్టీ నేతలతో తరచూ నిర్వహించే సమన్వయ కమిటీ, ప్రభుత్వ-పార్టీ సమన్వయ కమిటీ సమావేశాల్లో దీనిని ప్రస్తావిస్తున్నారు. ఈవిధంగా పార్టీ రహితంగా పథకాలు అందించడం వల్ల, తెలుగుదేశం పార్టీకి సంప్రదాయకంగా వ్యతిరేకించే వర్గాల వారిలోనూ సానుకూలత ఏర్పడుతుందన్నది బాబు ఆలోచనగా కనిపిస్తోంది. ముఖ్యంగా కొన్ని మండలాలు, గ్రామాల్లో ప్రజలు, వర్గాల మధ్య పార్టీల కోణం ఉంటుంది. ఫలానా వర్గం ఉన్న వీధి అంతా తెలుగుదేశం మద్దతుదారులతో, మరో వీధిలో ఉండే వారంతా వైసీపీ, లేదా కాంగ్రెస్ వర్గానికి చెందినవారనో ముద్ర ఉంటుంది. దీనివల్ల ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ పార్టీ మద్దతుదారులుండే గ్రామలో, వీధుల్లో ఉండేవారికి పథకాలు అందడం, మిగిలిన వారికి దక్కకుండా పోతున్న సంస్కృతి కొన్ని దశాబ్దాల నుంచీ కొనసాగుతోంది. దీనివల్ల ఏ పార్టీకీ ఓటు బ్యాంకు పెరగని పరిస్థితి నెలకొంది. దీనిని గమనించిన తర్వాతనే చంద్రబాబునాయుడు పార్టీలకు అతీతంగా పథకాల ఫలాలు అందించాలని సూచిస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ-వైసీపీ మధ్య కేవలం ఐదు లక్షల 45 వేల ఓట్లు మాత్రమే తేడా ఉన్న వాస్తవాన్ని గ్రహించిన బాబు, అందరికీ పథకాల ఫలాలు అందిస్తే, తొలి నుంచీ పార్టీ-స్థానిక నేతలపై వ్యతిరేకతతో ఉన్న వర్గాలు, వ్యక్తుల్లో దాని స్థానంలో సానుకూలత లభిస్తుందన్న ముందుచూపుతో వెళుతున్నారు. అయితే, దీనిపై పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు పెద్దగా ఆసక్తిచూపించడం లేదు. స్థానికంగా తాము ఒక వర్గాన్ని ప్రోత్సహిస్తుంటామని, తమ కష్టాల్లో వారే దన్నుగా ఉంటున్నందున, వారి అభీష్టానికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని చెబుతున్నారు. గ్రామ, మండల స్థాయి నేతల అభిప్రాయాలకు భిన్నంగా తామేమీ చేయలేమంటున్నారు. ఎన్నికల్లో ఎవరు పనిచేస్తారు? ఎవరు ఓట్లేస్తారన్నది తమ కంటే స్థానికంగా ఉండే వారికే ఎక్కువ అవగాహన ఉన్నందున, స్థానికంగా వారి గౌరవాన్ని తగ్గించే సాహసం తాము చేయలేమని నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. 'సార్ చెప్పింది నిజమే. అందులో ఎలాంటి తప్పులేదు.కానీ మా కింద పనిచేసే గ్రామ, మండల నేతల ఆలోచన అలా ఉండదు. వాళ్లకు వర్గమే ముఖ్యం. స్థానికంగా మిమ్మల్ని వ్యతిరేకించేవాళ్లకూ స్కీములు అమలుచేద్దామంటే రేపటి నుంచి వాళ్లు మా దగ్గరకే రారు. అది రాజకీయంగానే కాదు. వ్యక్తిగతంగా మాకూ నష్టమే'నని ఓ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. పథకాలు తీసుకుని కూడా అది టీడీపీ వాళ్ల జేబు నుంచి ఇస్తున్నారా? మా డబ్బే కదా అని వాదించేవాళ్లుకూడా ఉంటారని వివరిస్తున్నారు. అవతల ప్రజలు కూడా ఏదో ఒక పార్టీ నేత కనుసన్నలలో పనిచేస్తారు కాబట్టి, వారికి ఫలాలు అందించినా పార్టీకి పెద్దగా మైలేజీ రాదంటున్నారు. అయితే, స్థానిక రాజకీయాలతో సంబంధం లేని తటస్థులను ఎంచుకుని, వారికి పథకాలు వర్తింపచేస్తే బాబు అనుకున్న ప్రయోజనాలు ఉంటాయని మాత్రం అంగీకరిస్తున్నారు. అలాంటి వారిపై దృష్టి సారించాల్సి ఉందని చెబుతున్నారు. గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప, అనంతపురం వంటి రాజకీయ చైతన్య జిల్లాల్లోనే ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఈ జిల్లాల్లోని గ్రామ నేతలు పార్టీలతో సంబంధం లేకుండా వ్యక్తులకే విలువ ఇస్తుంటారు. తమ నేత ఏ పార్టీలో ఉంటే, ఆయా గ్రామ, మండల నేతలు ఆ పార్టీల్లో చేరుతుంటారు. అద్దంకి నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలో ఫిరాయించిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవి-తొలి నుంచీ పార్టీలో ఉన్న కరణం బలరామ్ వర్గాల మధ్య ఇప్పటికీ ఇలాంటి వివాదమే నడుస్తోంది. వైసీపీ నుంచి చేరిన ఎమ్మెల్యేలున్న చోట కూడా, పథకాల అమలులో టీడీపీ నేతల మధ్య వివాదాలు, ఘర్షణలు కొనసాగుతున్నాయి.



విలేఖరులతో మాట్లాడుతున్న వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు

బాబూ.. నీకెందుకు ఓట్లు వేయాలి

● పోలవరం సమాధి చేసినందుకా.. ప్రత్యేక హోదా వద్దన్నందుకా
● లోకేష్‌ను సీఎం చేసేందుకే దుర్గ గుడిలో తాంత్రిక పూజలు
● వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు


విజయవాడ (బెంజిసర్కిల్), జనవరి 2: రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మరోసారి ఓట్లు ఎందుకు వెయ్యాలో చెప్పాలని వైకాపా అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ప్రశ్నించారు. రుణమాఫీ చేయనందుకా..పోలవరం సమాధి చేసినందుకా..ప్రత్యేక హోదా వద్దన్నందుకా...ఎన్నికల హామీలు విస్మరించినందుకా.. ఎందుకోసం చంద్రబాబుకు ఏపీ ప్రజలు ఓటు వెయ్యాలో స్పష్టం చేయాలన్నారు. నూతన అంగ్ల సంవత్సరం విషయంలో బాబు కుటుంబానికి ఒక న్యాయం రాష్ట్ర ప్రజలకు ఒక న్యాయమా అని అన్నారు. బాబు పాలనతో విసిగి ఉన్న రాష్ట్ర ప్రజల నుండి చంద్రబాబుకు ఛీత్కారం తప్పదన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన కుమారుడు లోకేష్ కోసమే దుర్గమ్మ సన్నిధిలో తాంత్రిక పూజలు చేయించారని ఆరోపించారు. ఆంగ్ల సంవత్సరంలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయకూడదనే నిబంధన నేపథ్యంలో తమిళనాడు నుండి పూజారులను పిలిపించి లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయడం కోసం దుర్గ గుడిలో పూజలు నిర్వహించారని తెలిపారు. పూజల వెనుక మతలబు సీఎంకు తెలుసన్న ఆయన అధికారులు సీఎం కోసమే అని ధైర్యంగా చెప్పగలరా అని చెప్పారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు వద్దన్న బాబుకు టీటీడీ నుండి, కనకదుర్గమ్మ ఆలయం నుంచి పూజారులు వెళ్లి ఆశీర్వచనాలు ఇవ్వచ్చా అని ప్రశ్నించారు. అంటే ప్రజలకు ఒక న్యాయం, సీఎం దంపతులకు ఒక న్యాయమా అని అన్నారు. నూతన సంవత్సరం రోజు తూలండంటూ అర్ధరాత్రి వరకు బార్లను తెరిపించి మరీ 230 కోట్ల రూపాయల మద్యాన్ని ప్రజలతో తాగించారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రెండు స్థానాలు తప్ప అన్ని స్థానాలు గెలుస్తామని చెప్పడం చూస్తుంటే ఆయనకు అసలు మతిస్థిమితం ఉందా అనే అనుమానం కలుగుతోందన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రజలు బాబుకు ఓటు వేసినందుకు సిగ్గుపడుతున్నారని చెప్పిన అంబటి మూడున్నరేళ్లలో అభివృద్ధి పనులు చేయకపోగా, చేస్తానన్న రుణమాఫీ కూడా చేయలేదన్నారు. ఎన్నికల హామీలో ఒక్కటి కూడా నెరవేర్చని బాబుకు ఎందుకు ఓటు వేయాలన్నారు.

మూడున్నరేళ్లలో సాగించిన దోపిడీ, అక్రమ సంపాదనతో ఓటుకు పదివేలు ఇచ్చి కొలుగోలు చేసి గెలుద్దామని అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ప్రజాధనంతో ఫైవ్ స్టార్ హోటళ్లలో ఉంటూ, విమానాల్లో తిరుగుతున్న నీవు నంబర్ వన్ కూలీవా అని అన్నారు. ప్రజల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ అవసరం లేకపోయినా విదేశీ పర్యటనలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రానికి తెచ్చిన పెట్టుబడులు, పరిశ్రమలపై స్పష్టమైన ప్రకటన ఇవ్వగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు సాగిస్తున్న అభివృద్ధి వ్యతిరేక, దోపిడీ పాలనపై దెబ్బకొట్టే విధంగా ప్రజలు కూలీ ఇస్తారని రాంబాబు ఎద్దేవా చేశారు.

సమర్థవంతంగా పనిచేసిన ఉద్యోగులకు అవార్డులు

● 'జన్మభూమి-మాఊరు'లో పవిత్ర సేవాభావంతో పాల్గొనాలి
● టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడ, జనవరి 2: 'ఇదొక పవిత్ర యజ్ఞం, ప్రజాసేవా ర్యక్రమం. ఒకరికొకరు పోటీబడి మంచిని ప్రోత్సహించాలి. మానవతా కోణంలో పని చేయాలి. మూడున్నరేళ్లలో అనేక సమస్యలు పరిష్కరించాం, చరిత్ర సృష్టించాం. అన్ని రంగాల్లో 'ప్రజలే ముందు' అనేది ఆచరించి చూపుతున్నాం. అందులో భాగంగానే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని 4విడతలుగా నిర్వహించాం. ఐదో విడత జన్మభూమి-మాఊరును కూడా ఇదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని' ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి 5వ విడత జన్మభూమి నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10 రోజులపాటు 13వేల గ్రామాలు, 3వేల వార్డుల్లో జన్మభూమి సభలు జరపాలన్నారు. ప్రతి ఆర్టీజీ సెంటర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 175 మంది నోడల్ ఆఫీసర్లను నియమించామన్నారు. జన్మభూమిపై ప్రతిరోజూ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తానన్నారు. సమర్థవంతంగా పనిచేసిన ఉద్యోగులు, స్వచ్ఛంద సభ్యులకు అవార్డులు ఇచ్చిసత్కరిస్తాం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వార్డు, గ్రామ సభల్లో ముందుగా ప్రార్థన, సీఎం సందేశం, ప్రతిజ్ఞ, అజెండాపై చర్చ జరపాలని, ఫిర్యాదుల పరిష్కార నివేదిక చదివి వినిపించాలని, లబ్ధిదారులకు పింఛన్లు, ఇతర ప్రయోజనాలను పంపిణీ చేయాలని సూచించారు. 'ప్రజల భాగస్వామ్యం ఉంటే రియల్ టైమ్ అద్భుతాలు చేయవచ్చు. గ్రామ, వార్డు సభల్లో ప్రజలను భాగస్వాములను చేయాలి. గ్రామాభివృద్ధిలో ఎన్నారైలు, ఎన్నారీలు భాగస్వాములుగా ముందుకురావాలి. అభివృద్ధి, సంక్షేమంలో ప్రజా భాగస్వామ్యానికే పెద్దపీట వేస్తున్నామని' ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామీణ క్రీడల నిర్వహణకు ప్రతి జిల్లాకు రూ.3లక్షలు సప్లిమెంటరీ ఫండ్ ఇస్తున్నామంటూ వాటితోపాటు పంచాయతీ నిధులను కూడా అవసరాన్ని బట్టి వినియోగించాలన్నారు. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. సాధికార మిత్రల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామ, వార్డు సభల్లో సాధికార మిత్రలను పరిచయం చేయాలన్నారు. సంచార జాతుల్లో అర్హులైన అందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని, మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపం పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అయ్యన్నపాత్రుడు, ప్రణాళికా శాఖ ఉన్నతాధికారులు సంజయ్‌గుప్తా, చలపతిరావు, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ, పేదరిక నిర్మూలనా శాఖల కమిషనర్లు రామాంజనేయులు, కృష్ణమోహన్, అరుణ్ కుమార్, వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓర్వలేకే వైసీపీ విమర్శలు: జూపూడి

విజయవాడ (క్రైం), జనవరి 2: జన్మభూమి కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన ఓర్వలేకే ప్రతిపక్షం విమర్శలు చేస్తోందని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు ఒక ప్రకటనలో మండిపడ్డారు. గతంలో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో 95శాతం వినతులు పరిష్కరించామని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఫెన్షన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ళను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పదిరోజుల పాటు పది అంశాలపై చర్చించడంతోపాటు ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వేగంగా పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు రచ్చబండ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను రొచ్చుగుంటలో పడేశాయన్నారు. జన్మభూమి ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే విమర్శలు చేయడం తగదన్నారు.

మేధోమథనానికి ఇంటిలిజెన్స్ చీఫ్ ఏబీ అభినందన

విజయవాడ (క్రైం), జనవరి 2: విజయవాడ స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో కొలువు తీరిన 'మేధోమథనం' స్టాల్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. రాష్ట్ర ఇంటిలిజెన్స్ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబి వెంకటేశ్వరరావు మంగళవారం సందర్శించారు. సుమారు మూడు వందల స్టాల్స్‌తో పుస్తక ప్రదర్శన కొనసాగుతోంది. స్టాల్స్ అన్నీ వివిధ విద్యాసంస్థలు, పుస్తక ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసినవే. కాని 'మేధోమథనం' స్టాల్ మాత్రం ఒకే ఒక్క పుస్తకం అమ్మకం కోసమే ఏర్పాటైంది. జాహ్నవి పేరుతో గతంలో నాలుగేళ్ళపాటు ప్రచురితమైన వ్యాసాల సంకలనం ఇప్పుడు మేధోమథనం పేరుతో పుస్తకంగా ప్రచురితమైంది. సమాజం అనుసరిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవన విధానంలో పెనుమార్పులను ప్రబోధిస్తూ సంధించిన ఈ వ్యాసపరంపర 'మేధోమథనం'ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళేందుకు మేధోమథనం స్టాల్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఒక పుస్తకం పేరుమీద ఒక స్టాల్ నిర్వహించడం ఇదే తొలిసారని రాజకీయ విశ్లేషకులు సి నరసింహారావు చెప్పారు. కాగా స్టాల్‌ను సందర్శించిన ఏబి వెంకటేశ్వరరావు 'మేధోమథనం' పుస్తకం కొనుగోలు చేసి నిర్వాహకులను అభినందించారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న గాయత్రీ ట్రస్ట్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి బ్రిజ్‌మోహన్‌గౌర్

5 నుంచి 8వరకు మంగళగిరిలో అశ్వమేధ గాయత్రీ మహాయజ్ఞం

● లక్షమందికి పైగా వస్తారని అంచనా
● హరిద్వార్ నుంచి రానున్న 200 మంది విశిష్ట పురోహితులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: నవ్యాంధ్ర ప్రదేశ్ సుభిక్షం కోసం శ్రీవేదమాత గాయత్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్య కళాశాల ప్రాంగణంలో అశ్వమేధ గాయత్రీ మహా యజ్ఞం నభూతోనభవిష్యత్‌లా జరుగబోతున్నది. వాస్తవానికి ఈ మహా యజ్ఞం దేశాన్ని సమర్థవంతం, శక్తివంతం, సుసంపన్నం చేసే గొప్ప ఆధ్యాత్మిక ప్రయోగం. తొలుత ఈ దేశాన్ని, ఆపై విశ్వాన్ని శక్తివంతం కావించే ఒక వైజ్ఞానిక ఆధ్యాత్మిక ప్రయోగమిది. మూడు విధాలైన నరమేధం, సర్పమేధం, గోయజ్ఞాల పరిపూర్ణ కలయికే ఈ అశ్వమేధ గాయత్రీ యజ్ఞం. సంపూర్ణ క్రమశిక్షణతో నిండిన సాధకులు సామూహికంగా తాము గాయత్రీ మాత జపం ద్వారా సంప్రాప్తించుకొని పెంపొందించుకున్న ఇంద్రియ శక్తులను ప్రపంచానికి ఈ యజ్ఞంలో సమర్పిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే జాతి, మత, కుల, లింగ భేదాలు పాటించని విశ్వగాయత్రీ పరివార్ మహాసమ్మేళనం ఇది. ఈ యజ్ఞంలో పాల్గొనేందుకు దేశ విదేశాల నలుమూలల నుంచి కనీసం లక్షమందికి పైగా తరలి రాగలరనే అంచనాతో నిర్వాహకులు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రస్ట్ చీఫ్ డాక్టర్ ప్రణవ్ పండ్యా నేతృత్వంలో శాంతి కుంజ్, హరిద్వార్ నుంచి 200 మంది విశిష్ఠ పురోహితులు వస్తున్నారు. వీరు వైదిక మంత్ర విధానంలో యుగపరివర్తన ద్వారా, మత్స్యయుగ నిర్మాణం ద్వారా ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇందుకోసం నిత్యం 11వేల కలశాలతో శోభాయాత్ర జరుగుతుంది. 6న సర్వ దూతలకు ఆహ్వానం పలికే యజ్ఞం, 7న కలశ పూజ, 24వేల మందితో యజ్ఞం, 8న మహాపూర్ణాహుతి జరుగుతుందని గాయత్రీ ట్రస్ట్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి బ్రిజ్‌మోహన్‌గౌర్ మంగళవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో కన్వీనర్ అశ్వని సుబ్బారావు, కో ఆర్డినేటర్ కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఇక 501 కుండాలతో కూడిన యజ్ఞశాల దేవ సంస్కృతిని దర్శింపచేస్తుంది. అందరూ ఆహ్వానితులేనన్నారు. దీనికి ఎలాంటి రుసుం లేదు. అసలు మహాయజ్ఞం గురించి ఒక్కసారి పరిశీలిస్తే.. అశ్వం లక్షణాలు శౌర్యానికి, శక్తికి ప్రతీకలు. సాహసాన్ని బుద్ధితో జోడించటాన్నే అశ్వమేధం అంటారు. యావత్ దేశం.. సమాజం సుఖం, శాంతిని, సమృద్ధిని పెంపొందించే బృహత్తర ఉద్దేశంతో చేపట్టిన ఒక విశేష ఆధ్యాత్మిక ప్రయోగమే ఈ గాయత్రీ అశ్వమేధ యాగం. అసలు ఈ యజ్ఞ శబ్దం 'యజు' ధాతువు నుంచి ఉత్పన్నమైంది. దీని అర్థం దానము. యజ్ఞానికి అర్థం సత్కర్మ. ఇది గొప్ప ఉద్దేశాల సాధనకై నిస్వార్థ సమర్పణతో కూడినది. ఈ అనంత బ్రహ్మాండంలో జరిగే కార్యకలాపాలన్నీ ఒక అద్భుత యజ్ఞ రూపాన్ని సంతరించుకుని నిరాటంకంగా జరుగుతూనే ఉంటాయి. ప్రకృతిలోని నియమాలన్నీ 'యజ్ఞ' క్రియ అనే భావనలో నిబిడీకృతమై విశ్వబ్రహ్మాండమంతటా వ్యాపించి ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఐకమత్యంగా సద్భావనలతో జీవించే విధానాన్ని ఈ సమాజానికి యజ్ఞ ప్రక్రియ నేర్పుతుంది. వ్యక్తులు ఉన్నతమైన ఆదర్శాలతో ఎదిగేందుకు వారిలో ఉన్నత మానవీయ గుణాలను ఈ ప్రక్రియ ప్రేరేపిస్తుంది. మనుషులకు పరమార్థాన్ని తెలియచెప్పే ఆత్మ సంయమనం, దానగుణ సంవేదనాశీలం, తదితర సద్గుణాలను వారి నిత్య జీవితంలో పెంపొందించుకునేలా చేయటమే ఈ యజ్ఞం మూల ఉద్దేశం.

చేసిన పనులే చెయ్యడం...!

అక్కరకు రాని గోదావరి డెల్టా ఆధునికీకరణ ■ దీర్ఘకాలంగా సాగడంతో మళ్లీ మొదటికొస్తున్న సమస్యలు

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 2: గోదావరి బేసిన్‌లో ఆధునికీకరణ పనులు అక్కరకు రావడంలేదు. ఒక అడుగు ముందుకెళితే రెండడుగులు వెనక్కి అన్న చందంగా ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. ఒకేసారి ఈ పనులు జరిగి ఉంటే ఆశించిన ప్రయోజనం కన్పించేది కానీ ఏళ్ల తరబడి సాగుతూ ఉండటంవల్ల ఒక ఏడాది చేసిన పనులు ఆ మరుసటి ఏడాదికి మళ్లీ మొదటికొస్తున్నట్టుగా పరిస్థితి తయారయ్యింది. దాదాపు దశాబ్దకాలంగా గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఈ పనులు మంజూరైన కొత్తలో పెద్దపెద్ద ప్యాకేజీలుగా విభజించడంతో మూడుసార్లు టెండర్లు రద్దయ్యాయి. ఆనక చిన్నచిన్న ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టారు. కనీసం ఒక సీజన్ అయినా పంట విరామం చేస్తే తప్ప పనులు పూర్తిచేయలేమని టెండరుదారులు తొలి దశలో చెప్పుకుంటూ వచ్చేవారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో ఇరిగేషన్ నిపుణుడు వీరయ్య నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిటీని నియమించి గోదావరి బేసిన్‌లో చేపట్టిన ఆధునికీకరణ పనులపై అధ్యయనం చేయించింది. ఈ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపట్టే విధంగా ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఈవిధంగా ఏటికేడాది డెల్టా కాల్వలు మూసివేసిన తర్వాత మళ్లీ కాల్వలకు నీరు వదిలేలోగా ఆధునికీకరణ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఏటా ఈ కాలంలో చేపట్టాల్సిన పనులను ప్రతిపాదించడం, మంజూరు చేయించుకోవడం, ఆదరాబాదరా టెండర్లు పిలవడం, పనులు చేపట్టడం జరుగుతోంది. టెండర్లు పిలిచి పనులు చేపట్టేలోగా పుణ్యకాలం కాస్తా పూర్తయిపోతోంది. ఈలోగా కాల్వలకు నీరొదిలే సమయం ముంచుకొస్తోంది. దీంతో నిర్దేశిత పనులు ఆ మరుసటి ఏడాదికి వాయిదా వేసుకోవడం, కొన్ని పనులు అర్ధాంతరంగా మిగిలిగిపోవడం, నీరొచ్చి మెజర్‌మెంట్లు తీసుకునే వీల్లేకుండా ఎంత పని జరిగిందో కూడా తెలియని అయోమయం, అస్పష్టత మధ్య ఆధునికీకరణ పనులు అక్కరకు రాకుండానే ఆనవాయితీగా సాగుతున్నాయి. కాగా గోదావరి బేసిన్‌లో ఆధునికీకరణ పనులకు ఇప్పటివరకు రూ.3361 కోట్లు మంజూరుచేస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది. ఇందులో రూ.2900 కోట్లతో మాత్రమే పనులకు నిర్దేశించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సుమారు రూ.1600 కోట్లతోనూ, పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో సుమారు రూ. 1300 కోట్లతో పనులు చేపట్టాలని నిర్దేశించారు. ఇప్పటివరకు అనధికార లెక్కల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సుమారు రూ.600 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో సుమారు రూ.500 కోట్లు అంచనా విలువ కలిగిన పనులను పూర్తిచేశారు. తాజాగా 2017-18 సంవత్సరానికి సంబంధించి ఉభయగోదావరి జిల్లాల్లోని డెల్టాల్లో రూ.295.99 కోట్ల అంచనా విలువ కలిగిన 525 పనులను ప్రతిపాదించి ఆమోదంపొందారు. వీటిలో రూ.10 లక్షల్లోపు అంచనా విలువ కలిగిన పనులను టెండర్ల ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిధిలోనూ, రూ.50 లక్షల్లోపు విలువైన పనులను ఎస్‌ఈ పరిధిలోనూ, ఆపై విలువ కలిగిన పనులను చీఫ్ ఇంజనీర్ పరిధిలోనూ చేపట్టేందుకు విభజించారు. వీటికి సంబంధించి 2009 నుంచి ఏటికేడాది పనులను ప్రతిపాదిస్తూ వేసవి కాలంలో ఆధునికీకరణ పనులు అవసరం, అత్యవసరం మేరకు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టారు. ఇక డెల్టా వ్యవస్థకు గుండె వంటి కాటన్ బ్యారేజీ ఆధునికీకరణకు రూ.31 కోట్లు కేటాయించి పనులు చేపట్టారు. గత ఏడాది నుంచి ఈ పనులు ఇంకా జరుగుతూనే వున్నాయి. ఈ ఏడాది తాజాగా తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇటు డ్రెయిన్లు, అటు కెనాల్స్‌కు సంబంధించి ఆధునికీకరణకు 373 పనులకు రూ.170.22 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచారు. ఈ పనులను ఏప్రిల్ నుంచి జూన్ ఒకటో తేదీ కాల్వలు తెరిచే గడువులోగా పూర్తిచేయాల్సివుంది. అయితే ఇప్పటి వరకు కొన్ని పనులకు మాత్రమే టెండర్లు పిలిచారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది సాంకేతిక అనుమతి త్వరగా వచ్చినట్టే. కానీ నిర్దేశిత పనులు సకాలంలో పూర్తిచేయాల్సి ఉంది. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 152 పనులను రూ. 125.77 కోట్ల అంచనా విలువతో టెండర్లకు సిద్ధం చేశారు. ఏదేమైనప్పటికీ ఆధునీకీకరణ పనులు ఏటికేడాది అలా సాగుతూనే ఉన్నాయి.



గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్ అరెస్టు

పక్కా ఆధారాలతో పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
పది రోజులు రిమాండ్ విధించిన నాంపల్లి న్యాయస్థానం



హైదరాబాద్/ఖైరతాబాద్, జనవరి 2: లైంగిక వేధింపుల కేసులో గాయకుడు గజల్ శ్రీనివాస్‌ను మంగళవారం పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనివాస్ కార్యాలయంలో ఆర్జేగా విధులు నిర్వహిస్తున్న యువతి పక్కా ఆధారాలతో పోలీసులను ఆశ్రయించడంతో అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన కోర్టు అతడికి పది రోజుల రిమాండ్ విధించింది. పంజాగుట్ట ఏసీపీ విజయ్ కుమార్, బాదితురాలు తెలిపిన వివరాల ప్రకారం...సేవ్ టెంపుల్స్ ప్రచారకర్తగా ఉన్న గజల్ శ్రీనివాస్‌కు పంజాగుట్ట ఆనంద్‌నగర్ కాలనీలో కార్యాలయం ఉంది. గత ఎనిమిది నెలల క్రితం ఆర్జేగా చేరిన యువతిపై కన్నేసిన గజల్ శ్రీనివాస్ చేరినప్పటి నుంచి అసభ్యంగా ప్రవర్తించసాగాడు. గత రెండు నెలల నుంచి యువతిని మరింత వేధింపులకు గురిచేయసాగాడు. తాను అలాంటి దానిని కాదని, తనను వదిలివేయాలని ఎంత చెప్పినా వినిపించుకోకుండా తాను త్వరలో గవర్నర్‌ను అవుతున్నానని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నం చేశాడు. అయినా యువతి లొంగకపోయే సరికి తన వద్ద పనిచేస్తున్న మరో మహిళచే బలవంతం చేయించసాగాడు. ఈ వేధింపులతో విసిగిపోయిన బాదితురాలు పోలీసులను ఆశ్రయించింది. గజల్ కార్యాలయంలో జరుగుతున్న రాస క్రీడలను చిత్రీకరించి వాటిని పోలీసులకు అప్పగించింది. దీంతో అతనిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంగళవారం ఉదయం అతన్ని అరెస్టు చేశారు. విచారణ జరిపి వాంగ్మూలం తీసుకుని మధ్యాహ్నం నాంపల్లి న్యాయస్థానంలో హాజరు పరిచారు. కేసు విచారణ జరిపిన న్యాయస్థానం గజల్‌కు పది రోజుల పాటు రిమాండ్ విధించింది. దీంతో అతన్ని పోలీసులు జైలుకు తరలించారు. తనకు బెయిల్ ఇవ్వాలని గజల్ పెట్టుకున్న అభ్యర్ధనను కోర్టు తోసి పుచ్చింది. న్యాయస్థానం అనుమతితో మరోమారు అదుపులోనికి తీసుకొని విచారించాలని పంజాగుట్ట పోలీసులు భావిస్తున్నారు.

జన్మభూమికి రిజర్వేషన్ల సెగ

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి వాల్మీకి, బోయి సామాజిక వర్గాలను ఎస్టీలుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు ఉద్యమం బాట పట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆందోళన కొనసాగిస్తూ గిరిజన ప్రాంతాల్లో జనాన్ని చైతన్యం చేసే కార్యక్రమాలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా జిల్లాలో పలు చోట్ల నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ సెగ జన్మభూమి గ్రామ సభను తాకింది. సీతంపేట మండలం పూతికవలస గ్రామంలో గ్రామసభ నిర్వహించేందుకు ఐ టీడీఏ పీవో ఎల్.శివశంకర్ యత్నించగా అక్కడ గిరిజనులు ప్రభుత్వ తీరును నిరసిస్తూ గ్రామ సభను బహిష్కరించారు. సీపీఎం నేతృత్వంలో స్థానిక గిరిజనులు వాల్మీకి, బోయి కులాలను ఎస్టీల్లో చేర్చవద్దని నినాదాలు చేస్తూ గ్రామంలో జన్మభూమి మా ఊరు సభను వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా అదే గ్రామంలో పాఠశాలను ఆకస్మికంగా పీవో తనిఖీ చేయగా స్థానిక ఉపాధ్యాయుడు శ్రీరాముల దొర మద్యం సేవించి విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన పీవో శ్రీరాముల దొరను సస్పెండ్ చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే సరుబుజ్జిలిలో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బద్దిరి రామారావు అధికారులను నిలదీయడంతో అక్కడ గ్రామసభ రసాభసగా మారింది. గత జన్మభూమి సమస్యలే పరిష్కరించకుండా తిరిగి ఇటువంటి సభలు ఎందుకు నిర్వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించడంతో టీడీపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని వివాదాన్ని సద్దుమనిగించారు. ఎల్‌ఎన్ పేట మండలం కరకవలస, హిరమండలం మండలం కొండరాగోలు గ్రామాల్లో గ్రామ సభల్లో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను వైసీపీ ఎంపీటీసీలు, టీడీపీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు కేటాయించి అర్హులకు అన్యాయం చేస్తున్నారని నిలదీశారు. ఈ సభల్లో కూడా టీడీపీ వైసీపీ వర్గాలు వాదులాడుకోవడంతో జన్మభూమి సభలు రచ్చరచ్చగా మారాయి. పోలీసుల నీడలో ఈ సభలను అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహిస్తూ అరకొర పథకాలు పంపిణీతో సరిపెట్టుకోవడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్భాటం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడంలేదని పెదవి విరుస్తున్నారు.

బహిష్కరించిన గిరిజనులు
రసాభాసగా గ్రామసభలు

రాష్ట్రంలో కొత్తగా 9 కొత్త మండలాలు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: రాష్ట్రంలో వివిధ అర్బన్ మండలాలను విభజించి, 9 కొత్త మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ అర్బన్ మండలాన్ని విజయవాడ (తూర్పు), విజయవాడ (సెంట్రల్), విజయవాడ (నార్త్), విజయవాడ (వెస్ట్) మండలాలుగా విభజించింది. విశాఖ అర్బన్, రూరల్ మండలాలను సీతమ్మధార, మహారాణిపేట, గోపాలపట్నం, ములగాడ, విశాఖ (రూరల్) మండలాలుగా, కర్నూల్ మండలాన్ని అర్బన్, రూరల్ మండలాలుగా, నెల్లూరు మండలాన్ని కూడా అర్బన్, రూరల్ మండలంగా, గుంటూరు మండలాన్ని గుంటూరు (ఈస్టు), గుంటూరు (వెస్టు)గా విభజించింది

కోడి పందేలకు అనుమతి ఇవ్వొద్దు

ఏపీ సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా కూడా కోడిపందేలు నిర్వహించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ జి శ్యాంప్రసాద్‌తో కూడిన ధర్మాసనం ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిని ఆదేశించింది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో ప్రత్యేకంగా ఎక్కడ కోడిపందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఎక్కడైనా ఈ పందేలు జరిగితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి బాధ్యత వహించాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కలిదిండి రామచంద్రరాజు అనే వ్యక్తి దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు విచారించింది. 2016 డిసెంబర్‌లో తాము జారీ చేసిన ఆదేశాలను పాటించకపోవడం పట్ల హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు నిర్లక్ష్యంగా ఉండరాదని, కోట్లాది రూపాయలు ఈజూదం పేరిట చేతులు మారుతున్నాయని కోర్టు పేర్కొంది. కోడి పందేలను పండగ సమయాల్లో నిర్వహించడానికి సుప్రీం కోర్టు అనుమతించలేదన్నారు. చట్టాన్ని అమలు చేయడం ద్వారానే కోడిపందేలు జరగకుండా నిరోధించాలని కోర్టు పేర్కొంది. తమ బాధ్యతల నుంచి అధికారులు తప్పించుకోరాదన్నారు. పశ్చిమగోదావరి ఎస్పీ ఒక వేళ ఈ పందేలను జరగకుండా నిరోధించలేమని చెబితే సమర్థుడైన మరో అధికారిని నియమించాలని ఆదేశిస్తామని కోర్టు పేర్కొంది. ఈ గ్యాంబ్లింగ్ నిరోధించేందుకు తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీని హైకోర్టు ఆదేశించింది.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

ఎమ్మిగనూరు మండలంలో టాటాఏస్ వాహనాన్ని ఢీకొన్న లారీ ■ చిత్తూరు జిల్లాలో లారీ, ఆటో ఢీ

ఎమ్మిగనూరు, జనవరి 2: రాష్ట్రంలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు. కర్నూలు జిల్లాలో నలుగురు, చిత్తూరు జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. టాటాఏస్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో కర్రెమ్మ(58), ఆంజినమ్మ(55), డ్రైవర్ భీమిరెడ్డి(45), ఖాదర్‌భాష(45) సంఘటనాస్థలంలోనే మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మిగనూరుకు చెందిన భీమారెడ్డి టాటాఏస్ వాహనం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు ప్రయాణికులను ఎక్కించుకుని వస్తుండగా కోటేకల్ సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న కర్రెమ్మ, ఆంజినమ్మ(55), భీమిరెడ్డి(45), ఖాదర్‌భాష(45) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలియగానే సీఐ ప్రసాద్ సంఘటనాస్థలాన్నికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాగా చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని కల్లుపల్లి వద్ద మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో ఏడుగురికి తీవ్ర గాయాలైయ్యాయి. మదనపల్లె నుంచి పలమనేరుకు వస్తున్న లారీ, ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఇందులో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఏడుగురికి తీవ్ర గాయాలైయ్యాయి. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మంగళవారం మధ్యాహ్నం ఆటోలో సామరాజుపల్లి, మేలుమాయికి చెందిన పలువురు పలమనేరుకు వస్తువులు కొనుగోలు కోసం ఆటోలో వస్తుండగా అదే క్రమంలో ఈ ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఇందులో చెన్నమనాయుడుపల్లికి చెందిన ఆటోడ్రైవర్ సుబ్రహ్మణ్యం, పలమనేరుకు చెందిన అలెక్సా, సామరాజుపల్లికి చెందిన మున్నాబిలు అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108వాహన సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులైన షర్మిల(25), పార్థన(25), సబానా(26), గజేంద్ర(30), మేనక(30), మల్లిక(25) ఆరుగురిని పలమనేరు ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారందరూ సామరాజుపల్లి, మేలుమాయి గ్రామస్థులుగా పోలీసులు గుర్తించారు. ఈమేరకు గంగవరం ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టాటాఏస్ వాహనం

దుర్గ గుడిలో క్షుద్రపూజలు?

వదంతులేనని తోసిపుచ్చిన ఈవో సూర్యకుమారి

విజయవాడ (ఇంద్రకీలాద్రి) జనవరి 2: దుర్గగుడి అంతరాలయంలో క్షుద్ర పూజలు చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలు వెలుగులోకి వచ్చి రెండు రోజులైనా ఈ వ్యవహారంపై ఇప్పటి వరకూ ఎవరిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అయితే అటువంటి పూజలేమీ జరుగలేదంటూ దేవస్థానం ఈవో సూర్యకుమారి కొట్టిపారేస్తున్నారు. ఈవో ఏ సూర్యకుమారి సంపూర్ణ సహకారం ఉన్న కారణంగానే ఆలయ ప్రధాన అర్చకుని వెంట ఆజ్ఞాతవ్యక్తి ఒకరు అంతరాలయం వరకు వచ్చారన్న విమర్శలు వినబడుతున్నాయి. ఆ ఆజ్ఞాతవ్యక్తి ఆలయ ప్రధాన అర్చకుని వెంట రావటం వెనుక ఈవో హస్తం ఉన్న కారణంగానే అక్కడ బందోబస్తీ సిబ్బంది సైతం ఎటువంటి అభ్యంతరం చెప్పలేదన్న విమర్శలు చోటు చేసుకున్నాయి. దుర్గగుడిలో అపచారం జరిగినట్లు వస్తున్న కథనాల నేపథ్యంలో ఈవోను సస్పెండ్ చేయాలని వివిధ వర్గాల నుండి డిమాండ్ వినబడుతోంది. దుర్గగుడి ప్రతిష్ఠను పరిరక్షించాలని అటు దుర్గగుడి ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు, ఇటు పలు ఆధ్యాత్మిక సంస్థలు పోరాటం చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. దేవాదాయ ధర్మాదాయశాఖలో ఎవరైనా చిరుద్యోగి తప్పు చేస్తే, వెంటనే సస్పెండ్ చేసే ఉన్నత స్థాయి అధికారులు దుర్గగుడి ఈవో విషయంలో ఎందుకు జాప్యం జరుగుతోందన్న ప్రశ్నలకు సరైన సమాధానం లేక పోయింది. ఈ సంఘటన జరిగిన రోజున విధి నిర్వహణలో ఉన్న దుర్గగుడి భద్రత సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, దుర్గగుడి సిబ్బంది, తదితరులను సైతం విచారించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ వివిధ వర్గాల నుండి ఊపు అందుకొంది.


తాంత్రిక పూజలు జరుగలేదు: ఈవో

దుర్గగుడిలో గత ఈనెల 26 తేదీ రాత్రి కేవలం ఆలయ శుద్ధి కార్యక్రమం తప్ప ఎటువంటి తాంత్రిక పూజలు జరగలేదని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో ఎ సూర్యకుమారి స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం ఇవోఎ సూర్యకుమారి విలేఖరులతో మాట్లాడుతూ ఆలయ ప్రధాన అర్చకుడు కే బద్రీనాథ్‌బాబు ఒక సహాయ అర్చకుని తోడు తీసుకొని అంతరాలయం వద్దకు రావటం పెద్ద తప్పేనని ఈవో అంగీకరించారు. ప్రధాన అర్చకుడు నియమనిబంధనలను ఉల్లఘించినందుకు ప్రధాన ఆలయం నుండి ఉప ఆలయానికి బదిలీ చేసి జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఈవో వివరించారు. రాత్రి పూట ఇంద్రకీలాద్రిపై విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్, ప్రైవేట్, దుర్గగుడి సిబ్బంది ఎవరు కూడా అభ్యంతరం పెట్టని విషయాన్ని ఈ సందర్భంగా విలేఖరులు ఈవో దృష్టికి తీసుకురాగా భద్రతా లోపాలను సైతం సమీక్షించి తగు చర్యలు చేపట్టనున్నట్లు ఈవో వివరణ ఇచ్చారు. పూర్తి సమాచారం సేకరించే విషయంలో కొంత మేరకు జాప్యం జరిగింది తప్ప, మరొక ఉద్దేశం లేదన్నారు. జరిగిన సంఘటనపై పత్రికా విలేఖరులకు పూర్తి సమాచారం అందించటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ఈవో స్పష్టం చేశారు. ప్రతి నెల ఆలయాన్ని శుద్ధి చేస్తామని, అందులో భాగంగానే మంగళవారం కూడ శుద్ధి కార్యక్రమం జరిగింది తప్ప ఇందులో ఎటువంటి దాపరికం లేదని ఈవో పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ మాట్లాడుతూ దుర్గగుడిలో ఎటువంటి తాంత్రిక పూజలు జరగలేదని, కేవలం ఆలయ శుద్ధి మాత్రమే జరిగిందన్నారు. గర్భగుడిని తొందరగా సిద్ధం చేయాలనే ఉద్దేశ్యంతోనే సహాయకుడిగా ఒక అర్చకుని తీసుకెళ్లామన్నారు.

పూర్తిస్థాయి విచారణ: దేవాదాయ మంత్రి

ఆంధ్రభూమి బ్యూరో

తాడేపల్లిగూడెం, జనవరి 2: విజయవాడ కనకదుర్గ ఆలయ ఆలయ పవిత్రతను కాపాడతామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు స్పష్టంచేశారు. ఆలయంలో వివాదాస్పద రీతిలో పూజలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఆలయ ప్రధానార్చకుడు బద్రీనాథ్, వేరే ఆలయ అర్చకుడిని అమ్మవారి అలంకరణ కోసం గర్భగుడిలోకి తీసుకెళ్ళడం వివాదానికి కారణమైందన్నారు. వంశపారంపర్యంగా వచ్చే ప్రధానార్చకులు తప్ప వేరే ఆలయాలకు చెందిన అర్చకులకు అక్కడ ప్రవేశంలేదన్నారు. ప్రధానార్చకులు బద్రీనాథ్‌కు అనారోగ్యం, స్థూలకాయం కారణంగా వేరే అర్చకుడిని తీసుకెళ్ళి ఆలయాన్ని శుభ్రం చేసి, అలంకరణ చేశారన్నారు. ఆలయ గర్భగుడిలోకి ప్రధానార్చకులు కాని వారు ప్రవేశించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనికి సంబంధించి స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులతో విచారణ జరుపుతామన్నారు. ఆలయంలోని సీసీటీవీ పుటేజీ పరిశీలించామన్నారు. ఆలయ గర్భగుడిలోకి బద్రీనాథ్‌తో పాటుగా సహాయకునిగా వెళ్ళిన వ్యక్తి కృష్ణాజిల్లా విశ్వనాథపల్లి ఆలయ అర్చకుడు ఘంటసాల రాజాగా గుర్తించారన్నారు. వీరు ఆలయాన్ని శుభ్రం చేసి అలంకరణ మాత్రమే చేశారన్నారు.





మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జవహర్ ★ కొవ్వూరు పట్టణంలో టీడీపీ నేతల రాస్తారోకో

మంత్రి దాడి చేశారంటూ టీడీపీ నేతల ఫిర్యాదు

కొవ్వూరులో నిరసన..బైఠాయింపు

కొవ్వూరు, జనవరి 2: రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్ జవహర్ తమపై దాడి చేశారంటూ ఇద్దరు తెలుగుదేశం పార్టీ నాయకులు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేయడం కలకలం రేపింది. అయితే సోమవారం రాత్రి చేసిన ఈ ఫిర్యాదుపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ మంగళవారం పలువురు కొవ్వూరులో నిరసనకు దిగడం విశేషం. అయితే దాడి ఆరోపణలను మంత్రి జవహర్ ఖండించారు. వివరాల్లోకి వెళితే... మంత్రి జవహర్‌ను కలవడానికి కొవ్వూరులోని ఆయన కార్యాలయానికి వెళ్లినపుడు తమపై మంత్రి జవహర్ తదితరులు దాడిచేశారంటూ తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన టీడీపీ నాయకులు గణపతి కృష్ణ, సత్యేంద్రప్రసాద్ సోమవారం రాత్రి కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు ఏ విధమైన చర్యా తీసుకోకపోవడంతో మంత్రిపై వెంటనే కేసు నమోదుచేసి, అరెస్టుచేయాలని డిమాండు చేస్తూ అన్నదేవరపేట గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కొవ్వూరు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. విజయ విహార్ సెంటర్లో బైఠాయించి, మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం డీఎస్పీ ఎస్ వెంకటేశ్వరరావును కలిసి ఘటన వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మంత్రి జవహర్‌పై కొంతమంది టీడీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపామని, అయితే కేసు నమోదుజేసే అంశాలు అందులో లేవని, అందుకే ఆయనపై కేసు నమోదుజేయలేదని తెలిపారు. తమకందిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరుపుతామన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తులు గతంలో సోషల్ మీడియాలో మంత్రి జవహర్‌పై వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కల్గించేలా వ్యాఖ్యలు పెట్టడంతో వారిపై కేసు నమోదుజేశామని డీఎస్పీ తెలిపారు.ఇలాఉండగాతాను ఎవరిపైనా దౌర్జన్యం చేయలేదని మంత్రి జవహర్ తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖర్ల సమావేశంలో స్పష్టంచేశారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కృష్ణాజిల్లా శాఖ

జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ అధ్యక్షుడు బి. లక్ష్మీకాంతం, IAS ఆదేశాల మేరకు ఈనెల 19వ తేదిశుక్రవారం ఉదయం 10 గం.లకు సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సమావేశం జరుగుతుందని ఛైర్మన్ డా. A. శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో 2016-17 ఆడిట్ రిపోర్టుల ఆమోదం. ప్రస్తుత సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, తదితర అంశాలు చేపడతామని పేర్కొన్నారు. దీనికి జిల్లాలోని రెడ్ క్రాస్ పాట్రన్లు, వైస్ పాట్రన్లు, జీవిత కాల సభ్యులు, సబ్ బ్రాంచి కార్యదర్శులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

- కృష్ణాజిల్లా శాఖ

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

బుధవారం, 3 జనవరి 2018

అస్సాంలో 'జనసూచిక'

అస్సాంలో 'జాతీయ జన సూచిక' - నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ - ఎన్‌ఆర్‌సి - మొదటి ముసాయిదాను ప్రచురించడం విదేశీయ అక్రమ ప్రవేశకులను పసికట్టడానికి జరుగుతున్న కృషికి దోహదం చేయగలదు. అయితే అక్రమ ప్రవేశకులు అందరూ బయటపడగలరా? అన్నది ఉత్కంఠను కలిగిస్తున్న వాస్తవం..! బంగ్లాదేశ్ నుండి అస్సాం, బెంగాల్, ఈశాన్య ప్రాంతాలలోకి 1947 నుంచి కూడ చొరబడుతున్నవారిలో అత్యధికులు ఇదివరకే నకిలీ పత్రాల సహాయంతో భారతీయ పౌరులుగా చెలామణి అవుతున్నారు, 'రేషన్‌కార్డుల'ను పొందారు, వివిధ బ్యాంకులలోను, ఆర్థిక సంస్థలలోను ఖాతాలు ప్రారంభించారు! ఆస్తులు సంపాదించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందారు. స్థానిక, శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో వోటర్లుగా 'నమోదయి'పోయి ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారు! చాపకింది విషం వలె వీరందరూ అస్సాం అంతటా వ్యాపించి ఉన్నారు! అందువల్ల వీరందరినీ పసికట్టడం సాధ్యమేనా? అన్నది ప్రశ్న! 'స్వతంత్ర భారత్'లో మొదటిసారిగా 1951లో 'జనగణన' జరిగింది. ఈ 'జనగణన' ప్రాతిపదిక 'జాతీయ జనసూచిక'-ను రూపొందించాలన్న ఆదర్శం ఇంతవరకూ దేశవ్యాప్తంగా సాకారం కాలేదు. కానీ అస్సాంలో మాత్రం 1951 నాటి జనగనణ ప్రాతిపదికగా దేశంలోనే మొదటిసారి ఈ 'ఎన్‌ఆర్‌సి' రూపొందింది. కానీ తరువాత అస్సాం 'జనాభా' పెరుగుదలలోను, వివిధ మతాల ప్రజల నిష్పత్తిలోను విపరీతమైన మార్పులు సంభవించాయి. తూర్పు పాకిస్తాన్ నుంచి ఆ తరువాత బంగ్లాదేశ్ నుంచి లక్షలాది ఇస్లాం మతస్థులు అక్రమంగా మనదేశంలోకి చొరబడిపోయారు. ఈ అక్రమ ప్రవేశకుల సంఖ్య ఒకటిన్నర కోట్ల నుంచి మూడు కోట్ల వరకు ఉండవచ్చునన్నది జరిగిన ప్రచారం! ఈ అక్రమ ప్రవేశకులలో అనేకులు భారతీయులుగా నటిస్తూ దేశవిద్రోహ కలాపాలకు, బీభ త్స కలాపాలకు పూనుకోవడం చరిత్ర! ఈ అక్రమ ప్రవేశం వల్ల బెంగాల్‌లోను ఈశాన్య ప్రాంతాలలోను స్థానికుల సామాజిక ఆర్థిక భద్రతకు విఘాతం కలుగడం కూడ చరిత్ర. ఇప్పుడు మళ్లీ అస్సాంలోనే మొదటిసారిగా 'జాతీయ జన సూచిక' రూపొందడం చరిత్రకు పునరావృత్తి. కానీ 1951కి 2018కీ మధ్య అస్సాం జనాభాలోను, జనాభాలోని మత నిష్పత్తిలోను ఏర్పడిన విపరీతమైన అంతరం దేశ భద్రతకు, ఆర్థిక సౌష్టవానికి పెనుముప్పుగా పరిణమించింది!!

అస్సాంలోకి చొరబడిన బంగ్లాదేశీయులను ఏరివేయడానికి ఈ కొత్త 'జాతీయ జనసూచిక' నిర్దిష్ట, నిర్దుష్ట ప్రాతిపదిక కాగలదా? అన్న ప్రశ్నకంటె సక్రమమైన భారతీయ పౌరులను అందరినీ ఈ 'సూచిక' ఇంకా చేర్చకపోవడం అస్సాంలో అలజడి రేగుతోంది! తమ పేర్లు 'జనసూచిక'లో చేర్చమని కోరుతున్న మూడుకోట్ల ఇరవై తొమ్మిది లక్షల మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. గత ముప్పయి ఒకటవ తేదీ అర్ధరాత్రి విడుదల అయిన తొలి ముసాయిదాలో కోటి తొంబయి లక్షల మందికి మాత్రమే చోటు లభించింది! తొలి ముసాయిదాలో చోటు లభించని వారందరూ అక్రమ ప్రవేశకులు కారని, ఇంకా పరిశీలన పూర్తికానున్నందున కొంతమంది మాత్రమే 'భారతీయులు'గా స్థానికులుగా నిర్ధారణ అయ్యారని 'జాతీయ జన సూచిక' సంయోజకుడు 'ప్రతీక్ హజేలా' స్పష్టం చేసినప్పటికీ సక్రమ పౌరులు అలజడికి గురి అవుతున్నారు! 2002 నాటి అస్సాం జనాభా రెండు కోట్ల అరవై ఏడు లక్షలు! దరఖాస్తుల ప్రాతిపదికగా అరవై రెండు లక్షల మంది ఆ తరువాత పుట్టినవారు లేదా అస్సాంలో స్థిరపడినవారు! ఇలా స్థిరపడినవారిలో అత్యధికులు అక్రమ ప్రవేశకులు. మొదటి జాబితాలో చోటు దొరకని కోటి ముప్పయి తొమ్మిది లక్షల మందిలో బహుశా అత్యధికులు అక్రమ ప్రవేశకులు కానివారి సంతతి కావచ్చు! 1971 మార్చి ఇరవై నాలుగవ తేదీనాటికి అస్సాంలో నివసిస్తుండినవారు వారి కుటుంబ సభ్యులు పిల్లలు వారసులు సక్రమమైన భారతీయ పౌరులన్నది, స్థానికులన్నది 1984లో జరిగిన నిర్ధారణ! ఈ నిర్ధారణ ప్రాతిపదికగానే ఇప్పుడు 'సూచిక' రూపొందింది! వివాహ సంబంధం ద్వారా ఇరువై తొమ్మిది లక్షల మంది మహిళలు అస్సాంలోకి వచ్చి స్థిరపడినారట! వీరి వివాహ సంబంధాన్ని ధ్రువపరిచే 'అర్హత' పత్రాల సామంజస్యాన్ని, వాటి వివరాల వాస్తవాలను ఇంకా పరిశీలించవలసి ఉంది!

బెంగాల్‌లోకి, అస్సాంలోకి ఇన్ని దశాబ్దులుగా లక్షల సంఖ్యలో ఇస్లాం మతస్థులు చొరబడడానికి కారణం జిహాదీల షడ్యంత్రం. ఇస్లాం మతస్థులు అధిక సంఖ్యాకులుగా ఉండిన అఖండ భారత్ ప్రాంతాలు తూర్పు పాకిస్తాన్‌గా, పశ్చిమ పాకిస్తాన్‌గా ఏర్పడడం ఈ కుట్రకు ప్రాతిపదిక. తూర్పు పాకిస్తాన్ 1971లో బంగ్లాదేశ్‌గా మారింది. తమ సరిహద్దుకు సమీపంలోని అవశేష భారత్ ప్రాంతాలలోకి చొరబడడం ద్వారా స్థిరపడడం ద్వారా ఆయా ప్రాంతాలను 'ఇస్లాం' జనబాహుళ్యంగా మార్చడం ఈ కుట్ర! అలా ఇస్లాం జనబాహుళ్యంగా మారిన భారత ప్రాంతాలను మరోసారి భారత్ నుండి విడగొట్టాలన్నది 'జిహాదీ'ల కుట్ర! కశ్మీర్ లోయ నుంచి హిందువులను నిర్మూలించడం, అస్సాంలోను బెంగాల్‌లోను బంగ్లాదేశీయ ముస్లింలను నింపడం ఈ 'పాకిస్తానీ - బంగ్లాదేశీ' జిహాదీ కుట్ర! ఈ కుట్రకు వ్యతిరేకంగా 'అస్సాం ఛాత్ర సంఘర్ష పరిషత్' తదితర జాతీయ సంస్థలు 1970వ దశకం నుంచి ఉద్యమం నిర్వహించాయి. ఈ ఉద్యమం కారణంగా అస్సాం ప్రగతి స్తంభించిపోయింది, అక్రమ ప్రవేశకులను గుర్తించి బంగ్లాదేశ్‌కు తిప్పి పంపించడానికి వీలుగా 1982-83లో ప్రభుత్వం రూపొందించిన 'చట్టం' అమలు జరగడానికి ఆ చట్టంలోనే ప్రతిబంధకాలు 'నిహితం' కావడం మరో ఘోరం! 'న్యాయ మండలుల ద్వారా అక్రమ ప్రవేశకుల గుర్తింపు' - ఇల్లీగల్ మైగ్రెంట్స్ డిటర్మినేషన్ బై ట్రిబ్యునల్స్ - ఐఎమ్‌డిటి అన్న ఆ చట్టం ప్రకారం విదేశీయులు ఎవరన్నది ఋజువు చేయవలసిన బాధ్యత స్థానిక ప్రజలది.. స్థానిక ప్రజలు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే పోలీసులు, అధికారులు 'విదేశీయుల'పై అభియోగాలను నమోదు చేసి విచారణ జరపాలన్నది చట్టంలోని నిబంధన. బంగ్లాదేశీయులు "స్థానికులు"గా మారిన గ్రామాలలో బస్తీలలో ఎవరు ఫిర్యాదు చేయాలి! నిజమైన స్థానికులు ఫిర్యాదు చేసినట్టయితే 'జిహాదీ'లు వారిని బెదిరించేవారు, హతమార్చేవారు! ఫలితంగా ఇరవై ఏళ్లలో కొన్నివేల 'ఫిర్యాదులు' మాత్రమే నమోదయ్యాయి. కొన్ని వందల అభియోగాలు మాత్రమే ధ్రువపడినాయి! ఇరవై రెండు ఏళ్ల తరువాత 2005లో సర్వోన్నత న్యాయస్థానం ఈ 'గుదిబండ' - ఐఎమ్‌డిటి - చట్టాన్ని రద్దు చేసింది!

బంగ్లాదేశ్ నుంచి తరిమివేతకు గురైన హిందువులు మనదేశానికి శరణార్థులుగా వచ్చి చేరారు. ఇది దేశ విభజనలో ముడిపడిన సమస్య! 'అఖండ భారత్' వలెనే 'అశేష భారత్' సర్వమత సమభావ రాజ్యాంగ వ్యవస్థ! అందువల్ల 1947 తరువాత మన దేశం నుంచి ఏ మతంవారు కూడా తరిమివేతకు గురికాలేదు. కానీ ఇస్లాం మత రాజ్యాలుగా ఏర్పడిన పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ నుంచి హిందువులు తరిమివేతకు గురి అవుతున్నారు. మన దేశానికి వచ్చి చేరిన ఈ హిందూ శరణార్థులు అక్రమ ప్రవేశకులు కారు. వారికి భారతీయ పౌరసత్వం కల్పించడానికి ఉద్దేశించిన పార్లమెంటు 'బిల్లు' హర్షణీయం...

సంచలన తీర్పులు.. సమగ్ర మార్పులు

సగటు భారతీయుడు కోరుకునే రీతిలో ఎపుడూ స్పందించే సర్వోన్నత న్యాయస్థానం 2017లో సంచలన తీర్పుల ద్వారా తనదైన ముద్రవేసుకుంది. సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో స్పందించిన తీరు, చారిత్రాత్మక తీర్పులతో ప్రజల్లో న్యాయవ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచింది. కొన్ని కేసులను కొట్టివేయడం ద్వారా పరిపాలనాపరమైన లొసుగులను కూడా ఎత్తిచూపింది. ప్రాథమిక విచారణ నివేదిక రాయడంలోనూ, అక్కడి నుండి కేసు నమోదు మొదలు దర్యాప్తు తీరు, అభియోగాల నమోదు, శాస్త్రీయ పద్ధతిలో సాక్ష్యాల సేకరణ, చట్టపరిధిలో కేసును నిర్ధారించేందుకు అవసరమైన న్యాయ ప్రక్రియను అనుసరించడంలోనూ దర్యాప్తు సంస్థల లొసుగులను నిలదీసింది. ముంబై పేలుళ్ల కేసు, నిర్భయ కేసు, ఆరుషి కేసు విషయంలోనూ తీవ్రమైన శిక్షలనే ఖరారు చేసింది. 2జి కేసులో పరిపాలనాపరమైన లోటుపాట్లను ప్రాసిక్యూషన్ వైఫల్యాలను ఎత్తిచూపింది. డేరాబాబాను జైలుకు పంపడంలోనూ, వ్యక్తిగత గోప్యత అంశంలోనూ, మూడుమార్లు తలాక్ విషయంలోనూ కీలక తీర్పులను వెలువరించింది. యుక్తవయస్కురాలైన ఆరుషీ హత్య కేసులో ఆమె తల్లిదండ్రులు రాజేశ్ , నూపుర్ తల్వార్‌లను నిర్దోషులుగా విడుదల చేసింది. అదే పరిస్థితి 2 జి కుంభకోణంలోనూ జరిగింది. స్పెక్ట్రమ్ కుంభకోణంలో నిందితులు అంతా నిర్దోషులుగా బయటపడ్డారు. ఇదంతా ఒక ఎత్తయితే, రానున్న రోజుల్లో సుప్రీంకోర్టు ముందుకు మరిన్ని కీలక కేసులు రాబోతున్నాయి. ఢిల్లీ ప్రభుత్వానికి, ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌కు మధ్య అధికారాల పరిధికి సంబంధించి జరుగుతున్న పోరుపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వనుంది. అలాగే 'మరణశాసనం'పై సుప్రీంకోర్టు తీర్పును వెలువరించనుంది. ఆధార్ రాజ్యాంగబద్ధత, వివాహానంతరం పార్శీ మహిళల హక్కులు, రామజన్మభూమి - బాబ్రీ మసీదు వివాదం, రోహింగ్యాలను వెనక్కు పంపించే అంశం, లవ్‌జిహాద్‌లో హదియా కేసు, రాజ్యాంగంలో ఆర్టికల్ 35ఎ రద్దు, సెక్షన్ 377 ఐపిసి, నిర్భయ కేసు పునర్విచారణ పిటీషన్, కావేరీ వివాదం వంటి ప్రధాన కేసులు ఇప్పటికే జాబితాలో ఉన్నాయి. వీటికితోడు కొత్త కేసులు ఎన్ని వస్తాయనేది కాలమే చెప్పాలి.

అధికారాలపై సిగపట్లు

దేశంలో లెఫ్టినెంట్ గవర్నర్ల అధికారాలపై మరోసారి ఢిల్లీ ప్రభుత్వం చర్చకు లేవనెత్తింది. డిసెంబర్ 6న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం లెఫ్టినెంట్ గవర్నర్ల అధికారాలపై తమ తీర్పును రిజర్వు చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ ఎ కె సిక్రీ, జస్టిస్ ఎ ఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషన్ కూడా ఉన్నారు. దైనందిన పరిపాలనా కార్యకలాపాల్లో రాష్ట్ర ప్రభుత్వానికే విస్తృత అధికారాలున్నాయని ఢిల్లీ ప్రభుత్వం వాదించగా, లెఫ్టినెంట్ గవర్నర్ ఇచ్చే ఉత్తర్వులే తుది ఆదేశమని కేంద్రప్రభుత్వం వాదించింది. ఢిల్లీ దేశ రాజధాని కనుక స్థానిక ప్రభుత్వం కంటే కేంద్రప్రభుత్వ ప్రతినిధిగా ఉంటున్న లెఫ్టినెంట్ గవర్నర్‌నే పరిపాలనాధిపతిగా గుర్తిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అక్కడి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 15 రోజుల పాటు ఇరు వర్గాల వాదనలను ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. సీనియర్ న్యాయమూర్తి గోపాల్ సుబ్రమణియన్ ఢిల్లీ ప్రభుత్వం తరపున వాదించారు. ఇటు చట్టాలను చేస్తూ ప్రజాసంక్షేమాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల అవసరాలను పట్టించుకునే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాన్ని కాదని లెఫ్టినెంట్ గవర్నర్‌ను పాలనాధికారిగా ఎలా గుర్తిస్తారని సుబ్రమణియన్ వాదించారు. శాసనసభ్యులు, మంత్రివర్గం, ముఖ్యమంత్రి ఉన్నారని, చట్టాలను చేయడంతో పాటు చట్టసవరణలు, చట్టాల అమలుకు ప్రజలు వారికి పాలనాధికారం ఇచ్చారని ఆయన వాదించారు. ఢిల్లీ ప్రభుత్వం తరపున పి.చిదంబరం, రాజీవ్ ధావన్, శేఖర్ నేఫడే , ఇందిరా జైసింగ్ వాదించగా కేంద్రప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ మణీందర్ సింగ్ తమ వాదనలు వినిపించారు.

ప్రశాంతంగా మరణించే హక్కు

కామన్ కాజ్ దాఖలు చేసిన మరో కీలక పిటీషన్ సంచలన నిర్ణయాలకు తెరతీయనుంది. ఎవరైనా ఒక పురుషుడు లేదా స్త్రీ కోమా దశలోకి వెళ్లి, లేదా బ్రెయిన్ డెడ్ దశలో ఇక ఎంత మాత్రం జీవించేందుకు అవకాశం లేదని వైద్యపరంగా నిర్ధారణ అయిన తర్వాత కూడా వారిని బతికించేందుకు విశ్వప్రయత్నం చేయడం, వైద్యపరమైన మద్దతు ఇవ్వడం ఆయా కుటుంబ సభ్యులకు ఆర్థికదివాలా తప్ప మరొకటి కాదని, అలాంటి రోగులు స్వచ్ఛందంగా ముందుగానే మరణశాసనం (వీలునామా/ సంకల్పం) రాసేందుకు అవకాశం కల్పించాలని కామన్ కాజ్ ఎన్‌జిఓ సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది.

ఎన్‌జిఓ తరపున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపిస్తున్నారు. అలాంటి రోగులు ఒక వేళ ముందుగానే తమకు ఎలాంటి వైద్య సేవలు అందించాల్సిన అవసరం లేదని వీలునామా రాసే పక్షంలో అందుకు వీలుగా స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అంతేకాకుండా అటువంటి వీలునామాను దిగువస్థాయి న్యాయమూర్తి అంగీకారం పొందాలని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. హింస పడకుండా మరణం ప్రశాంతంగా ఉండాలని ఎవరైనా కోరుకుంటారని, జీవించే హక్కు ఎలా ఉందో ప్రశాంతంగా మరణించే హక్కు కూడా అందులో భాగమని ఎన్‌జిఓ వాదిస్తోంది. కోమా దశలోకి వెళ్లిన వ్యక్తి ఎలాంటి ప్రకటన చేయలేడు, కనుక అటువంటి దుస్థితికి ముందే ఆ వ్యక్తికి వీలునామా రాసే హక్కు కల్పించాలని, తద్వారా కోమాలో సైతం తనకు ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని కోరేందుకు వీలుకలుగుతుందని ప్రశాంత్ భూషణ్ సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఒక వ్యక్తికి అందిస్తున్న వైద్య సేవలను డాక్టర్ల ప్యానెల్, కుటుంబ సభ్యులు, సంబంధిత హైకోర్టు ఆమోదంతో విరమించచేయవచ్చని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే ఇందుకు సంబంధించిన తుది తీర్పును త్వరలో ఇవ్వనుంది.

ఆధార్‌కు రాజ్యాంగబద్ధత



ఆధార్ విశిష్ట సంఖ్యల జారీ రాజ్యాంగబద్ధమేనా అనే అంశంపై దాఖలైన 24వేర్వేరు పిటీషన్లపై త్వరలో సుప్రీంకోర్టు తమ నిర్ణయాన్ని ప్రకటించనుంది. జనవరి 18న ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ కె సిక్రి, జస్టిస్ ఎ ఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డి వై చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతుంది. ఆధార్ జారీ, వివిధ సంక్షేమ పథకాలకు ఆధార్‌ను నిర్బంధం చేయడం, విద్యాంశాలు, పరీక్షలు, ప్రవేశపరీక్షలు, ఎంపిక పరీక్షలకు ఆధార్‌ను తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టు వివిధ దశల్లో తమ అభిప్రాయాన్ని చెప్పడంతో పాటు ఆధార్‌ను తాజాగా ఆర్థిక అంశాలకు జత చేయడంపై కూడా నిష్కర్షగా వ్యాఖ్యానించింది. దాంతో కేంద్రప్రభుత్వం బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డులు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్స్యూరెన్స్ పాలసీలు, పోస్టు ఆఫీసు స్కీములు, నగదు నిల్వలకు ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు మార్చి 31 వరకూ గడువును పొడిగించింది. చివరికి సెల్‌ఫోన్లకు సైతం ఫిబ్రవరి 6లోగా ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేశారు. డిసెంబర్ 31లోగా ఆధార్‌తో అనుసంధానం కాని బ్యాంకు అకౌంట్లను నిలిపివేస్తామని పేర్కొంటూ కేంద్రప్రభుత్వం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌ను నిలిపివేసింది. దేశంలో 33 కోట్ల పాన్‌కార్డులు ఉండగా, నవంబర్ వరకూ 13.28 కోట్ల మంది పాన్ కార్డును ఆధార్‌తో లింక్ చేసుకున్నారు.

పార్శీ మహిళల వివాహానంతర హక్కులపై కూడా మరో పిటీషన్‌ను సుప్రీంకోర్టు విచారించనుంది. ప్రత్యేక వివాహాల చట్టం 1954 ప్రకారం పార్శీ మహిళ ఏ మతానికి చెందుతుందో అనే అంశంపై వివాదం నెలకొంది. ఈ పిటీషన్లపై సుప్రీం ఇవ్వబోయే తీర్పు పెను సంచలనం కానుంది.

రామజన్మభూమి వివాదం

బాబ్రీ మసీదు- రామజన్మభూమి వివాదంపై సుప్రీంకోర్టులో ఫిబ్రవరి 8న తదుపరి విచారణ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికలయ్యే వరకూ విచారణను వాయిదావేయాలన్న సున్నీ, వక్ఫ్ బోర్డు తదితరుల అభ్యర్థనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా తోసిపుచ్చారు. అయోధ్యలో వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహీ అఖాడా, రామ్ లల్లాలు సమానంగా పంచుకోవాలంటూ 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టు ముందు 14 అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. రామమందిర మూల విరాట్టు రామ్‌లల్లా విరాజ్‌మాన్ తరపున న్యాయవాది సిఎస్ వైద్యనాధన్‌ను వాదనలు వినిపించాలని ధర్మాసనం సూచించింది. వెంటనే నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. సున్నీ వక్ఫ్ బోర్డు, బాబ్రీ మసీదు కార్యాచరణ కమిటీ తరపున న్యాయవాదులు విచారణ ప్రక్రియ నుండి వాకౌట్ చేస్తామని స్పష్టం చేశారు.

ఈకేసు సున్నితత్వం, దేశ లౌకికత్వం, రాజకీయాలపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని విచారణను ఐదుగురు లేదా ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నివేదించాలని కపిల్‌సిబాల్, రాజీవ్ ధావన్ వంటి సీనియర్ న్యాయమూర్తులు కోరారు. అయితే దీనిని ప్రధానన్యాయమూర్తి తిరస్కరించారు. వక్ఫ్‌బోర్డు తరపున వాదనలు వినిపించిన కపిల్‌సిబల్ స్పందిస్తూ, కనీసం విచారణను 2019 జూలైకి వాయిదావేయండి, ఆ తర్వాత మేం వాయిదాలను కోరబోం అని చెప్పడంతో ఇదేం అభ్యర్థనంటూ ధర్మాసనం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ కేసు ఫిబ్రవరి 8న విచారణకు రానుంది.

రోహింగ్యాల సమస్య

రోహింగ్యా ముస్లిం శరణార్థులను వెనక్కు పంపించే అంశంపై సుప్రీంకోర్టు జనవరి 31న విచారణ చేపట్టనుంది. దేశంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులతో పాటు 40వేల మంది రోహింగ్యా శరణార్థులను తిప్పి పంపించనున్నట్టు కేంద్ర హోం శాఖ ప్రకటించడంతో వివాదం తెరమీదకు వచ్చింది. రోహింగ్యాల వివరాలను సేకరించాలని కూడా అన్ని రాష్ట్రాలకూ కేంద్రం ఆదేశించింది. భారత్‌లో ప్రధానంగా జమ్మూ కాశ్మీర్, తెలంగాణ, హరియాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలో రోహింగ్యాలు నివసిస్తున్నారు.

బౌద్ధమతస్థులు మెజార్టీగా ఉన్న మయన్మార్‌లో దాదాపు 12 లక్షల జనాభాతో బెంగాలీ మాండలికం మాట్లాడే రోహింగ్యాలు రఖైన్ రాష్ట్రంలో అక్కడ నివసిస్తున్నారు. ఆ దేశంలో అధికారికంగా గుర్తించిన 135 జాతుల్లో వీరు లేకపోవడంతో వీరికి పౌరసత్వం కూడా లభించడం లేదు. కనీసం గుర్తింపు కార్డులు ఇవ్వకపోగా, ఏ హక్కులూ కల్పించలేదు. పౌరులుగా గుర్తింపు పొందాలంటే ఆదేశంలో కనీసం 60 ఏళ్లునివసించినట్టు రుజువు చేసుకోవాలి. బర్మాలో సైనిక చర్యతో సుమారు మూడు లక్షల మంది బంగ్లాదేశ్‌కు తరలివచ్చారు. అక్కడి నుండి వీరు దేశంలో పలు ప్రాంతాలకు వలస వస్తున్నారు.

మానవతాదృక్పథం ఉండాలి, కాని ఎంత మూల్యానికి అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అన్ని వివరాలతో కోర్టుకు రావాలని న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను, ఎఎస్‌జి తుషార్ మెహతాను ఆదేశించింది. లవ్ జిహాద్ హదియా కేసు జనవరి మూడో వారంలో, ఆర్టికల్ 35ఎ రద్దు అంశం స్వలింగసంపర్కాన్ని నేరంగా నిర్ధారించే ఐపిసి 377 మినహాయింపుల అంశంపైనా జనవరిలో సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. నిర్భయ పునర్విచారణ జనవరి 22న ప్రారంభం కానుంది. గత సెప్టెంబర్ 21న రిజర్వు చేసిన కావేరి జలాల వివాదంపై కూడా సుప్రీంకోర్టు త్వరలో తన నిర్ణయాన్ని ప్రకటించనుంది.

-బి.వి.ప్రసాద్

ఇరవై ఏళ్లనాటి మాట..!

క్లాప్ కొట్టిన రెండు దశాబ్దాలకు సినిమా రిలీజ్ అయినట్టు, రెండు దశాబ్దాల క్రితం చెప్పిన రాజకీయ రంగ ప్రవేశం ముహూర్తం ఇప్పటికి ఖరారైనట్టే. అది కూడా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి, అంటే సాధారణంగా అయితే మరో మూడేళ్ల తరువాత పూర్తి పిక్చరు వస్తున్నట్టు. ఈలోగా సినీ పరిభాషలో చెప్పాలంటే ప్రీ ప్రొడక్షన్, రీరికార్డింగ్, ట్రైలర్ రిలీజు.. అంతేనన్నమాట. ఏదైదైనా సినీ 'బాషా' వాడుతున్న రాజకీయ పరిభాష ఎంతో తాజాగా అనిపిస్తూ వీనులకు హాయిగా ఉంది. ఆ విషయంలో ఆయనకు అభినందనలు. ఈ మధ్యకాలంలో రాజకీయ భాష పూర్తిగా దిగజారిపోయింది. భాష మాత్రమే కాదు, భావజాలం కూడా. తమిళనాడులో మరీనూ. వ్యక్తిగతంగా సమగ్రత, మంచితనం ఉన్న వ్యక్తిగా రజనీకి ఇమేజ్ ఉంది. అభిమానుల బలంతోపాటు ఆయన రాకకి వాతావరణం కూడా అనుకూలంగానే ఉన్నట్టుంది. జయలలిత మరణం తరువాత ఏఐడీఎంకే నాయకత్వ లేమితో ఉంది. డిఎంకే బలంగానే ఉన్నా కొంత అన్నదమ్ముల పోరు, మరికొంత అధికార లేమివల్ల వచ్చే ఇబ్బందుల్లో ఉంది. బీజేపీ, కాంగ్రెస్‌లవి గౌరవ అతిథి పాత్రలే అక్కడ, పైగా ఈ మధ్య అవినీతి, బంధుప్రీతి, కుర్చీ కుమ్ములాటలు, హస్తిన తోలుబొమ్మలాటలతో అక్కడి ప్రజలు విసిగిపోయి ఉన్నారు. కాబట్టి రజనీ రంగప్రవేశానికి ఇంతకుమించిన ముహూర్తాల్లేవు. లేటు చేస్తున్నకొద్దీ అధికమాసాలు, మూఢమాసాలే. అయితే రజనీ కొన్ని విషయాల్లో మరింత స్పష్టతనివ్వాలి. ఆయన ఆదర్శాలకు కార్యాచరణ చూపగలగాలి. ఏ మతంతోనూ సంబంధం లేని ఆధ్యాత్మిక రాజకీయాలు పరిచయం చేస్తామంటున్నారు. అదెంతమేరకు సాధ్యం? మత ప్రభావాలకు దూరంగా ఉన్న హేతువాదాల రాజకీయాలదే పైచేయి అక్కడ. రజనీ రాజయోగ ముద్రలుగానీ, హిమాలయ యాత్రలుగానీ ఆయన్ని భక్తిపరుడైన హిందువుగానే చూపిస్తాయి. అయినా మతం వ్యక్తిగతం, అందరి శ్రేయస్సు కోరే ఆధ్యాత్మికత ఆయన మంత్రం అన్నది నిర్ద్వంద్వంగా చెప్పగలిగే, చూపగలిగే ప్రవర్తన కావాలి. సమయం తక్కువ కావున అసెంబ్లీ ఎన్నికల వరకూ పోటీ చెయ్యనంటున్నారు. అయితే అక్కడ నెలకొన్న పరిణామాల దృష్ట్యా ఎన్నికలు ఎప్పుడైనా ముంచుకురావొచ్చు. ఆయన సిద్ధంగా ఉండాల్సిందే. తాను రాజకీయాలు మాట్లాడనంటున్నారు. తిట్లు, శాపనార్థాలు, దిగజారుడు వ్యాఖ్యలు నిషిద్ధమైతే ఒకే కానీ ఏమీ మాట్లాడనంటే అది నష్టదాయకమే. దిశానిర్దేశం అవసరమైన చోట చెయ్యాల్సిందే. ఏమైనా రజనీకాంత్ రాక తమిళనాడు రాజకీయాలను మేలిమలుపు తిప్పాలని ఆశిద్దాం.

-డా. డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

సాయుధ పోరుకాదు.. సాఫ్ట్‌వేర్ ముఖ్యం!

ఇంటింటికీ ఇంటర్నెట్ సౌకర్యం అందుతున్న సమయమిది. ప్రపంచానికి కిటికీలు తెరవడమే ఇంటర్నెట్. ఈ కీలకమైన, విలువైన సాంకేతిక ఆవిష్కరణ ఇప్పుడు ఇంటింటికి చేరడం గొప్ప విప్లవం. అద్భుతం. విప్లవమంటే రక్తం కళ్ల చూడ్డం, తుపాకులకు పని కల్పించడం, విధ్వంసం సృష్టించడం, అభివృద్ధిని అడ్డుకోవడం, ఆశలను తుంచేయడం కాదు. కాలానుగుణమైన మార్పును మెజార్టీ ప్రజల ముంగిళ్లలోకి తేవడమే నిజమైన విప్లవ సారాంశం. ఆ పనిని ఇప్పుడు ఇంటర్నెట్ కల్పిస్తోంది.

ఇంటింటికి కాదు ప్రతి చేతికి ఇంటర్నెట్ అందిస్తామని అనేకమంది సర్వీసు ప్రొవైడర్లు ముందుకొచ్చారు. బి.ఎస్.ఎన్.ఎల్. సైతం నడుం బిగించింది. ప్రతివ్యక్తిని సాధికారతవైపుకదిలించేందుకు విశేషంగా కృషి చేస్తున్నది. రిలయన్స్‌వారి 'జియో' ఇప్పుడు దేశంలో లక్షలాది గ్రామాలను, వేలాది పట్టణాలు - నగరాలను అనుసంధానం చేస్తూ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని 4జి రూపంలో ప్రజలకు అందజేస్తోంది. ఇదికదా విప్లవమంటే.. ఇదికదా విముక్తి, విమోచన అంటే.

ఈ సాంకేతిక విప్లవం పునాదిగా విద్యావైద్యరంగంలో చోటు చేసుకున్న మార్పులతో, ప్రపంచీకరణతో ప్రజల ఆలోచనల్లో గణనీయమైన మార్పు రావడంతో సామాజిక, ఆర్థిక పరిస్థితులు మారాయి. కొత్త తరాలకు పాత పరిస్థితుల పరిచయం లేకుండాపోయింది. కొత్త తరాలు ప్రపంచంతో పోటీపడుతూ హద్దులను, సరిహద్దులను చెరిపేస్తూ గ్లోబల్ వ్యక్తులుగా తమతమ సృజనను, శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. దీన్ని మావోయిస్టులు పట్టుకోలేకపోయారు, పట్టుకోవాలన్న ఆసక్తినీ కనబరచడం లేదు.

ఇటీవల ప్రభుత్వానికి లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జంపన్న ఈ విషయాన్ని కొంతవరకు పసిగట్టి దేశంలో గత పది - పదిహేను సంవత్సరాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. భూస్వాములు ఒకరిద్దరు తప్ప గతంలో మాదిరి కనిపించడం లేదు కాబట్టి 'అర్ధ భూస్వామ్య - అర్ధ వలస' అన్న విశ్లేషణ సరైంది కాదని ఆ రకమైన విశ్లేషణలతో రూపొందించిన విధానాలను మార్చకుండా అలాగే ప్రయాణం కొనసాగించడం సరికాదని ఒక స్థూల నిర్ణయానికొచ్చారు. ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించడం ఎంతో కొంత మేలు. అయితే ఆ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ మాత్రం జంపన్నను సంవత్సరం క్రితమే బహిష్కరించామని ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అప్పుడే ఈ ప్రకటనను విడుదల చేస్తే బాగుండేది. వారి వ్యవహారమంతా ఇలానే ఉండటం గమనార్హం. అతను ద్రోహి అని.. శిక్ష తప్పదని హెచ్చరించారు. విప్లవాన్ని తక్కువ అంచనావేశాడని వ్యాఖ్యానించారు. వారి గోప్యత వారి గొంతుకే చుట్టుకుంది. వారి పనివిధానం ఎలా ఉంటుందో దీనివల్ల అర్థమవుతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మావోయిస్టులు ప్రభుత్వంతో చర్చలు జరిపిన కాలంనాటికే ప్రపంచ పరిస్థితుల్లో, దేశకాల పరిస్థితుల్లో అనూహ్యమార్పులు చోటు చేసుకున్నాయి. టెక్నాలజీ గతంలో ఎప్పుడూ లేనంత విస్తృతమై సామాన్యుడి అరచేతిలోకి చేరింది. ఇంటర్నెట్ సౌకర్యం మనిషి ఆలోచనల సరళినే మార్చేసింది. దినచర్యను పూర్తిగా ప్రభావితం చేసింది. అయినప్పటికీ గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలకు ఆ వాతావరణం అందుబాటులో లేదన్న భావనతో మావోయిస్టులు భూమి పంపకంపైనే ఎక్కువ మక్కువ ప్రదర్శించారు. తమకు అందుబాటులో ఉన్న లెక్కలను ప్రభుత్వం ముందుపెట్టి ఆ డిమాండ్‌ను నెరవేర్చాలని ఒత్తిడి తెచ్చారు. డిజిటల్ ఎకానమీని అసలు పట్టించుకోలేదు.

అప్పటికే వందలాది మంది రైతులు, చేనేత కార్మికులు జీవనం గడవక, గిట్టుబాటుగాక ఆత్మహత్యలు చేసుకున్నారు. అయినప్పటికీ భూమి పంపకంపైనే దృష్టి నిలపడం, దాదాపు వంద సంవత్సరాల పూర్వపు దున్నేవాడికే భూమి అన్న నినాదం ఇవ్వడం, ఎర్రజండాలు పాతడం, గ్రామాల్లో భూస్వాముల వ్యవసాయాన్ని బంద్ చేయించడం వల్ల ఒరిగిందేమిటి? మరిన్ని ఆకలి చావులు, ఉపాధిలేక వలసపోవడం, బతుకు చితికిపోవడం తప్ప ప్రజలకు ఏ రకమైన ప్రయోజనం చేకూరలేదు.

కొంచెం మనసుపెట్టి పరిశీలన చేస్తే, ఆలోచన చేస్తే మావోయిస్టుల దుందుడుకు వ్యవహారం, తొందరపాటు నిర్ణయాలు, అత్యుత్సాహం, ఆవేశంతో ఊగిపోవడం, కాలాన్ని అంచనాకట్టలేని అశాస్త్రీయ వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది.

చర్చలు జరిగిన అనంతరం ఈ దశాబ్దకాలంలో జరిగిన పరిణామాలను వారు పరిగణనలోకి తీసుకోనే లేదు. ఆ ఊపులో, వేడిలో విముక్తి ప్రాంతాలు, బేస్ ఏరియాలు, గెరిల్లా జోన్లు, ప్రజాసైన్యం, ఎర్రకోటపై ఎర్రజెండా ఎంత తొందరగా ఎగరేద్దామా?.. అన్న యావ తప్ప ప్రజల పాత్ర, వాస్తవిక పరిస్థితి, ప్రపంచం నాల్గవ పారిశ్రామిక విప్లవంతో జోరుమీదున్న వైనాన్ని, దావోస్ సదస్సుల్లో ప్రపంచ ఆర్థిక స్థితిగతులకు మార్గదర్శనం చేస్తున్న తీరును పసిగట్టకుండా దున్నేవాడిదే భూమి, మార్కెట్ రహిత ఆర్థిక వ్యవస్థ ద్వారా ప్రజల ముందుకు ఆదర్శ సమాజాన్ని తీసుకొస్తామని తుపాకి, మందుపాతరలు, రాకెట్ లాంచర్లు పేలిస్తే మిగిలింది ఏమిటి?.. హళ్లికి హళ్లి సున్నకు సున్నా మాత్రమే! వేలమంది ఆదివాసీల, అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. చురుకైన, తెలివైన యువత, విద్యార్థుల జీవితాలు అర్థంతరంగా ముగిశాయి. ఇందుకోసమా ఇంకా మావోయిస్టు ఉద్యమాన్ని కొనసాగించడం?.. ఈ ప్రశ్నను వరంగల్ జిల్లాకు చెందిన కొందరు మావోయిస్టులు లేవదియ్యడం వల్ల ఆ పార్టీలో చలనం వస్తుందని ఆశించినవారికి నిరాశే మిగిలింది. గతంలో లొంగిపోయిన దండకారణ్య మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి గూడ్సా ఉసెండీ సైతం ఈ విషయాలనే రేఖామాత్రంగా లేవదీశారు. తాజాగా జంపన్న (ఇద్దరు పూర్వపు వరంగల్ జిల్లాకు చెందినవారు) తన అభిప్రాయాలను, అవగాహనను పార్టీకి తెలిపారు. తన డ్రాఫ్ట్‌తోగాని, చర్చలతోగాని పార్టీ విధానాలు మారే అవకాశం లేదని, ఉండదని పార్టీ ఏరకంగా పనిచేస్తుందో నిశితంగా తెలిసిన వ్యక్తిగా ఘర్షణ పడకుండా ప్రభుత్వానికి లొంగిపోయాడు. దీనివల్ల ఎవరికి నష్టం?.. కచ్చితంగా మావోయిస్టు పార్టీకే. ఇలా కాలయాపన చేస్తూ, పరిస్థితులను, పదిమంది సీనియర్లు వెలిబుచ్చిన అభిప్రాయాలు, ఆలోచనలను సమీక్షించకుండా, కాలానుగుణమైన విధానాలు రూపొందించకుండా కొండపల్లి సీతారామయ్య రూపొందించిన విధానాలను అటుఇటు చేసి ఆధునిక కాలంలో ఆచరణలో పెట్టడానికే మొగ్గుచూపితే అదెలా ఆమోదయోగ్యమవుతుంది?

ప్రపంచాన్ని విశ్లేషించే నైపుణ్యం మావోయిస్టుల్లో కొరవడింది. ఇప్పటికీ అమెరికా సామ్రాజ్యవాద దేశమని, ఆ దేశ అధ్యక్షుడు భారత దేశానికొస్తే భారత పౌరులను హతమార్చి తమ కోపాన్ని చల్లార్చుకోవడం చూస్తే వారెలాంటి అధ్యయన రాహిత్యంతో బాధపడుతున్నారో అర్థమవుతోంది. చైనా సైనిక ట్యాంకులను నడిపించి వేలాదిమందిని రక్తపుటేరుల్లో ముంచెత్తింది. తియాన్మన్ స్క్వేర్‌కు మాయనిమచ్చ తెచ్చింది. ఇదంతా దేనిని సూచిస్తోంది?.. అన్న ఆత్మవిమర్శ చేసుకోవాలిగా?.. చైనా చైర్మన్ మన చైర్మన్ అని నినదించిన పార్టీ నుంచి ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ ఆలోచనలు పూర్తిగా సంకుచితత్వంలోకి వెళ్లాయి.

పాతికేళ్ల క్రితమే బెర్లిన్ గోడ కూలిపోయి, తూర్పు, పశ్చిమ జర్మనీలు ఏకమైన సందర్భంలోనే ప్రపంచంలో రెండు వర్గాల సిద్ధాంతానికి నూకలు చెల్లాయని, ఆధునిక అద్వైతానికి ఆదరణ పెరుగుతోందని, ఆ వెలుగులోనే అశేష కార్మిక - కర్షకులకు మేలు ఎలా చేయగలమని ఆలోచించాల్సిందిపోయి, స్టాలిన్, హిట్లర్లకన్నా ఎక్కువ నియంతృత్వాన్ని ఎలా పాదుకొల్పాలన్న యావతో, ఉక్కుపాదంతో పాలించడానికి ఉవ్విళ్లూరడం వివేకవంతమైన ఆలోచన అవుతుందా?

ప్రజలపై అపారమైన ప్రేమ, వారి అభివృద్ధిపై అంకితభావంగలవారమని చెప్పుకునే మావోయిస్టులు, నక్సలైట్లు భారతదేశ పరిస్థితులను, ప్రజల 'ఆత్మ'ను పట్టించుకోకుండా, తూర్పుయూరప్, రష్యాలోని పరిణామాలను గమనంలోకి తీసుకోకుండా, చైనా సోషలిస్టు రోడ్డును వదిలి పెట్టుబడిదారి మార్గం అనుసరించిన వైనాన్ని గుర్తించకుండా, నేపాల్ మావోయిస్టులు సాయుధపోరాటం ద్వారా ఆశించిన 'మార్పు' తీసుకురాలేమని స్పష్టంగా పేర్కొన్నా చెవిన పెట్టకుండా, కొలంబియాలో అరివీర భయంకరంగా యాభై ఏళ్లకు పైగా గెరిల్లా పోరాటం చేసిన మావోయిస్టులు జన జీవన స్రవంతిలో చేరిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, దండకారణ్యం, దాని చుట్టుపక్కల ఆదివాసీలను, అమాయక ప్రజలను కత్తుల వంతెనపై నడిపించేందుకు అహోరాత్రులు శ్రమించడం వల్ల ప్రజలు ప్రపంచంతో కలిసి నడిచే అవకాశం ఉందా?.. ప్రత్యామ్నాయమన్న ఒక ముద్దుపేరు పెట్టుకుని విశ్రమించని విక్రమార్కుడిలా పనిచేస్తామంటే అదెలా ఆధునికత అవుతుంది?, శాస్త్రీయమవుతుంది? మార్క్స్ మౌలిక విశ్లేషణకు 21వ శతాబ్దం సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక వర్గానికి కల్పించిన - అందించిన జ్ఞానానికి అసలు పొంతన లేదు. అయినా శ్రామికవర్గ విముక్తి వర్గ రహిత సమాజంలోనే సాధ్యమని 21వ శతాబ్దంలో, నెటిజెన్ల కాలంలో, ప్రపంచం ఒక కుగ్రామం అని భావిస్తున్న తరుణంలో వర్చువల్ వరల్డ్‌లో బతకడం అభ్యాసం చేస్తున్న సమయంలో మావోయిస్టుల పంతం, కాలం చెల్లిన వైఖరి ఏ రకంగా ఉపయుక్తమైంది?

గుడ్సా ఉసెండీ, జంపన్న ఇంకా ఎందరో ఈ విషయమై చర్చ జరగాలని, కాలానుగుణంగా విధానాలు మారాలని సూచించినా మొండిగా, మూర్ఖంగా వ్యవహరించడంవల్ల నష్టపోయేది ప్రజలే.. ఏ ప్రజల కోసమైతే ప్రాణాలను సైతం పణంగా పెట్టామని చెబుతున్నారో ఆ ప్రజలే నష్టపోయే పనులు చేపడితే, దశాబ్దాల పాటు అదే దారిలో పయనిస్తే ఎవరైనా సమర్థిస్తారు?.. ఎలా సంఘీభావం తెలుపుతారు? సాయుధపోరాటం కాదు, నేడు సాఫ్ట్‌వేర్ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే కాలంలో ఉన్నప్పుడు ఆ దిశగా ఆలోచించడమే మేలు కదా? సాయుధ పోరాట పాత్రను సాఫ్ట్‌వేర్ నిర్వహిస్తున్న సంగతి పట్టించుకోకపోతే ఎలా?.. మావోలు ఇంకా పాపం మూటగట్టుకోవడం సబబు కాదుగదా?

వుప్పల నరసింహం

9985781799

ఉత్తరాయణం

ప్రజారవాణాను ప్రోత్సహించాలి

ఢిల్లీ మెట్రోలో ఆమధ్య ప్రయాణించిన ప్రధాని నరేంద్రమోదీ పెట్రో ఉత్పత్తుల దిగుమతులను తగ్గించడానికి, విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడానికి ప్రజలు వ్యక్తిగత వాహన వినియోగాన్ని తగ్గించి ప్రజారవాణావైపు మళ్లాలని కోరడం సమంజసమే. అయితే ఆయన మాటలు ఆచరణలోకి రావాలంటే ప్రభుత్వమే ప్రోత్సాహక చర్యలు తీసుకోవాలి. చార్జీలు తగ్గించి ప్రజలకు అందుబాటులో ఉండాలి. బస్సుల టిక్కెట్ ధరలు భారీగా ఉండటం, సుదూర ప్రాంతాలకు రైలు సౌకర్యాలు తగినట్లు లేకపోవడం వల్ల ప్రజలు సొంత వాహనాలను వినియోగించక తప్పడం లేదు. పర్యావరణానికి హానిచేస్తున్న కారణాల్లో ఇదికూడా ఒకటి. అందువల్ల చార్జీల బాదుడు లేకుండా పర్యావరణ, ప్రజారోగ్య అనుకూల విధానాలు అమలు చేస్తే ప్రజారవాణా వ్యవస్థకు చక్కటి ఆదరణ లభిస్తుంది.

-తిరుమలశెట్టి సాంబశివరావు, నర్సరావుపేట

ఏపీలో తెలుగు సభలు నిర్వహించాలి

తెలంగాణలో గత ఏడాది ప్రపంచ తెలుగు మహాసభలు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆరో ప్రపంచ తెలుగు మహాసభలను ఈసారి అమరావతిలో నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు రావాలి. వాటిని ఈ ఏడాదే నిర్వహించాలి. 2019లో ఎన్నికలు వస్తాయి. అందువల్ల ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం కష్టమవుతుంది. ప్రాంతీయ బేధాలు చూపకుండా పారదర్శకంగా ఈ సభలను జరపాలి. ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల తెలుగువారున్నారు. వారందరికీ నచ్చేలా ఈ సభలను జరపాలి.

-వాండ్రంగి కొండలరావు, పొందూరు



మంచు కమ్మిన బతుకు బండి

మంచు కమ్మినా పొగమంచు కుమ్మేసినా ఆగనిది జీవన పోరాటం. చలికి వణుకుతూ బతుకు బండిని నడిపించాల్సిందే. అది కాలి నడకైనా సైకిలైనా మరో వాహనమైనా మంచు ఏటికి ఎదురీదాల్సిందే. మంచుతో పాటు కాలుష్యం కాటేస్తున్నా దిలాసాగా ఉండలేని బతుకు పోరాటమిది. అమృత్‌సర్‌లో ఈ దృశ్యాన్ని చూసిన ఎవరికైనా ఎవరి మదిలోనైనా కలిగే భావన ఇదే. రెక్కాడితే డొక్కాడని బడుగు జీవులకు నిత్య పోరాటంతోనే జీవనం సాగేది.

నా రూటే వేరు

ఏసీ కార్లు, విమానాలే పార్లమెంటు సభ్యుల జీవితాలనుకుంటాం. వీటికి అతీతంగా ఓ సామాన్యుడిలా సైకిల్‌పై వెళ్లే అసామాన్యులు ఉంటారని చెప్పడానికి ఈ చిత్రానికి మించిన నిదర్శనం మరొకటి ఉండదు. ఎప్పుడో ఎంపీలు బస్సుల్లో వెళ్లడం, రిక్షాల్లో వెళ్లడం జరిగేది. ఇప్పుడు కాలం మారింది. వీటి జోలికి ఎవరూ పోవడం లేదు. కానీ కేంద్రంలో అధికారం తమదే అయినా బిజెపి రాజ్యసభ సభ్యుడు వికాస్ మహాత్మే మాత్రం తన రూటే వేరంటున్నారు. రయ్‌మంటూ పార్లమెంటు హౌస్‌కు కారులో దూసుకురావాల్సింది పోయి సామాన్యుడి బతుకు బండి అయిన సైకిల్‌పైనే ప్రజాస్వామ్య సౌధంలోకి అడుగుపెట్టడం విశేషమే.



హర్యానాలో ఘాతుకం ● పోలీసుల అదుపులో హంతకుడు

ఆరుగుర్ని కొట్టిచంపిన మాజీ లెఫ్టినెంట్

పల్వాల్, జనవరి 2: హర్యానాలోని పల్వాల్‌లో మంగళవారం వేకువజామున దారుణం చోటుచేసుకుంది. మతిభ్రమించిన ఓ మాజీ సైనిక ఉద్యోగి ఇనుపరాడ్‌తో ఆరుగుర్ని కొట్టి చంపేశాడు. తెల్లవారుజామున 2.30 నుంచి 3.30 మధ్య ఈ బీభత్స కాండ సాగింది. పోలీసుల కథనం ప్రకారం నరేష్ ధన్‌కాడ్ అనే 40ఏళ్ల వ్యక్తి సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేశాడు. ఆరోగ్య కారణాలతో 2003లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశాడు. మంగళవారం తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో పల్వాల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలోకి ప్రవేశించాడు. నీలం రంగు స్వెట్టర్, తెలుపుప్యాంట్ ధరించిన నరేష్ ఆసుపత్రి కారిడార్‌లో తచ్చాడుతూ సీసీటీవీ కెమెరాలో కనిపించాడు. చేతిలో ఇనుప రాడ్ పట్టుకుని ఎవరి కోసమో ఎదురుచూశాడు. బంధువులను పరామర్శించడానికి వచ్చిన 35 ఏళ్ల అంజుం అనే మహిళను రాడ్‌తో కొట్టి చంపేశాడు. ఆసుపత్రి మొదటి అంతస్తు ఆవల ఇంటెన్సివ్‌కేర్ యూనిట్ వద్ద నిద్రిస్తున్న ఆమెపై దాడికి తెగబడ్డాడు. అక్కడ నుంచి ఆగ్రా రోడ్డు ఇంటర్‌సెక్షన్‌కు వెళ్ళి ముగుర్ని రాడ్‌తో కొట్టగా అక్కడికక్కడే మృతి చెందారని పల్వాల్ ఎస్పీ సులోచన కుమారి తెలిపారు. అక్కడే మరొక ఇద్దర్ని పొట్టనబెట్టుకున్నాడని ఆమె చెప్పారు. అలాగే సెక్యూరిటీ గార్డును వదిలిపెట్టలేదు. రాడ్‌తో కొట్టి హత్య చేశాడని అన్నారు. ఈహత్యలన్నీ గంటలోపే చేశాడని పోలీసులు వెల్లడించారు. సీసీటీవీలోని దృశ్యాలను పోలీసులు విడుదల చేశారు. ఒక హత్య పోలీసు స్టేషన్ సమీపంలోనే జరిగిందని ఎస్పీ పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హంతకుణ్ని పట్టుకోడానికి వెళ్లగా వారిపైనా దాడి చేశాడు. ఈ సందర్భంగా పలువురు పోలీసులూ గాయపడ్డారని డిప్యూటీ పోలీసు సూపరింటిండెంట్ అభిమన్యు లోహాన్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శిస్తే నిందితుడు లూఠీ చేయడానికి వచ్చిన దాఖలాలు లేవు. అతికష్టం మీద సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆదర్శ్‌నగర్ దగ్గర హంతకుడిని పట్టుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలోనే ఆదర్శ్‌నగర్ ఉంటుంది. అరెస్టయిన మాజీ సైనికుణ్ని తొలుత సివిల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఫరీదాబాద్ రిఫర్ చేశారు. తరువాత ఢిల్లీ సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ పోలీసులను ఫరీదాబాద్ ఆసుపత్రికి తరలించారు.

అమరావతికి 3324 కోట్ల రుణం

ప్రపంచ బ్యాంకు వద్ద ఏపీ దరఖాస్తు ★ ప్రాథమిక దశలో అధ్యయనం, మదింపు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: అమరావతి రాజధాని నగరాభివృద్ధి ప్రాజెక్టుకు ఏపీ కోరిన రుణ దరఖాస్తు ప్రపంచ బ్యాంకు వద్ద పరిశీలనలో ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. రూ.3,324 కోట్లు రుణం కోరతూ ఆంధ్ర ప్రభుత్వం ప్రపంచబ్యాంకుకు దరఖాస్తు సమర్పించిందని జైట్లీ వివరించారు.

వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి అరుణ్ జేట్లీ రాతపూర్వక సమాధానమిస్తూ.. రుణ మంజూరు విషయంలో ప్రపంచ బ్యాంకు ప్రారంభించిన అధ్యయనం, మదింపుప్రాథమిక దశలో ఉందన్నారు. ప్రాజెక్టు మదింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత రుణానికి సంబంధించిన సంప్రతింపులు ప్రారంభం అవుతాయని వివరించారు. ఈ సంప్రతింపుల ప్రక్రియ పూర్తయిన తరువాతే ప్రపంచ బ్యాంకు రుణం మంజూరు చేస్తుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి జనరల్ క్యాటగిరీ రాష్ట్రాలు ప్రపంచ బ్యాంకు వంటి బహుముఖ ఆర్థిక సంస్థల నుంచి పొందే ఆర్థిక సాయం మొత్తం వ్యయంలో 70శాతం మించకూడదని, మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత వనరుల నుంచే సమకూర్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత జరిగే ఖర్చును రుణంలో భాగంగా ప్రపంచ బ్యాంకు నియమిత కాలపరిమితి ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తూ వస్తుందని మంత్రి అరుణ్ జైట్లీ వివరించారు.

మూడేళ్లలో 1500 కోట్లు

ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిలో అసెంబ్లీ, రాజ్‌భవన్, హైకోర్టు, సచివాలయం తదితర సదుపాయాల నిర్మాణానికి గడిచిన మూడేళ్లలో రూ.1500 కోట్లు విడుదల చేసినట్టు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పి రాధాకృష్ణన్ వెల్లడించారు. రాజ్యసభలో ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నూతన రాజధానిలో సదుపాయాల కల్పనకు ప్రత్యేక సహాయం కింద కేంద్రం నిధులు విడుదల చేసినట్టు కేంద్ర మంత్రి వివరించారు.

రెండో రాజధానిగా హైదరాబాద్ ప్రతిపాదన లేదు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి స్పష్టీకరణ

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: దేశ రెండో రాజధానిగా ఏర్పాటుకు ఎటువంటి ప్రణాళిక లేదని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. మంగళవారం టీఆర్ఎస్ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ దక్షిణ భారతదేశంలో రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏమైనా ఉందా అని లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

కాపు రిజర్వేషన్ల బిల్లు ఇంకా చేరలేదు: కేంద్రం

కాపు రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందుపరచాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి కాపు రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు తమ వద్దకు ఇంకా రాలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ వెల్లడించారు. గుంటూరు ఎంపీ గల్లా జయ్‌దేవ్ లోక్‌సభలో ప్రభుత్వ సర్వీసుల్లో, విద్య తదితర అంశాలలో కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ పొందుపరచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసిందా అని అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయండి : మల్లారెడ్డి

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సైనిక్ స్కూళ్లు రెండూ విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లినందున తెలంగాణలోని మల్కాజిగిరి ప్రాంతంలో ఒక సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఎంపీ మల్లారెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు లోక్‌సభలో మంగళవారం ఆయన ప్రత్యేక ప్రస్తావన చేశారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌లోకి ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ!

న్యూఢిల్లీ, జనవరి 2: దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో రెండేళ్ల విరామం తరువాత ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, బీఎస్ఎఫ్‌లు పాల్గొంటున్నాయి. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ), సహస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) రెండేళ్ల తరువాత పరేడ్‌కు వస్తున్నాయి. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) ఏడాది విరామం తరువాత గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొంటాయని అధికార వర్గాలు వెల్లడించాయి. సాయుధ దళాల కొత్త రొటేషన్ వల్ల ఈ మార్పులు జరిగాయి.

వైష్ణోదేవి ఆలయానికి పెరిగిన భక్తులు

జమ్మూ, జనవరి 2: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మాతా వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతోంది. గత ఏడాది 81 లక్షల 78వేలమంది భక్తులు ఆలయాన్ని సందర్శించారని, 2016తో పోలిస్తే 4 లక్షల 54వేలమంది యాత్రికులు పెరిగారని అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. కొత్త ఏడాదిని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్, వైష్ణోదేవి ఆలయ బోర్డు చైర్మన్ ఎన్.ఎన్.వోహ్రా సతీ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

మనది బలమైన చెలిమి

లెసతో కింగ్ లెట్సీ -3తో రాష్ట్రపతి కోవింద్

భారత పర్యటనలో రాజ దంపతులు

న్యూఢిల్లీ, జనవరి 2: లెసతో అభివృద్ధి సాధనకు భారత్ అన్ని విధాలా సహకారం అందించడానికి కట్టుబడి ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. అంతర్జాతీయ న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఎన్నికైన దల్వీర్ భండారీ సహ బహుపాక్షిక కార్యవర్గాల ఏర్పాటు విషయంలో భారత్‌కు లెసతో అందిస్తున్న సహకారం మర్చిపోలేనిదన్నారు. ఈమేరకు రాష్ట్రపతి కార్యాలయం ఓ అధికారిక ప్రకటన వెలువరించింది. భారత పర్యటనకు వచ్చిన లెసతో రాజు లెట్సీ -3, ఆయన భార్య, రాణి మసెనటె మెహతో సీసో మంగళవారం రాష్ట్రపతి కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కోవింద్ మాట్లాడుతూ భారత్-లెసతో మధ్య హృదయపూర్వక బాంధవ్యం ఉందని గుర్తు చేశారు. ఆ దేశంతో ప్రగతి భాగస్వామిగా ఉండేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. భారత్ తరపున లెసెతోలో ఐటీ కేంద్రం నెలకొల్పి, అక్కడి యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు.

బహుపాక్షిక కార్యవర్గాల్లో భారత్ సభ్యత్వాలకు లెసతో అందిస్తున్న మద్దతు మరువలేనిదన్నారు. ఇంటర్నేషనల్ ట్రిబ్యునల్ ఫర్ ది లా ఆఫ్ ది సీ (ఐటిఎల్ఓఎస్)లో నీరు చద్దాకు స్థానం దక్కడం, అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా భారత సంతతికి చెందిన దల్వీర్ భండారీకి అవకాశం దక్కిన సందర్భంలో లెసతో సహకారం ఎప్పటికీ మర్చిపోయేది లేదని రాష్ట్రపతి కోవింద్ గుర్తు చేసుకున్నారు.



భారత పర్యటనకు వచ్చిన లెసతో రాజదంపతులు మంగళవారం రాష్ట్రపతి కోవింద్‌ను కలుసుకున్నప్పటి చిత్రం

సెలెక్ట్ కమిటీకి 'మెడికల్ బిల్లు'!

ఐఎంఏ సమ్మె విరమణ

న్యూఢిల్లీ, జనవరి 2: నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు-2017 పార్లమెంట్ సెలక్ట్ కమిటీకి పంపాలని ప్రభుత్వం నిర్ణయించడంతో మంగళవారం జరగాల్సిన వైద్యుల సమ్మె ఉపసంహరించుకున్నారు. బిల్లును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా సమ్మెకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపునిచ్చింది. దేశంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఔట్‌పేషెంట్ సేవలు 12 గంటల పాటు నిలిపివేయాలని ఐఎంఐ నిర్ణయించింది. అయితే బిల్లును పార్లమెంటు స్థాయి సంఘానికి పంపాలని మంగళవారం లోక్‌సభ నిర్ణయించినందున సమ్మెను ఉప సంహరించుకున్నట్టు ఐఎంఐ వెల్లడించింది.తమ విజ్ఞప్తిని మన్నించి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపిన లోక్‌సభ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు కేకే అగర్వాల్ స్పష్టం చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు(ఎన్ఎంబీ)ని దేశ వ్యాప్తంగా వైద్యులు వ్యతిరేకించారు. వైద్యుల ఆందోళనకు ప్రతిపక్షపార్టీలు మద్దతు తెలిపాయి. దీంతో లోక్‌సభలో ఎన్ఎంబీ అంశాన్ని లేవనెత్తారు. అయితే బిల్లును పార్లమెంట్ స్థాయి సంఘం పరిశీలనకు పంపుతున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ సభలో ప్రకటించారు.

రాజ్యసభలో అరుదైన రికార్డు!

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 2: రాజ్యసభలో మంగళవారం అరుదైన రికార్డు ఆవిష్కృతమైంది. పెద్దల సభ జీరో అవర్ అజెండాలో పొందుపరిచిన అంశాలతోపాటు ప్రత్యేక ప్రస్తావనలను రికార్డుస్థాయిలో పూర్తిచేసి చరిత్ర సృష్టించింది. మొదటిసారిగా సభలో జీరో అవర్‌లో సభ్యులు లేవనెత్తిన అంశాలను, సభ్యుల ప్రత్యేక ప్రస్తావనలను పూర్తి చేసినట్టు రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్య నాయుడు వెల్లడించారు. సభలో సభ్యులు సహకారంవల్లనే ఇది సాధ్యమయిందని, మున్ముందు ఇలాంటి సహకారమే కావాలని ఆయన అన్నారు. భవిష్యత్‌లోనూ జీరో అవర్ సమయం వృధా కాకుండా సభ్యులు వ్యవహరిస్తారన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రులు సత్వరం స్పందిస్తే సభలో మరిన్ని విషయాలకు సమాధానాలు ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. రెండు వారాలుగా సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే మంగళవారం జీరో అవర్‌లో 10 మంది సభ్యులు లేవనెత్తిన అంశాలతోపాటు, ప్రత్యేక ప్రస్తావనలను కూడా పూర్తిచేశారు. కాగా జీరో అవర్‌లో ఎస్పీ రాజ్యసభ సభ్యుడు నరేష్ అగర్వాల్ దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.

తమిళ గవర్నర్‌కు నిరసనల సెగ

డీఎంకే నల్లజెండాల ప్రదర్శన

తంజావూర్, జనవరి 2: ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో గవర్నర్ జోక్యం పెరుగుతోందంటూ డిఎంకె కార్యకర్తలు మంగళవారం ఇక్కడ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నల్లజెండాలు ప్రదర్శించి నినాదాలు చేశారు. స్వచ్ఛభారత్ అమలుపై సమీక్ష జరిపేందుకు రెండు రోజుల పర్యటన నిమిత్తం గవర్నర్ భన్వారీలాల్ పురోహిత్ తంజావూర్ వచ్చారు. ఇలాంటి సమీక్షా సమావేశాలు జరపడం ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని డిఎంకె ధ్వజమెత్తింది. అయితే డిఎంకె ఆరోపణలను రాజ్‌భవన్ వర్గాలు ఖండించాయి. కాగా, కోయంబత్తూరు, తిరునల్వేలి, కన్యాకుమారి, కడలూర్ జిల్లాల్లో గతంలో పర్యటించిన ఆయన అధికారులతో సమీక్షా సమావేశాలు జరిపారు. తన చర్యలను సమర్థించుకున్న గవర్నర్ భన్వారీలాల్, ఇది రాజ్యాంగపరంగా తనకున్న విధుల్లో భాగమేనని గతంలోనే పేర్కొన్నారు.

ఒకేసారి చెల్లించండి

అత్యాచార బాధితురాలికి నష్టపరిహారంపై సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 2: బధిర బాలిక అత్యాచార బాధితురాలికి 15 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని ఏకకాలంలోనే చెల్లించాలని హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఈ బాలిక అత్యాచార కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవరిస్తూ ఆదేశాలు జారీచేసింది. అత్యాచారానికి గురైన ఈ బాలిక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ కేసుకు సంబంధించి హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు తీర్పునిస్తూ బాధితురాలికి జీవితకాలం ప్రతి నెలా 30వేల రూపాయల పరిహారాన్ని చెల్లించాలని తీర్పు చెప్పింది. అయితే ఈ తీర్పును సవరించాల్సిన అవసరం లేదని తొలుత భావించినా, నష్టపరిహార చెల్లింపులో మాత్రం సవరణలు చేసింది. బధిర బాలిక కావడంతో నష్టపరిహారాన్ని ఏకకాలంలో చెల్లిస్తేనే మంచిదని భావించినట్లు జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌తో కూడిన సుప్రీం బెంచ్ తీర్పులో పేర్కొంది. నష్టపరిహారం మొత్తాన్ని జాతీయ బ్యాంక్‌లో ఫిక్సెడ్ డిపాజిట్ చేయాలని, రాష్ట్ర న్యాయసేవల అథారిటీకి చెందిన మెంబర్ సెక్రటరీతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని కూడా తీర్పులో పేర్కొంది. ఆ డిపాజిట్‌పై వచ్చే వడ్డీ మొత్తాన్ని ప్రతి నెలా విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించాలని వివరించింది. బాలిక సంక్షేమం కోసం ఈ నిధి సక్రమంగా ఖర్చు చేసేలా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించింది.

అత్యాచార బాధితులకు జీవితకాలం నష్టపరిహారం చెల్లించే పథకం ఏదీ లేదంటూ హిమాచల్ ప్రభుత్వం హైకోర్టు తీర్పుపై సుప్రీంను ఆశ్రయించింది. ఈ కేసులో వాదనలు విన్న సుప్రీం బెంచ్ బాధిత బాలికకు నష్టపరిహార మొత్తాన్ని ఏకకాలంలో చెల్లించాలని ఆదేశించింది.



ప్రధాని నరేంద్ర మోదీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న పిఎంఓ అధికారులు, ఎస్పీజీ సిబ్బంది

ఖలీదా జియాపై అరెస్టు వారెంట్

పేలుళ్ల కేసులో బంగ్లా కోర్టు ఆదేశం

ఢాకా, జనవరి 2: మూడేళ్లనాటి కేసులో మాజీ ప్రధాని ఖలీదా జియాపై బంగ్లాదేశ్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ప్రభుత్వ విధానాలకు నిరసనగా 2015లో ఖలీదా నాయకత్వంలోని పార్టీ ఓ ఆందోళన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఓ బస్సుపై బాంబుదాడి జరిగి ఎనిమిది మంది మృతి చెందారు. దీనిపై మాజీ ప్రధాని ఖలీదా జియాపై కేసు నమోదైంది. పేలుళ్ల ఘటనకు సంబంధించి జియాపై పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. 72 ఏళ్ల ఖలీదా జియా అరెస్టుకు కొమిల్లా జిల్లా కోర్టు న్యాయమూర్తి జొయ్‌నాబ్ బేగం వారెంట్ జారీ చేశారు. ఖలీదా జియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) 2014 సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించింది. అవామీలీగ్ పార్టీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా బీఎన్‌పీతోపాటు దాని మిత్రపక్షాలైన 20 పార్టీలు ఓ నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. జాతీయస్థాయిలో రహదారుల దిగ్బంధనం చేశాయి. సెంట్రల్ కొమిల్లా జిల్లాలో ఆందోళనకారులు ఓ బస్సుపై పెట్రోల్ బాంబు విసిరారు. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. దీనిపై పోలీసుల చార్జిషీట్ ఆధారంగా మాజీ ప్రధాని ఖలీదా జియాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఖలీదాపై ఎన్నో కేసులున్నాయి. అవినీతి, అక్రమ కేసుల్లో ఆమె నిందితురాలిగా ఉన్నారు. అలాగే 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధానికి సంబంధించి ఖలీదా జియా చేసిన అనుచిత వ్యాఖ్యలపైనా మాజీ ప్రధానిపై కేసు నమోదైంది. మూడేళ్ల క్రితం దేశ వ్యాప్త ఆందోళన కార్యక్రమాల సందర్భంగా 125 మంది మృతి చెందారు. ఈ ఘటనలకు సంబంధించి అనేక కోర్టుల్లో ఖలీదాజియాపై కేసులు నడుస్తున్నాయి. కాగా హత్య, పేలుళ్లకు సంబంధించిన కేసుల్లో బీఎన్‌పీ నేత, జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ సహా 48 మందికి మరణశిక్ష విధించాలని ప్రాసిక్యూటర్లు డిమాండ్ చేసిన మర్నాడే మాజీ ప్రధానిపై అరెస్టు వారెంట్ జారీ కావడం గమనార్హం.

క్లినికల్ ట్రయల్స్ పర్యవేక్షణకు బలమైన వ్యవస్థ


కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి అనుప్రియ పటేల్

న్యూఢిల్లీ, జనవరి 2: క్లినికల్ ట్రయల్స్‌లో తరచూ ఎదురయ్యే మరణాలు, ప్రతిబంధకాలను ధీటుగా ఎదుర్కొని ఉత్తమమైన, బలమైన వ్యవస్థను రూపొందించనున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. రాజ్యసభలో మంగళవారం ఈమేరకు జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2016లో తీవ్రమైన ప్రతికూల సంఘటనల నేపథ్యంలో 378 మరణాలు సంభవించగా, వీటిలో 11 క్లినికల్ ట్రయల్స్ ద్వారానే జరిగాయని తమ పరిశీలనలో తేలిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా సంఘటనలపై పరిశీలనకు వీలుగా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అత్యున్నతస్థాయి కమిటీని నియమించినట్టు ఆమె తెలిపారు. క్లినికల్ ట్రయల్స్ నిర్వహించకుండా మందులు అమ్మడాన్ని నిరోధించేందుకు సుప్రీం తీర్పు మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విధానాన్ని మరింత పటిష్టవంతం చేయనున్నట్టు ఆమె స్పష్టం చేశారు. క్లినికల్ ట్రయల్స్ నిర్వహించకుండా 33 మందులకు అనుమతి ఇవ్వడాన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రస్తావించినట్టు ఆమె తెలిపారు. 2013లో సుప్రీంకోర్టు జారీచేసిన ఆర్డర్ ప్రకారం తాము క్లినికల్ ట్రయల్స్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు వీలుగా ముగ్గురు సభ్యులు గల నిపుణుల కమిటీని నియమించినట్టు కేంద్రమంత్రి రాజ్యసభలో సమాధానం చెప్పారు. 2013 సంవత్సరానికి ముందు క్లినికల్ ట్రయల్స్‌లో జరిగే తప్పిదాల్లో బాధితులకు సరైన నష్టపరిహారం అందించిన దాఖలాలు లేవని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం గతంలో జరిగిన తప్పిదాలు మళ్లీమళ్లీ జరిగేందుకు ఆస్కారం లేకుండా బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు గట్టి చర్యలు తీసుకుంటోందని ఆమె స్పష్టం చేశారు. ఈ నూతన విధానం అమల్లోకి వస్తే దురదృష్టకర సంఘటనలను మరింత తగ్గించేందుకు తద్వారా బాధితులకు సరైన, సకాలంలో నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపడతామని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇదిలావుండగా 59వ పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సూచనల మేరకు రంజిత్‌రాయ్ చౌదరి చైర్మన్‌గా నియమించిన నిపుణుల కమిటీ 33 క్లినికల్ ట్రయల్స్‌ను మాఫీ చేసినట్టు తెలిపారు.

బిజినెస్

పుంజుకున్న తయారీరంగం

- డిసెంబర్‌లో 54.7కు చేరిన పీఎంఐ వృద్ధి రేటు
- గత ఐదేళ్లలో ఇదే అత్యంత వేగమైన వృద్ధి రేటు





న్యూఢిల్లీ, జనవరి 2: దేశ తయారీ రంగం (మానుఫాక్చరింగ్ సెక్టర్) నిరుడు డిసెంబర్ నెలలో బాగా పుంజుకుంది. గత అయిదేళ్ల కాలంలో ఏ నెలలోనూ లేనంతగా అత్యంత వేగంగా వృద్ధి చెందింది. డిసెంబర్ నెలలో నిర్వహణ పరిస్థితులు అమిత వేగంతో మెరుగుపడటంతో పాటు కొత్త ఆర్డర్లు గణనీయంగా పెరగడం వల్ల తయారీ రంగం గత అయిదేళ్ల కాలంలో అత్యంత వేగంగా వృద్ధి చెందిందని ఒక నెలవారీ సర్వే వెల్లడించింది. నిరుడు నవంబర్‌లో 52.6 శాతం ఉన్న నిక్కెయి ఇండియా మానుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) డిసెంబర్‌లో 54.7 శాతానికి పెరిగింది. మూడు కేటగిరీలయిన కన్స్యూమర్, ఇంటర్మీడియెట్, ఇన్వెస్ట్‌మెంట్‌లు వృద్ధి సాధించడం వల్ల డిసెంబర్ నెలలో తయారీ రంగం వేగంగా వృద్ధి చెందింది. ఈ సూచీ 50 పాయింట్లకు పైన నమోదు కావడం వరుసగా ఇది అయిదో నెల. 2012 డిసెంబర్ నుంచి చూస్తే గత డిసెంబర్‌లో ఉత్పత్తి వేగంగా విస్తరించడం, 2016 అక్టోబర్ నుంచి చూస్తే గత డిసెంబర్‌లో కొత్త ఆర్డర్లు గణనీయంగా పెరగడం వల్ల తయారీ రంగంలో వేగవంతమైన వృద్ధి సాధ్యమయిందని ఐహెచ్ఎస్ మార్కిట్‌కు చెందిన ఆర్థికవేత్త, ఈ నివేదకను రూపొందించిన ఆష్నా డోదియా పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి గట్టి డిమాండ్ ఉండటం తయారీ రంగం వేగంగా వృద్ధి చెందడానికి దారితీసిందని వివరించారు. 2017 సంవత్సరాంతంలో ఇండియన్ మానుఫాక్చరర్లు తమ సిబ్బంది స్థాయిలను పెంచారు. నిజానికి, 2012 ఆగస్టు నుంచి ఉద్యోగాల కల్పన పటిష్ఠమైన స్థాయికి వేగంగా పెరిగిందని ఈ సర్వే వెల్లడించింది.

జూలై ఒకటో తేదీ నుంచి దేశంలో అమలులోకి తెచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వల్ల ముడి సరుకుల ధరలు బాగా పెరిగాయని డోదియా తెలిపారు. ఆర్థిక వ్యవస్థ ఇటీవలి షాక్‌లకు సర్దుబాటు కావలసి ఉందని, అందువల్ల ఆర్థిక వ్యవస్థ ముంగిట ఇంకా సవాళ్లు నిలిచే ఉన్నాయని, అయితే సర్వే చరిత్రను పరిశీలిస్తే మొత్తం మీద వృద్ధి పథం పైకి ఎగబాకే ధోరణి బాగా ఉందని పేర్కొన్నారు.

ఎదుగూబొదుగూ లేని మార్కెట్లు

- 0.49 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- ఏడు పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- కార్పొరేట్ ఫలితాలు వెలువడనుండటంతో అప్రమత్తంగా వ్యవహరించిన మదుపరులు
- ప్రభావితం చేసిన ముడి చమురు ధరలు





కీలకమైన పారిశ్రామిక గణాంకాలు సానుకూలంగా ఉన్నప్పటికీ మంగళవారం షేర్లు తమ లాభాలను నిలబెట్టుకోలేకపోయాయి. ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం వల్ల చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. ప్రభుత్వ రంగ చమురు సంస్థల్లో బీపీసీఎల్ 2.12 శాతం, హెచ్‌పీసీఎల్ 1.98 శాతం, ఐఓసీ 0.83 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ ప్యాక్‌లోని కంపెనీలలో భారతి ఎయిర్‌టెల్ అత్యధికంగా 2.24 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ 1.35 శాతం, ఎల్ అండ్ టీ 1.01 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.91 శాతం, టీసీఎస్ 0.79 శాతం, ఐటీసీ 0.76 శాతం, అదాని పోర్ట్స్ 0.62 శాతం, హిందస్తాన్ లీవర్ 0.58 శాతం, ఇన్ఫోసిస్ 0.49 శాతం, యెస్ బ్యాంక్ 0.49 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.42 శాతం చొప్పున నష్టపోయాయి.

ముంబయి, జనవరి 2: కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు వెలువడనుండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం, ఐరోపా మార్కెట్లలో షేర్ల ధరలు పెరగక పోవడం వంటి కారణాల వల్ల మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ మంగళవారం 33,913.55 పాయింట్ల హెచ్చు స్థాయి వద్ద ప్రారంభమయి, తరువాత మరింత ముందుకు సాగుతూ 33,964.14 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే సెషన్‌లో మధ్యాహ్న సమయం సమీపిస్తున్న వేళ మదుపరులు లాభాల స్వీకరణకు పూనుకోవడంతో సెన్సెక్స్ ఆరంభ లాభాలను కోల్పోయి, 33,703.37 పాయింట్లకు దిగజారింది. తరువాత కొంత వరకు కోలుకున్న ఈ సూచీ చివరకు సోమవారం నాటి ముగింపుతో పోలిస్తే 0.49 పాయింట్లు దిగజారి, 33,812.26 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఈ సంవత్సరం తొలి సెషన్ అయిన సోమవారం 244.08 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. 50 షేర్లతో కూడిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ మంగళవారం 6.65 పాయింట్లు (0.06 శాతం) పెరిగి, 10,442.20 పాయింట్ల వద్ద స్థిరపడింది. అంతకు ముందు ఇంట్రా-డేలో ఈ సూచీ 10,495.20-10,404.65 పాయింట్ల మధ్య కదలాడింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల ధోరణి ఉన్నప్పటికీ, దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్ పన్నును ప్రవేశపెడతారనే భయం మదుపరులను ఆవరించడంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలు వెలువడనుండటం వల్ల దేశీయ మార్కెట్లు ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోయాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రీసెర్చ్ విభాగం అధినేత వినోద్ నాయర్ పేర్కొన్నారు. ఈ వారం చివరలో కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలు వెలువడటం ప్రారంభం అవుతాయి. దీంతో పాటు కేంద్ర బడ్జెట్ సమీపిస్తుండటం వల్ల మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించి, తమ వద్ద ఉన్న షేర్లను విక్రయించడం ద్వారా లాభాలను స్వీకరించారు. కీలకమైన పారిశ్రామిక గణాంకాలు సానుకూలంగా ఉన్నప్పటికీ మంగళవారం షేర్లు తమ లాభాలను నిలబెట్టుకోలేకపోయాయి.

ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం వల్ల చమురు మార్కెటింగ్ కంపెనీల షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. ప్రభుత్వ రంగ చమురు సంస్థల్లో బీపీసీఎల్ 2.12 శాతం, హెచ్‌పీసీఎల్ 1.98 శాతం, ఐఓసీ 0.83 శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ ప్యాక్‌లోని కంపెనీలలో భారతి ఎయిర్‌టెల్ అత్యధికంగా 2.24 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ 1.35 శాతం, ఎల్ అండ్ టీ 1.01 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.91 శాతం, టీసీఎస్ 0.79 శాతం, ఐటీసీ 0.76 శాతం, అదాని పోర్ట్స్ 0.62 శాతం, హిందస్తాన్ లీవర్ 0.58 శాతం, ఇన్ఫోసిస్ 0.49 శాతం, యెస్ బ్యాంక్ 0.49 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.42 శాతం చొప్పున నష్టపోయాయి.

మరోవైపు, ఓఎన్‌జీసీ 2.36 శాతం, కోల్ ఇండియా 1.46 శాతం, ఎన్‌టీపీసీ 1.19 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.15 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ 0.87 శాతం, టాటా స్టీల్ 0.75 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.70 శాతం చొప్పున లాభపడ్డాయి.

'కర్నూలు' పేరుతో బియ్యం వ్యాపారం

- తెలంగాణ బియ్యానికి 'కర్నూలు బ్రాండ్'
- హైదరాబాద్‌లో భారీ వ్యాపారం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దుకాణాలు, సూపర్ మార్కెట్లు, హోల్‌సేల్ రైస్ డీలర్లు, చిన్న చిన్న కిరాణ దుకాణాల్లో 'కర్నూలు' రైస్ అమ్ముతుంటారు. కర్నూలు జిల్లాలో పండే వరిధాన్యం తెలంగాణ ప్రజలందరి అవసరాలకు సరిపోతాయా అన్న ప్రశ్న ఉదయిస్తోంది. కర్నూలు రైస్ అంటూ తెలంగాణలోని వ్యాపారులు ప్రత్యేకంగా అమ్ముతుంటారు. మార్కెట్లో కర్నూలు రైస్‌కు ఉన్న డిమాండ్ ఇందుకు కారణమని స్పష్టమవుతోంది. కర్నూలు రైస్ అంటే బిపిటి 5204 రకమని నిపుణులు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో ఉన్న వాతావరణం వల్ల బియ్యం సన్నగా వస్తాయి. వాస్తవంగా కర్నూలు జిల్లాలో దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో వరిధాన్యం (వడ్లు) పండిస్తారు. సుమారు 4.50 లక్షల టన్నుల వడ్లు పండుతాయి. విత్తనాలు తదితర అవసరాలను మినహాయిస్తే నాలుగు లక్షల టన్నుల వడ్లు లేదా రెండున్నర లక్షల టన్నుల బియ్యం వస్తాయి. హైదరాబాద్‌తో సహా తెలంగాణ ప్రజల అవసరాలకు దాదాపు యాభై లక్షల టన్నులపైగా బియ్యం అవసరం అవుతాయి. అంటే కర్నూలులో ఉత్పత్తి అయ్యే బియ్యం మొత్తం తెలంగాణకు పంపించినా మూడు శాతం అవసరాలను కూడా తీర్చలేదు. పైగా కర్నూలులో ఉత్పత్తయ్యే బియ్యంలో నాలుగోవంతు కూడా తెలంగాణకు రావడం లేదు. ఈ పరిస్థితిలో ప్రతి దుకాణంలోనూ 'కర్నూలు రైస్' ఉండే అవకాశం లేదు. కేవలం కర్నూలు రైస్ పేరుతో స్థానికంగా ఉత్పత్తి అవుతున్న బియ్యాన్ని రైస్‌మిల్లర్లు విక్రయిస్తున్నారని స్పష్టమవుతోంది. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న రైస్‌మిల్లర్లు స్థానికంగా ఉత్పత్తయ్యే బియ్యాన్ని కర్నూలు రైస్ పేరును ముద్రించి ఉన్న సంచుల్లో ప్యాక్ చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారని బియ్యం వ్యాపారులే చెబుతున్నారు. బ్రాండ్ నేం వాడుకోవడం అంటే ఇదేనేమో!



గద్వాల గోదాముల్లో విత్తనాల అక్రమ నిల్వ

వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.6.75 కోట్ల విలువ గల విత్తనాలు సీజ్

గద్వాల, జనవరి 2: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విత్తన చట్టం అనుమతులు లేని రూ.6.75 కోట్ల విలువైన 4,064 సంచుల సీడ్ విత్తనాలు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో లభ్యమయ్యాయి. ఇందుకు సంబంధించి జిల్లా వ్యవసాయాధికారి గోవిందునాయక్, ఏడీఏ అశోక్‌వర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ అగ్రో జనటిక్ లిమిటెడ్‌కు చెందిన పత్తి విత్తనాలు గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో నిల్వ ఉన్నాయి. ఈ విషయంపై నకిలీ విత్తనాలు అంటూ పలువురు ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాములో నిల్వ ఉన్న 4,064 సంచులను స్వాధీనం చేసుకోగా, వాటి విలువ దాదాపు రూ.6.75 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. 1983 విత్తన యాక్ట్‌ను ఉల్లంఘించి విత్తనాలను నిల్వ చేశారని వారు తెలిపారు. సరైన సమాచారం, విత్తనాలకు సంబంధించిన లావాదేవీలు సక్రమంగా లేకపోవడంతో సీజ్ చేసినట్టు వారు తెలిపారు. శ్రీరామ అగ్రోజనటిక్ లిమిటెడ్‌కు సంబంధించిన డైరెక్టర్ ఆంజనేయస్వామి మాట్లాడుతూ అధికారులకు గోదాము నిల్వలపై సమాచారం ఇవ్వకపోవడంతోనే సమస్య ఉత్పన్నమైందని, ఇది రైతుల నుండి సేకరించిన విత్తనాలని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్‌సైనీ దృష్టికి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏఓ మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.



2017లో అతి పెద్ద రక్తదాన శిబిరం, ఫిజికల్ ఫిట్ నెట్ శిబిరాలను నిర్వహించిన ఇండియన్ ఆర్మీకి అవార్డులను ప్రదానం చేసిన తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ

రికార్డులు నెలకొల్పిన ఇండియన్ ఆర్మీ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: సికింద్రాబాద్ ఆర్మీ విభాగం 2017లో రెండు అతి ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలను నిర్వహించి ప్రపంచ రికార్డులను నెలకొల్పినందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి డాక్టర్ క్రిస్టినా జడ్ చోగ్తూ అభినందించారు. 2017లో జరిగిన ఆర్మీడే సందర్భంగా అతి పెద్ద స్వచ్ఛంద రక్త దానం, అవగాహన శిబిరాన్ని సికింద్రాబాద్ ఆర్మీ నిర్వహించింది. అంతర్జాతీయ క్రీడోత్సవం సందర్భంగా అతి పెద్ద ఫిజికల్ ఫిట్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అభినందించింది. ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రక్త దాన శిబిరం నిర్వహించినందుకు ఒన్ ఇఎంఇ కమాండెంట్ బ్రిగేడర్ అజయ్ మాలిక్‌ను, ఈ శిబిరం నిర్వహించినందుకు ప్రోత్సహించినందుకు తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ సోనిబాలదేవిని , నిర్వాహకులు కల్నల్ సునీల్ ఉనియాల్, కుమారి కిరణ్ ఉనియాల్‌ను సత్కరించారు. ఫిజికల్ ఫిట్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహణలో కూడా రికార్డు సృష్టించినందుకు కల్నల్ సునీల్ ఉనియాల్, కిరణ్ ఉనియాల్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిస్టినా జడ్ చోగ్తూ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో అతి పెద్ద ఎత్తున సమాజానికి, ప్రపంచానికి ఆదర్శంగా రక్తదానశిబిరాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు ఆర్మీ పనిని స్ఫూర్తితో తీసుకోవాలని కోరారు.

ఎన్‌ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ బంద్

- పలు ప్రాంతాల్లో వైద్యులు, వైద్య విద్యార్థుల ర్యాలీలు
- చర్చ లేకుండా స్టాండింగ్ కమిటీకి వెళ్లిన బిల్లు
- ఆందోళన తాత్కాలిక విరమణ

ఆంధ్రభూమి బ్యూరో



విజయవాడలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న వైద్యవిద్యార్థులు,

విజయవాడ, జనవరి 2: బ్రిటీష్ కాలం నుంచి వైద్యరంగంలో అన్నింటా క్రియాశీలక పాత్ర వహిస్తూ వచ్చిన మెడికల్ ఆఫ్ కౌన్సిల్ ఇండియా (ఎంసీఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్‌ను (ఎన్ఎంసీ) తీసుకువచ్చేందుకు ఉద్దేశించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు మంగళవారం దేశవ్యాప్తంగా కార్పొరేట్‌తో సహా అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీని బంద్ చేసి వైద్యులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అయితే అత్యవసర వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా అనేక ప్రాంతాల్లో ర్యాలీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ కేంద్రంలో వైద్యుల సమ్మె విజయవంతమైంది. వైద్య కళాశాల ఎదుట వైద్యులు, వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై నేడు చర్చ జరగనున్నదనే కారణంతో వైద్యులు ఈ ఆందోళనకు దిగగా.. కేంద్ర ప్రభుత్వం చర్చ లేకుండానే బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించడం తమ తొలి విజయంగా వైద్యులు చెబుతున్నారు. దీంతో ఆందోళనను తాత్కాలికంగా విరమించుకున్నారు. మళ్లీ ఈ బిల్లు సభలో ప్రవేశపెడితే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని దీనికి కేంద్రం బాధ్యత వహించాల్సి వస్తుందంటూ ఐఎంఏ విజయవాడ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాసిక్ సంఘవి, ఆంధ్ర హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పివి రమణమూర్తి, తదితరులు హెచ్చరించారు. ఈ బిల్లు వెనుక రాజకీయ కోణం ఉందని డాక్టర్ రమణమూర్తి అన్నారు. మోదీ ప్రభుత్వం 2017లో సరికొత్త వైద్య విధానాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. ప్రాథమిక వైద్యం మినహా ఇతర వైద్య సేవలన్నింటికీ ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రక్రియలో భాగంగానే ఎంసీఐ స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్‌ను తీసుకువస్తున్నారని అన్నారు. ఈ బిల్లు ప్రజావైద్యానికి తూట్లు పొడిచే హానికరమైనదని, పేదలకు వైద్యం దూరమవుతుందని డాక్టర్ రమణమూర్తితో పాటు ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రాంప్రసాద్, ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ కెఎస్ కరుణామూర్తి అన్నారు. ముఖ్యంగా కేంద్రం అల్లోపతి వైద్యానికి తూట్లు పొడవబోతున్నదని అన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి నాలుగున్నర సంవత్సరాలపాటు వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. యునాని, హోమియో, ఆయుర్వేదం చదివిన వారికి ఇంతకాలం వేరే రిజిస్ట్రేషన్ ఉండేదని, వీరికి స్వల్పకాల పరిమితితో బ్రిడ్జి కోర్సు నిర్వహించి ఎంబిబిఎస్ విద్యార్థులతో సమానంగా సర్టిఫికెట్లను అందించాలన్నది ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమన్నారు. ఎంసీఐ కనుసన్నల్లో అడ్మిషన్లు, కోర్సు నిర్వహణ, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ జరిగేదని ఈ విధంగా దేశవ్యాప్తంగా 10లక్షల మంది రిజిష్టరయ్యారని అన్నారు. విదేశాల్లో చదివి వచ్చి ఇక్కడ ప్రాక్టీసు చేసుకోవాలంటే ఎంసీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రవేశపరీక్ష రాయకుండా ప్రాక్టీస్ చేసుకోవచ్చునన్నారు. అలాగే ఇక్కడ ఎంబిబిఎస్ పూర్తిచేసిన వారు మాత్రం ప్రతిభ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఎంసీఐలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి మొత్తంపై 75 మంది వైద్యులకు సభ్యత్వం ఉండేదన్నారు. అయితే కొత్తగా ఏర్పాటయ్యే మెడికల్ కమిషన్‌లో కేవలం 25 మంది ఉంటే ఐదుగురు వైద్యులు, 20 మంది వైద్యరంగానికి సంబంధం లేని వారు నియమితులవుతారని అన్నారు. వైద్య కళాశాలల్లో 40 శాతం సీట్లు ప్రభుత్వం ఆధీనంలో ఉంటే 60 శాతం సీట్లను యాజమాన్యాలు అమ్ముకునే అవకాశం లభిస్తుందన్నారు. ఇప్పటికే దేశంలో వైద్య కళాశాలల సంఖ్య 40 నుంచి 420కి పెరిగితే దీనివల్ల వందల సంఖ్యలో మరిన్ని ఏర్పడగలవని, వాటిపై పర్యవేక్షణాధికారం ప్రైవేట్ ఏజెన్సీలకు ఉండబోతున్నదని అన్నారు. అందుకే ఈ ప్రమాదకరమైన బిల్లును తిప్పికొట్టాలని రాజకీయాలకతీతంగా దేశవ్యాప్తంగా 650 మంది ఎంపీలను కల్సి ఇప్పటికే కోరామన్నారు. సరికొత్త విధానం వల్ల నాణ్యమైన వైద్య విద్య కరువయ్యే ప్రమాదం ఉందంటూ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వైద్య రంగం వరకు తమ విధి విధానాలను మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ స్వామి మౌళీకృష్ణ, అనురాగ్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.రవీంద్రనాథ్, డాక్టర్ బోయపాటి మల్లిక, డాక్టర్ పిఎంసి నాయుడు, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పిఓఎస్ మిషన్ల ద్వారా ఎరువుల పంపిణీ

★ ఎరువులు జిల్లాల ఎల్లలు దాటవద్దు
★ ఆదేశించిన కార్యదర్శి పార్థసారథి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల పంపిణీ ఫకడ్బందీగా, అక్రమాలకు అవకాశం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థసారథి స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీకి సంబంధించి సంబంధిత జిల్లా అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలోని 6656 రిటైల్ దుకాణాల ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నామన్నారు. అన్ని దుకాణాల్లో కూడా పాయింట్ ఆఫ్ సేల్ (పిఓఎస్) మిషన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎరువుల కోసం వచ్చే రైతులు తప్పని సరిగా ఆధార్ కార్డులు తీసుకురావలసి ఉంటుందన్నారు. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు, డీలర్లు, వ్యాపారులు రైతులను చైతన్యం చేయాలన్నారు. ఆధార్ కార్డు లేని రైతులు తమ పేర్లను ప్రత్యేకంగా నమోదు చేయించుకోవాలన్నారు. ఒక జిల్లాకు కేటాయించిన ఎరువులను ఇతర జిల్లాలకు సరఫరా చేయవద్దని, ఎవరైనా ఈ విధంగా సరఫరా చేస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

మనుబోలులో దోపిడి దొంగల బీభత్సం

భారీగా నగలు, నగదు అపహరణ

మనుబోలు,జనవరి 2: నెల్లూరు జిల్లా మండలకేంద్రమైన మనుబోలులో సోమవారం రాత్రి దోపిడి దొంగలు బీభత్సం సృష్టించి మూడు ఇళ్లల్లో చోరికి పాల్పడ్డారు. ఈ దోపిడిలో సుమారు 68 సవర్ల బంగారు నగలు, రూ.4లక్షల 80వేల రూపాయలు అపహరించుకు వెళ్ళారు. మనుబోలు పడమర వీధికి చెందిన బొమ్మిరెడ్డి రామసుబ్బారెడ్డి ఇంటిలో మేడపై యజమానులు నిద్రిస్తుండగా వారు బయటకు రాకుండా ముందు గేటుకు తాళాలు వేసి కింద ఉన్న గదుల తలుపులను పగుల గొట్టి ఇంటిలోకి ప్రవేశించి బీరువాలోని బంగారు నగలు నగదును అపహరించుకు వెళ్ళారు. అలాగే ఆ ఇంటిపక్కనే బొమ్మిరెడ్డికి చెందిన పాత ఇంటి తలుపులు పగుల గొట్టి అందులో నగలు,నగదు అపహరించుకుపోయారు. ఈ ఇంటి పక్కనే ఉన్న తాళం వేసి ఉన్న రామసుబ్బారెడ్డి సోదరుడు శంకర్‌రెడ్డిలోకి దొంగలు ప్రవేశించి నగలు, నగదు అపహరించుకుపోయారు. క్లూస్ టీమ్ చోరికి పాల్పడిన ఇండ్లలో వేలిముద్రలను సేకరించారు. ఈమేరకు మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమీషన్లు కుదరకే పోలవరం పనుల్లో జాప్యం

పీసీసీ అధ్యక్షుడు రఘువీరా

కళ్యాణదుర్గం, జనవరి 2: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వ్యయం అంత కంతకూ పెంచుకుంటూ పోతున్నారని, ఫలితంగా ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయలేక పోతున్నారని పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి ఆరోపించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే నేటికి పోలవరం పూర్తయ్యేదన్నారు. బీజేపీ, టిడీపీ ప్రభుత్వాల మధ్య కమీషన్లు కుదరకనే పోలవరం పనులు నిలిచిపోతున్నాయన్నారు. తొలుత 2018 నాటికి పూర్తి చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేడు 2019లోగా పూర్తి చేస్తామని దొంగ నాటకాలు అడుతున్నారని ఆరోపించారు. పోలవరం పెండింగ్ ప్రాజెక్టుగా మిగిలిపోతుందని తాము మొదటి నుంచి హెచ్చరిస్తూనే ఉన్నామన్నారు. ప్రాజెక్టు నిర్మాణం వేగం పెంచాలని కోరుతూ ఈనెల 7, 8, 9 తేదీల్లో ధవళేశ్వరం నుంచి పోలవరం వరకు కాం గ్రెస్ పార్టీ అధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు రఘువీరా తెలిపారు. 10న సామూహిక నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్వో

జమ్మలమడుగు, జనవరి 2: పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చేందుకు ఓ రైతు నుంచి రూ. 4వేలు లంచం తీసుకున్న వీఆర్ఓను ఏసీబీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. కడప జిల్లా పెద్దముడియం మండలం సుద్ద పల్లె ఇంచార్జి వీఆర్ఓగా పనిచేస్తున్న చంద్రమోహన్ గ్రామానికి చెందిన రైతు రంగస్వామి నుంచి మంగళవారం రూ.4 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ నాగరాజు సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. పట్టాదారు పాసుపుస్తకం కోసం వీఆర్ఓ లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతు రంగస్వామి తెలిపారు.

23న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ఒకరోజు సమ్మె

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు ఈ నెల 23న ఒక రోజు సమ్మెలో పాల్గొంటున్నారు. డిమాండ్ల సాధన నిమిత్తం కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినందున రాష్ట్రవ్యాప్తంగా తాము కూడా సమ్మెలో పాల్గొంటున్నామని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి నాగేశ్వరరావు నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందం మంగళవారం రాష్ట్ర హెల్త్ ఫ్యామిలీ ప్రిన్సిపల్ సెక్రటరీకి సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఎం, న్యాకో, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, ఆశ, ఉపాధి హామీ, ఎన్ఆర్ఎల్ఎం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొంటున్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, 35 రోజుల క్యాజువల్ లీవులు అమలుచేయాలని, అందరినీ రెగ్యులరైజ్ చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలకు చెందిన కార్మికులందరికీ కనీస వేతనం రూ.18వేలు, పెన్షన్ రూ.3వేలు, పీఎఫ్, ఈఎస్ఐ పథకాలు అమలుచేసి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

అట్టహాసంగా జన్మభూమి ప్రారంభం

10న తూ.గో. రానున్న ముఖ్యమంత్రి

ఆంధ్రభూమి బ్యూరో

కాకినాడ/ఏలూరు, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న 5వ విడత జన్మభూమి కార్యక్రమం ఉభయ గోదావరి జిల్లాలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యింది. ఉప ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు తూర్పు గోదావరి జిల్లాలో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మంత్రులు పైడికొండల మాణిక్యాలరావు, పితాని సత్యనారాయణ, కెఎస్ జవహర్, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ తదితరులు జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇరు జిల్లాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు, మండలి సభ్యులు, శాసన సభ్యులు తమ తమ నియోజకవర్గాల పరిధిలో జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప పెద్దాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గ్రామసభలను ప్రారంభించారు. నియోజకవర్గంలోని దివిలి, తిరుపతి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో చినరాజప్ప ప్రసంగించారు. జన్మభూమి కార్యక్రమాల్లో అర్హులందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు అందజేస్తున్నట్టు చెప్పారు. వివిధ సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేయడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని చినరాజప్ప చెప్పారు. తుని నియోజకవర్గంలోని తొండంగి మండలం వేమవరంలో జన్మభూమి కార్యక్రమాన్ని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్పతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి యనమల మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న 5వ విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాల్లో సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చినట్టు తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు గ్రామస్థాయిలో జరిగే సభలలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కాగా ఈ నెల 10వ తేదీన ముమ్మిడివరంలో జరిగే జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

అనంతలో తూతూమంత్రంగా జన్మభూమి

నాగినాయనిపల్లిలో సభ బహిష్కరణ

ఆంధ్రభూమి బ్యూరో

అనంతపురం, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం తొలిరోజు మంగళవారం అనంతపురం జిల్లాలో ఆశించిన స్థాయిలో జరగలేదు. జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ వార్డులు, గ్రామ స్థాయిల్లో నిర్వహించిన గ్రామ సభలకు హాజరయ్యేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆశించిన మేరకు జనం హాజరు కాకపోవడంతో చాలా చోట్ల జన్మభూమి కార్యక్రమాలు పేలవంగా సాగాయి. తూతూమంత్రంగా జన్మభూమి నిర్వహించి అధికారులు మమ అనిపించారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువులో గ్రామసభను ప్రజలు బహిష్కరించారు. గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన క్వారీ కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయని, ఆరోగ్యం పాడవుతోందని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా తమ బాధలు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ కొంత సేపు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సభను బహిష్కరించి వెళ్లిపోవడంతో అధికారులు వెనుదిరిగారు. కదిరి నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సురయాబాను వేర్వేరుగా జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొనడం గమనార్హం.

కొలకలూరి నాటక, కవితా పురస్కారాలు

ఫిబ్రవరి 26న ప్రదానం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా అందజేస్తున్న కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారాలకు, కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారాలకు ఎంట్రీలను స్వీకరిస్తున్నారు. ఎంట్రీలు జనవరి 18వ లోగా పంపించుకోవల్సి ఉంటుంది. ఫిబ్రవరి 18న పురస్కార ప్రకటన చేస్తారు. ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక సభలో పురస్కార ప్రదానం జరుగుతుంది. నాటక పురస్కారానికి సంబంధించి వివరాలను డాక్టర్ కొలకలూరి సుమకిరణ్, కవితా పురస్కారానికి సంబంధించి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి వివరాలు అందించారు. నాటక పురస్కారాన్ని ఈ ఏడాది గ్రంథ రూపంలో ముద్రిత నాటక, నాటికా సంపుటాలకు అందిస్తామని ఇందుకోసం రచయితలు లేదా ప్రచురణ కర్తలు మూడేసి ప్రతులు పంపించాలని సుమకిరణ్ తెలిపారు. ఒకే రచయితవి ఒకటి కంటే ఎక్కువ నాటకాలు లేదా నాటికా సంపుటాలను ఎంపించవచ్చని ఆమె తెలిపారు. ఎంట్రీలను డాక్టర్ కొలకలూరి సుమ కిరణ్, ప్రొఫెసర్ ఆంగ్లశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి -517502 అనే చిరుమానాకు పంపించాల ని ఆమె కోరారు. కొలకలూరి భాగీరథీ కవితా పురస్కారానికి ము ద్రిత పద్య/ గేయ /వచన కావ్యాలు/ సంకలనాలు పంపించవచ్చని ఆచార్య కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. ఎంట్రీ కేవలం ఒక్క రచయిత గ్రంథమై ఉండాలని, వివిధ కవుల సంకలనాలను పరిశీలించబోమని చెప్పారు. పురస్కారం రచయితకు మాత్రమే ఇస్తామని ఆమె తెలిపారు. పురస్కారంగా 10వేల రూపాయిల నగదు, శాలువ, మెమోంటో ప్రదానం చేస్తామని ఆమె వివరనించారు. ఎంట్రీలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆంధ్రాచార్యులు, తెలుగు శాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి -517502 అనే చిరునామాకు పంపించాలని ఆమె కోరారు.

బధిర గిరిజన బాలికపై అత్యాచారం!

వీఎస్ఈజెడ్‌లో దారుణం ◆ నిందితులపై నిర్భయ కేసు నమోదు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 2: విశాఖలో మరో దారుణం చోటుచేసుకుంది. మూగ, చెవిటి గిరిజన బాలికపై ఓ కామాంధుడు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి ఏసీపీ రామ్మోహనరావు అందించిన వివరాలివి. గాజువాక సమీపంలోని దువ్వాడ దగ్గర ఉన్న విశాఖపట్నం స్పెషల్ ఎకనమిక్ జోన్(వీఎస్ఈజెడ్)లో హైదరాబాద్ బ్యాటరీస్ లిమిటెడ్ సంస్థలో తోటపని చేసేందుకు ఏజెన్సీ నుంచి కొంత మంది గిరిజనులు వచ్చారు. కొద్ది రోజులుగా వీరు ఇక్కడ పని చేస్తున్నారు. ఇందులో ఓ మూగ, చెవిటి అమ్మాయి కూడా ఉంది. ఇదే కంపెనీ బస్సులో డ్రైవర్‌గా పనిచేస్తున్న చింతాడ విశ్వనాథ్ కన్ను పడింది. గత శనివారం ఈ గిరిజన బాలిక ఒంటరిగా ఉండడం చూసి, ఆమెను బలవంతంగా బస్సులోకి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలు మూగ బాలిక కావడంతో అరవ లేకపోయింది. కొద్దిసేపటి తరువాత బాధితురాలు బస్సు దిగి పారిపోయి, తోటపని చేస్తున్న వారి వద్దకు వచ్చి విలపించింది. అక్కడున్నవారు ఆమె నుంచి వివరాలు తెలుసుకోలేకపోయారు. శనివారం జరిగిన ఈ ఘటనను మాఫీ చేసేందుకు సంస్థ యాజమాన్యం, సెక్యూరిటీ సిబ్బంది ప్రయత్నించారు. అయితే, బాధితురాలి సోదరుడు మంగళవారం అక్కడికి వచ్చాడు. జరిగింది తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బాధితురాలి నుంచి వివరాలు సేకరించి డ్రైవర్ చింతాడ విశ్వనాథ్‌తోపాటు, సాక్ష్యాలు లేకుండా చేసేందుకు ప్రయత్నించిన బస్ యజమాని మువ్వల అప్పలరాజు, సెక్యూరిటీ ఇన్‌ఛార్జ్ ప్రకాశరావుపై సెక్షన్ 376, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఈ సెక్షన్‌లో నిర్భయ యాక్ట్ కూడా ఇమిడి ఉందని రామ్మోహన రావు పేర్కొన్నారు. నిందితులను ఇంకా అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమెపై అత్యాచారం జరిగిందని తేలిందని ఏసీపీ చెప్పారు. ఇదిలా ఉండగా ఘటనను మాఫీ చేసేందుకు బాధితురాలికి లక్షా 25 వేల రూపాయలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని, ఇందులో 25వేల రూపాయలు సెక్యూరిటీ గార్డులే తీసుకుని, లక్ష రూపాయలు చేతిలో పెట్టారని సమాచారం. అయితే, ఈ వివరాలను పోలీసులు ధ్రువీకరించలేదు.

దేశంలో వైద్యుల కొరత నివారణకు

ఫార్మా డీ కోర్సు పట్టభద్రుల సేవలు

కేంద్ర మంత్రి నడ్డాకు బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 2: దేశంలో వైద్యుల కొరత తీర్చేందుకు ఫార్మా డీ కోర్సు పూర్తిచేసిన వారిని దేశవ్యాప్తంగా ప్రభుత్వాసుపత్రుల్లో నియమించుకుని వారి వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరుతూ బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు, ఎంఎల్‌సి సోము వీర్రాజు మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

తొలిసారిగా 2008లో కేంద్ర ప్రభుత్వం ఫార్మా డీ కోర్సును ప్రవేశపెట్టిందన్నారు. ఆరేళ్ల కాలపరిమితి కల్గిన ఈ కోర్సును ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఫార్మసీ యాక్ట్ 1948 సెక్షన్ 10 ప్రకారం గుర్తించారని అన్నా రు. ఈ కోర్సు వల్ల ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మకాలజీ, ఫార్మాకోర్ థెరపీ, పాసాలజి, టాక్సికాలజి, క్లినికల్ రీసెర్చ్, ఫార్మాకోక్నటిక్స్, థెరప్యూటిక్ గ్రడ్ మానిటరేటింగ్ తదితర విషయాల్లో నైపుణ్యం సాధించిన కారణంగా నాణ్యమైన చికిత్స అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ వైద్య విద్యను అభివృద్ధి చెందిన దేశాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించాయన్నారు. ఈ డిగ్రీ పొందిన వారిని ప్రభు త్వం రాష్ట్రంలోని ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, హెల్త్‌కేర్ ప్రోగ్రాములు, టీబీ నియంత్రణ, మలేరియా నియంత్రణ, ఎయిడ్స్ నియంత్రణలకు వినియోగించవచ్చని వీర్రాజు ఆ లేఖలో పేర్కొన్నారు. వీరి సేవలద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, మెటర్నిటీ, పిల్లల వైద్యంలో అయ్యే ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. ప్రతి ఆసుపత్రిలో ఫార్మసిస్ట్ తప్పక ఉండాలని కోరారు.

ఫార్మాడీ కోర్సు చేసిన వారికి స్వయం ఉపాధి అందించేలా రుణ సదుపాయం కల్పించాలన్నారు. అన్ని జిల్లాల్లో డ్రగ్ ఇన్ఫర్మేషన్ సెంటర్లు స్థాపించి వాటిలో 24 గంటలు అందుబాటులో ఉండేలా వీరి సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పేషెంట్ కౌన్సిలింగ్ సెంటర్లను ప్రతి ఆసుపత్రిలో ప్రారంభించాలన్నారు. ఫార్మా డీ కోర్సు చేసిన వారిని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా ఇన్‌స్పెక్టర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లుగా కూడా నియమించుకోవాలని కోరారు.

1వ పేజీ తరువాయి

నాది పేదల కులం

ఆత్మహత్యలకు పాల్పడ్డారని తన హయాంలో రైతులకు మద్దతు ధరలకు ఇవ్వటమేకాకుండా నిల్వ ఉన్న శనగలను కూడా కొనుగోలు చేసినట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాల వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. తన హయాంలో డ్వాక్రాసంఘాలను పూర్తి బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. వడ్డీలేని రుణాలతోపాటు పదివేల రూపాయల చొప్పున లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నామన్నారు. ఆహారభద్రత కింద కోటి 42లక్షల రేషన్‌కార్డులు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో నాలుగుకోట్ల 40లక్షలమంది జనాభా ఉంటే నాలుగుకోట్ల ఐదు లక్షలమందికి ఐదుకేజిల చొప్పున బియ్యాన్ని పంపిణీచేస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం రేషన్‌షాపులకు చక్కెర నిలిపివేసిందని, కాని తాను మాత్రం చక్కెరను ఈనెలనుండి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అన్నివర్గాల్లోని పేదలు పండగల సమయంలో పస్తులు ఉండకుండా రంజాన్‌తోఫా, క్రిస్మస్ గిఫ్టులు, సంక్రాంతి కానుకలు పంపిణి చేస్తున్నామన్నారు. ఈసంవత్సరం సంక్రాంతి పండగ సందర్భంగా ముస్లింలకు కూడా సంక్రాంతి కానుకలు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. దీపం పథకాన్ని కాంగ్రెస్‌పార్టీ నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. తిరిగి మహిళలకు వంట గ్యాస్ కనెక్షన్లు పంపిణి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతిపేదవాడికి రేషన్‌కార్డులు పంపిణి చేస్తున్నామని, ఈనెలలో లక్షా 50వేలమందికి రేషన్‌కార్డులు పంపిణి చేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని చెప్పిన మాటను నిలబెట్టుకుని రాష్ట్రంలో 46లక్షల 19వేల మందికి ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. అతిత్వరలో 50లక్షల మంది పేదలకు పెన్షన్లు పంపిణి చేస్తున్నామన్నారు. ఈవిధానం వలన 15వందల కోట్లరూపాయల అదనంగా ప్రభుత్వానికి భారం పడుతుందన్నారు. చంద్రన్న బీమా పథకానికి రాష్ట్రంలో మంచి స్పందన వచ్చిందని ఈపథకంలో బీమా మిత్రల సేవలు మరవలేనివన్నారు.ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీలతో పాటు కులాంతర వివాహాలు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఉగాదినుండి పెళ్లికానుకలను డ్వాక్రాసంఘాల ద్వారా పెళ్లిమండపంలోనే పంపిణి చేస్తామన్నారు. వచ్చే సంవత్సరంలో లక్ష కుటుంబాలకు పెళ్లిళ్లు జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈసంవత్సరం మార్చినాటికల్లా రాష్ట్రంలోని 13జిల్లాలో ఒడిఎఫ్‌ను సాధిస్తామన్నారు. పేదల స్వంత ఇంటికలతీర్చేందుకు 19లక్షల ఇళ్ళు మంజూరుచేశామని, అవసరమైతే మరిన్ని గృహాలను పెంచేందుకు కూడా వెనకాడేది లేదన్నారు. వెనుకబడిన కులాలకు పదివేల కోట్లరూపాయలను బడ్జెట్‌లో కేటాయించామన్నారు. డ్వాక్రామహిళలకు 2500కోట్లరూపాయల వడ్డీలేని రుణాలుగా పంపిణిచేశామన్నారు.

చేనేత కార్మికులు ఆదుకునేందుకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి తద్వారా చీర, దోవతిలను పంపిణిచేస్తామన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలను ఆదుకునేందుకు ఏడుకోట్లరూపాయలను బడ్జెట్‌లో పెట్టామని తెలిపారు. త్వరలోనే పట్టణ కేంద్రాల్లో అన్నక్యాంటీన్లను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. త్వరలో నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కల్పిస్తామన్నారు. 2022కల్లా దేశంలోనే మూడు అగ్రరాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉంటుందన్నారు. విభజన చట్టంలో కేంద్రం హామీ ఇచ్చిన విధంగా అన్నిహామీలను సాధించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి ప్రజల ప్రాజెక్టును పూర్తిచేసి ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేస్తామన్నారు. అదేవిధంగా సోమశిల ప్రాజెక్టును గోదావరితో అనుసంధానం చేస్తామని ఆయన తెలిపారు. 2018 చివరి నాటికి వెలుగొండ మొదటిదశ పూర్తిచేసి 2019నాటికి ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తామన్నారు. 2029కల్లా రాష్ట్రాన్ని ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. సంక్రాంతి పండగ అంటే జూదం ఆడటం కాదని పెద్దలు ఇచ్చిన వారసత్వ సంపదను కాపాడుకోవాలన్నారు. మనుషులు మానవత్వంతో ముందుకు వెళ్ళాలని, ద్వేషభావాన్ని విడనాడాలన్నారు. అన్నిపండగలను అందరు జరుపుకోవాలని అప్పుడే ఆనందం సమైఖ్య భావం వస్తుందన్నారు. అందరు సహకరిస్తే రాష్ట్రాన్ని టెక్నాలజి ఆంధ్రప్రదేశ్‌గా ముందుకు తీసుకువెళ్తామన్నారు. త్వరలో అందరికి డిజిటల్ లాకర్లను ఇస్తామని ఈవిధానం ద్వారా ఇళ్ళ దొంగతనాలు జరగవని, ఒక వేళ దొంగతనం జరిగిన వెంటనే పోలీసు రంగప్రవేశం చేసి దొంగల్ని అరెస్టు చేస్తారని ఆయన తెలిపారు. ఈనెల 11న ముగింపు సభ ఉంటుందని ఈసభలో ఉత్తమ రైతులకుపాటు మరికొంతమంది సన్మాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో 80శాతంమంది ప్రజలు తృప్తిగా ఉండాలని, ఆనందంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలు తనకు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సభలో రాష్ట్రమంత్రులు శిద్దా రాఘవరావు, పి నారాయణ, ఎంఎల్‌సిలు కరణం బలరాం, జూపూడి ప్రభాకర్, కలెక్టర్ వినయ్‌చంద్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

తలాక్‌కు మెలిక?

వ్యాఖ్యానించారు. ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో కాంగ్రెస్ గందరగోళంలో పడిందని మరో మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ఆరోపించారు. బిల్లు విషయంలో కాంగ్రెస్ అడుగులు ఒకటి ముందుకు, పది వెనక్కి అన్నట్టుందని దుయ్యబట్టారు. లోక్‌సభలో వ్యవహరించిన తీరులోనే రాజ్యసభలోనూ ట్రిపుల్ తలాక్ బిల్లుకు సవరణల ప్రతిపాదనలతో కాంగ్రెస్ సరిపెట్టాలన్నది ఆయన వాదన. అయితే కాంగ్రెస్ ఇందుకు సమ్మతించటం లేదు. ప్రతిపక్షాలు మంగళవారం ఉదయం పార్లమెంట్ ఆవరణలోని గులాంనబీ ఆజాద్ చాంబర్‌లో సమావేశమై ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చలు జరిపారు. లోక్‌సభలో మాకు మెజారిటీ లేదు. రాజ్యసభలో మెజారిటీ ఉంది కనుక, ట్రిపుల్ తలాక్ బిల్లులో మార్పులు చేర్పుల కోసం సెలెక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని ప్రతిపక్షం నాయకుడు గులాంనబీ ఆజాద్ స్పష్టం చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లులోని మూడేళ్ల జైలు అంశాన్ని సవరించాల్సిందేనని పట్టుబట్టారు. ట్రిపుల్ తలాక్ సివిల్ వ్యవహారం కనుక దీన్ని నేరపూరిత చర్యగా పరిగణించటం భావ్యం కాదన్నది కాంగ్రెస్ వాదన. బీజేపీ మిత్రపక్షమైన అన్నాడిఎంకె సైతం మూడేళ్ల జైలు క్లాజును మార్చాలని డిమాండ్ చేస్తోంది. అన్నాడీఎంకె డిమాండ్ నేపథ్యంలో తమిళనాడుకు చెందిన మరో ద్రవిడ పార్టీ డీఎంకె సైతం ఇదే పాటందుకుంది. ఇదిలావుంటే బీజేపీ మరో మిత్రపక్షం బిజూ జనతాదళ్ సైతం మూడేళ్ల జైలు క్లాజు సవరణకు పట్టుబడుతోంది. దీంతో ప్రభుత్వం కొంత ఇరకాటంలో పడినట్టే కనిపిస్తోంది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలతోపాటు అన్నాడీఎంకె, బిజూ జనతాదళ్ సైతం బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న డిమాండ్లు చేయటంతో ప్రభుత్వం ఇబ్బందుల్లో పడింది. ముస్లిం మహిళల ప్రయోజనాలను కాపాడేందుకు ఉద్దేశించిన ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించటం మంచిదికాదని బీజేపీ వాదిస్తోంది. దేశంలోని మెజారిటీ ముస్లిం మహిళలు ట్రిపుల్ తలాక్ బిల్లుకు మద్దతిస్తున్నారు. ఈ విషయం కాంగ్రెస్‌కూ బాగా అర్థమైంది కనుకే తాము బిల్లుకు వ్యతిరేకం కాదని మంగళవారం కూడా స్పష్టం చేసింది. అయితే బిల్లులోని కొన్ని అంశాలను సవరించాల్సిన అవసరముందని వాదిస్తోంది. బిల్లును వ్యతిరేకిస్తే ముస్లిం మహిళల ఓట్లు పోతాయని భయపడుతున్న కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు బిల్లులోని మూడేళ్ల జైలువంటి క్లాజులను తొలగించాలని పట్టుబడుతున్నాయి. ఈ మెలికతో ముస్లిం పురుష ఓట్లు పదిలం చేసుకోవచ్చన్నది కాంగ్రెస్ అంచనా. తాము కోరుతున్న సవరణలు చేయాలంటే బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలి. ప్రభుత్వం కూడా అంగీకరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. ఇదిలావుంటే, ప్రభుత్వం సైతం గత్యంతరం లేని పరిస్థితిలో ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించే అవకాశాలు లేకపోలేదు.

భారత ఐటీకి ఎసరు!

ఎదురుచూస్తున్న అత్యంత సామర్థ్యం కలిగిన వారిపై కూడా దీని ప్రభావం ఉంటుంది. అంటే, హెచ్1బి వీసాలు కలిగివున్న వారిలో ఐదు నుంచి ఏడున్నర లక్షల వరకూ ఉద్యోగులు వెనక్కిరాక తప్పదు. తమంతట తాముగానే వేలాది మంది భారత ఐటీ ఉద్యోగులు స్వదేశాలకు వెళ్లిపోయే పరిస్థితిని ఈ బిల్లు ద్వారా ట్రంప్ ప్రభుత్వం కల్పిస్తోంది. ఆ విధంగా వచ్చిన ఖాళీలను స్థానిక అమెరికన్లతో భర్తీ చేయాలని భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. చట్టంలో పేర్కొన్నట్టుగా కనీసం వేతనాన్ని చెల్లిస్తున్నామని చెప్పడంతోపాటు, సదరు క్లైంట్లు ఓ నిబంధనను కూడా సంతృప్తిపర్చాల్సి ఉంటుంది. అంటే రానున్న ఐదారేళ్ల వరకూ తాజా వీసా హోల్డర్ ప్రస్తుతమున్న ఉద్యోగికి ఎలాంటి ఇబ్బందీ కలగదన్న హామీని ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ బిల్లును జ్యుడీషియరీ కమిటీ ఆమోదించింది. త్వరలోనే దీన్ని సెనెట్ ఆమోదానికి పంపుతారు. కాగా, హెచ్1బి వీసాల నిబంధనల మార్పులపై భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిస్పందనా రానప్పటికీ ఈ ప్రక్రియను మాత్రం లోతుగా గమనిస్తున్నామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

అన్యాయం చేస్తున్నారు

జగన్మోహన్‌రెడ్డి భరోసాఇచ్చారు. పాదయాత్రలో భాగంగా మంగళవారం ఆయనను వేరుశనగ రైతులు కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పీలేరులోని నూనేగింజల కర్మాగారాన్ని మూసివేశారని తెలిపారు. దీనిపై స్పందించిన జగన్ రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే పీలేరులో మూసివేసిన నూనెగింజల కర్మాగారాన్ని తెరిపించి రైతులకు మేలుచేకూరేలా చేస్తానని హామి ఇచ్చారు.

50వరోజుకు పాదయాత్ర

వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర మంగళవారంతో 50వరోజుకు చేరుకుంది. మంగళవారం మదనపల్లె రూరల్ మండలం పూలవాండ్లపల్లె నుండి ప్రారంభమైన యాత్ర కాశిరావుపేట, దిగువకాశిరావుపేట మీదుగా వాల్మీకిపురానికి చేరుకుంది. ఈసందర్భంగా పాలిమేర్లలో జగన్‌మోహన్ రెడ్డికి చింతల రామచంద్రారెడ్డి ఘనస్వాగతం పలికారు.

ఎన్నికల బాండ్లు వచ్చేశాయ్

నెరవేరుతుంది' అని ప్రశ్నించారు. అయితే, రుణదాతల బ్యాలెన్స్ షీట్‌లో ఇందుకు సంబంధించిన అంశాలు ఉంటాయని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదని జైట్లీ వివరించారు. గత ఎన్నికల్లో కనీసం 1శాతం ఓట్లను సంతరించుకున్న నమోదైన రాజకీయ పార్టీలకు మాత్రమే ఈ ఎన్నికల బాండ్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు తమ బ్యాంకు అకౌంట్ వివరాలు అందచేయాల్సి ఉంటుందని, 15 రోజుల్లోనే ఈ బాండ్లను నగదు రూపంలోకి మార్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే, ఆయా రాజకీయ పార్టీలు బాండ్ల రూపంలో తమకు ఎంతమొత్తం విరాళంగా వచ్చిందీ ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుందని జైట్లీ తెలిపారు. రుణదాతల పేర్లను బాండ్లపై లేకుండా చేయడానికి కారణాన్ని కూడా ఈ సందర్భంగా జైట్లీ వివరించారు. రుణదాతల పేర్లను బహిర్గతం చేస్తే మళ్లీ నగదు విరాళాలకే మొగ్గు చూపే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత విధానంలో నల్లధనమే విరాళాలుగా వెళ్తోందని పేర్కొన్న ఆయన, కొత్త విధానం అమల్లోకి వస్తే పూర్తిస్థాయిలో కాకున్నా విరాళాలకు సంబంధించి దాదాపుగా పారదర్శకతను సాధించగలుగుతామన్నారు.

కాంగ్రెస్‌కు 70 స్థానాలు

- వచ్చే ఎన్నికల్లో అధికారం మాదే..
- టీ.పీసీసీ కార్యవర్గ సమావేశంలో ఉత్తమ్



టి.పిసిసి కార్యవర్గ సమావేశంలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా, అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 2: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ప్రజలు పట్టం కట్టనున్నారని అన్ని సర్వేల్లోనూ వెల్లడవుతున్నదని టి.పిసిసి అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన టి.పిసిసి కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానంతరం ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాల వారూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని అన్నీ సర్వేల్లోనూ స్పష్టమవుతున్నదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే తమ పార్టీకి 70 స్థానాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ఒకవేళ గడువు ప్రకారమే వచ్చే ఏడాది ఎన్నికలు జరిగితే, అప్పటి వరకు తమ పార్టీకి ఇంకా సీట్లు పెరుగుతాయని ఆయన నమ్మకంగా చెప్పారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు స్వతహాగా చేయించుకున్న సర్వేలోనూ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నట్లు వెల్లడైందన్న సమాచారం తమ వద్ద ఉందన్నారు. తమ పార్టీలోకి వివిధ పార్టీల నుంచి ప్రతి రోజూ అనేక మంది చేరుతున్నారని ఆయన తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఇంకా అనేక మంది తమ పార్టీలో చేరనున్నారని ఆయన చెప్పారు. టిఆర్ఎస్ పెద్ద నాయకులు, పలువురు సిట్టింగ్‌లూ పార్టీలో చేరేందుకు 'టచ్'లో ఉన్నారని ఆయన తెలిపారు. టి.పిసిసి కార్యవర్గ సమావేశంలో ప్రధానంగా సోషల్ మీడియాను మరింత విస్తృతంగా వినియోగించుకునే అంశంపై చర్చించామన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని నాయకులు సీరియస్‌గా తీసుకోవాలని, ప్రతి ఒక్క ఓటరును పరిశీలించాలని, పోలింగ్ బూత్ స్థాయిలో సమగ్రంగా చూడాలన్నారు.

తెలంగాణలో డీలిమిటేషన్ ప్రక్రియ విషయంలో ఒక కమిటీని వేసి పరిశీలిస్తామని, పార్లమెంటులో బిల్లు పెడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపైనా చర్చిస్తున్నామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు సంపత్‌కుమార్, రాంమోహన్ రెడ్డి, మాజీ ఎంపి మల్లు రవి, కోశాధికారి గూడురు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా అంతకు ముందు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ ఆర్‌సి కుంతియా నేతృత్వంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కె. జానారెడ్డి, కౌన్సిల్‌లోప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, మాజీ ఎంపి వి. హనుమంత రావు తదితరులు సమావేశమయ్యారు.

క్రీడ

సవాళ్లకు దీటుగా..!

- సమాయత్తం అవుతున్న మహిళా హాకీ టీమ్
- నేటినుంచి మూడు వారాలపాటు శిక్షణ
- మెరుగైన ఫలితాలపైనే దృష్టి: కోచ్ హరేంద్రసింగ్



మహిళా హాకీ కోచ్ హరేంద్రసింగ్

న్యూఢిల్లీ, జనవరి 2: భారత మహిళా హాకీ జట్టు సరికొత్త సవాళ్లను ధాటిగా ఎదుర్కొనేందుకు దీటైన రీతిలోనే సన్నద్ధమవుతోంది. ఇప్పటికే అనేక టోర్నమెంట్లలో తమ సత్తాను చాటుకున్న భారత హాకీ మహిళా క్రీడాకారిణులు రానున్న కీలక టోర్నమెంట్లలోనూ తమదైన శైలిలో రాణించేందుకు హైర్యాంకున్న టీములతోనూ ధీమాగా, ధైర్యంగా ఆడేందుకు సుశిక్షితమవుతున్నారు. రానున్న సీజన్‌లో ఎగువ ర్యాంకులు కలిగిన జట్లతో భారత్ ఆడే అవకాశం ఉన్నందున అందుకు వీలుగా సానుకూల ఫలితాలను సాధించేందుకు టీమ్ కోచ్ హరేంద్ర సింగ్ ఇప్పటినుంచే సమాయత్తం అవుతున్నారు. రెండు వారాల విశ్రాంతి తర్వాత 33 మంది భారత మహిళా క్రీడాకారిణులు బుధవారం బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్యాంప్‌కు హాజరవుతున్నారు. గత ఏడాది భారత మహిళ హాకీ జట్టుకు ఎంతో సంతృప్తినిచ్చిందని, ఈ ఏడాది మరిన్ని విజయాలను నమోదు చేసుకునే దిశగా ముందుకు సాగేందుకు సిద్ధమవుతోందని హరేంద్ర సింగ్ తెలిపారు. గత ఏడాది చివరి విజయంతో ప్రపంచ ర్యాంకింగ్‌ను భారత్ మరింత పెంచుకుందని, అయితే ఎక్కువ లక్ష్యాలను సాధించే దిశగా ఆత్మవిశ్వాసంతో జట్టు ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పెద్దజట్లపైన నమ్మకంగా, ధీమాగా ఆడే శక్తి సామర్థ్యాలు తమకున్నాయన్న ఆత్మవిశ్వాసం భారత మహిళా హాకీ ప్లేయర్లకు ఉందని, ఇప్పటికే మూడు పెద్ద టీములతో సాధించిన విజయాల నేపథ్యంలో ఈ విశ్వాసం మరింత ఇనుమడించిందని హరేందర్ తెలిపారు. ఈ జట్లపై మరిన్ని ఉత్తమ ఫలితాలను సాధించాలన్న లక్ష్యాలతోనే మహిళా హాకీ జట్టు కొత్త సీజన్‌లోకి అడుగుపెడుతోందని తెలిపారు. ఈ ఏడాదిలో జరిగే ప్రధాన టోర్నమెంట్లలో శక్తివంతమైన టీమ్‌గా భారత జట్టు ముందుకు వెళ్లడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కామన్వెల్త్, ఆసియా క్రీడలు సహా 2018 భారత హాకీకి అత్యంత సవాళ్లతో కూడుకున్నదే కాకుండా ఎంతో కీలకమైనదని కూడా ఆయన తెలిపారు. బుధవారం నుంచి జరిగే 21 రోజుల ఈ శిక్షణా క్యాంప్ ఈ నెల 24తో ముగుస్తుంది. అనంతరం రానున్న టోర్నమెంట్‌లు అన్నింటికీ సన్నద్ధం అయ్యేలా భారత హాకీ క్రీడాకారిణులు సమాయత్తం అవుతారని ఆయన తెలిపారు. ఏప్రిల్‌లో జరిగే గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడలు మేలో కొరియాలో జరిగే ఐదవ మహిళా ఏషియాన్ చాంపియన్‌చిప్ ట్రోఫీలలో భారత మహిళా జట్టు పాల్గొనబోతోంది. జూలైలో లండన్‌లో జరిగే మహిళా వరల్డ్‌కప్‌లో పాల్గొనబోతోంది. అలాగే ఆగస్టులో జకార్తాలో జరిగిన 18వ ఆసియా క్రీడల్లోనూ భారత మహిళా హాకీ జట్టు తన సత్తా చాటుకోబోతోంది. ఇదే ఒలింపిక్‌కు క్వాలిఫయింగ్ మ్యాచ్ కావడం గమనార్హం. ఇప్పటికే భారత మహిళా జట్టు ఫిట్‌నెస్‌పై ప్రధానంగా దృష్టిపెట్టింది. దాంతోపాటు నైపుణ్యాన్ని మెరుగుపరిచే రీతిలో శిక్షణను కూడా సంతరించుకుంది. ఈ శిక్షణా శిబిరం అనేక రకాలుగా క్రీడాకారిణుల శక్తి సామర్థ్యాలను ఇనుమడింప జేయడమేమే కాకుండా మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందిస్తుందని కోచ్ హరేంద్రసింగ్ తెలిపారు.



అవార్డుల రేడు రొనాల్డో!

క్రిస్టియానో రొనాల్డో..ఆ పేరు చెబితేనే సాకర్ ప్రియుల ఆనందోత్సాహాలకు అడ్డే ఉండదు. రొనాల్డో క్రీడా జీవితం అవార్డులు, రివార్డుల మయం. అలాంటివన్నీ ఒకే చోట చేరితే..వాటిని చూసేవారి ఆనందానికి హద్దు ఉంటుందా! పోర్చుగల్‌కు చెందిన ఈ ఫుట్‌బాల్ దిగ్గజం తనకు లభించిన 15 వ్యక్తిగత అవార్డులతో మదీరా దీవిలోని ఫన్‌చల్ వెలుపల ఫొటో దిగాడు. ఈ అవార్డులన్నీ వేటికవే సాటి. వీటన్నింటినీ తన సొంత దీవి మదీరాలోని ఓ మ్యూజియంలో పొందుపరిచాడు.

కట్టడిపైనే కసరత్తు

- సాధనలో మునిగిన కోహ్లీ సేన
- దక్షిణాఫ్రికాతో ఐదు నుంచి మొదటి టెస్ట్ మ్యాచ్

కేప్‌టౌన్, జనవరి 2: దక్షిణాఫ్రికాతో ఈ నెల ఐదు నుంచి జరగనున్న తొలి టెస్టు మ్యాచ్‌లో విజయమే ధ్యేయంగా విరాట్ కోహ్లీ సేన అన్ని విధాలుగానూ కసరత్తు చేస్తోంది. ఈ రెండు జట్ల మధ్య సిరీస్ సమీపిస్తున్న దృష్ట్యా భారత జట్టుకే విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయని దక్షిణాఫ్రికాను నిలువరించగలిగే శక్తి భారత్ జట్టుకు పుష్కళంగా ఉన్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. దక్షిణాఫ్రికాలో ఈ తొలి టెస్టు విజయాన్ని సాధించడం ద్వారా భారత జట్టు సరికొత్త రికార్డును సృష్టించే అవకాశం ఉందన్న ధీమా కూడా వ్యక్తమవుతోంది. మంగళవారంనాడు భారత్ జట్టు ప్రాక్టీసుకు సంబంధించిన ఫోటోలను బిసిసిఐ విడుదల చేసింది.

రానున్న మ్యాచ్‌కు సమాయత్తం అయ్యేందుకు ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోకుండా దక్షిణాఫ్రికాను నిలువరించడమే ధ్యేయంగా భారత జట్టు కృతనిశ్చయంతో ఉందని చెప్పడానికి క్రికెటర్ల సాధననుబట్టి స్పష్టమవుతోంది. అయితే ఈ సీరీస్ భారత్ సొంతం కావాలంటే ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు అద్భుతంగా రాణించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మహ్మద్ షమీ, ఉమేష్ యాదవ్, ఇయాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్యా ఎంతగా రాణించగలిగితే అంతగానూ దక్షిణాఫ్రికా జట్టును భారత్ కట్టడి చేయడమే కాకుండా రికార్డు విజయాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ మ్యాచ్‌లో ఫాస్ట్ బౌలర్ల రాణింపుపైనే అందరి దృష్టీ కేంద్రీకృతం అయినప్పటికీ స్పిన్నర్లు అశ్విన్, రవీంద్ర జడేలా కూడా తమవంతు చేయూతను అందిస్తే తప్ప భారత కలల విజయం సాకారం అయ్యే అవకాశం ఉండదన్న భావనా వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా దక్షిణాఫ్రికాలో భారత జట్టుకు ఎదురయ్యే సవాళ్లు ఏ విధంగా ఉండబోతున్నాయన్న దానిపై క్రికెటర్లు మాట్లాడారు. అయితే ఏ రకమైన పిచ్ అందుబాటులో ఉంటుందీ, దాని కండిషన్ ఎలా ఉంటుందన్నదే ఈ మ్యాచ్‌లో కీలకం కాబోతోందని భువనేశ్వర్ కుమార్ తెలిపాడు. తాము ఏ రకమైన వ్యూహంతో ముందుకు వెళ్లాలన్న అంశంపై ఇంతవరకు చర్చించలేదని, ప్రాథమిక అంశాలపై మాత్రం దృష్టి కేంద్రీకరించామని ఈ స్వింగ్ స్పెషలిస్ట్ తెలిపాడు. ఇప్పటివరకూ భారత్ జట్టు తన సొంత గడ్డపై దక్షిణాఫ్రికాపై 17 టెస్టు మ్యాచ్‌లు ఆడింది. వీటిలో రెండింట్లో మాత్రమే విజయం సాధించింది. ఎనిమిది టెస్టులను దక్షిణాఫ్రికా సొంతం చేసుకుంది. ఏడు టెస్టులు డ్రాగా ముగిసాయి.

Printed and Published from Vijayawada by K.Sudhakar on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor T.V.Ravi Reddy, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

భూమిక
bhoomika@andhrabhoomi.net
ఆంధ్రభూమి
బుధవారం 3, జనవరి 2018



కళారత్న డా. వనజా ఉదయ్ అత్యుత్తమ నర్తకీ మణి. కూచిపూడి, భరతనాట్యం రెండు సంప్రదాయ నృత్యాలు అద్భుతంగా చేయగల కళాజ్యోతి. కొన్ని దశాబ్దాలుగా నాట్యానికే అంకితమైన ఈ నాట్య మయూరి. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, నృత్య శాఖలో పనిచేస్తున్నారు. నర్తకిగా, గురువుగా, తల్లిగా, గృహిణిగా, పరిశోధకురాలిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న లలిత కళాభారతి ఈవిడ. ప్రఖ్యాత టివి నటుడు ఉదయ్ ఈమె భర్త. వీరికి తనయ్ అనే కొడుకు. 'కల్చరల్ టూరిజం అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' మీద పరిశోధన చేసి, పిహెచ్‌డి పొంది ఆ గ్రంథాన్ని ప్రచురించారు.

కళాజ్యోతి

- సంప్రదాయ నృత్యాలకు జీవం
- జాతీయ అంతర్జాతీయ ప్రదర్శనలతో కూచిపూడికి కీర్తి



చదువుల సరస్వతి..

డా౹ వనజా ఉదయ్ చదువులతల్లి, కల్పవల్లి. ఎం.ఎ సోషియాలజీ, పబ్లిక్ రిలేషన్స్‌లో పిజి డిప్లొమా, భరతనాట్యంలో డిప్లొమా, స్పానిష్‌లో డిప్లొమా, టూరిజంలో డిప్లొమా, కూచిపూడి నృత్యం టూరిజంలో పిహెచ్‌డి చేశారు. దూరదర్శన్ కూచిపూడి నృత్యంలో ఏ గ్రేడ్ కళాకారిణి. ఐసిసిఆర్‌లో కూచిపూడి నృత్యంలో ఎంపానెల్డ్ నర్తకీమణి.

ఎన్నో బాలేలుకు కొరియోగ్రఫి

డా౹ వనజా ఉదయ్ ఎన్నో బాలేలు, కొరియోగ్రఫి చేశారు. అందులో కొన్ని ముఖ్యమైనవి

గాంధీ, అలువేలుమంగ విలాసం, మోహినీ భస్మాసుర, తెలుగు తేజాభినయం, తెలుగు విజయం, శ్రీకృష్ణదేవరాయ, జయం మనదే, రక్తదానం, స్వగతి, ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్‌లోనూ, 'నా తెలంగాణ', వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్, న్యూఢిల్లీలో బాలే, వరల్డ్ కల్చరల్ ఫెస్టివల్, న్యూఢిల్లీలో కూచిపూడి ప్రదర్శన, శ్రీశ్రీ రవిశంకర్ ఆశీస్సులతో ప్రదర్శించారు.

దేశ విదేశాలలో 4300 పైగా ప్రదర్శనలు

డా౹ వనజా ఉదయ్ 4300 పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్నో లెక్చర్ డెమాన్‌స్ట్రేషన్స్ ఇచ్చారు. ఐసిసిఆర్, ఇండియన్ కల్చరల్ అసోసియేషన్స్, విదేశీ విశ్వవిద్యాలయాలు ఎన్నో సంస్థల ద్వారా ప్రదర్శనలిచ్చారు. కూచిపూడిలో యుఎస్‌ఎ, కెనడా, యుకె, ఇటలీ, జర్మనీ, పారిస్, స్విట్జర్లాండ్, ఆమ్‌స్టర్‌డామ్, డెన్వాంగ్, ఐర్లాండ్, సింగపూర్, మలేసియా, హాంగ్‌కాంగ్, లండన్, మకావ్, బ్రూనై, సౌత్ ఆఫ్రికా, దుబాయ్, అబుధాబి, మారిషస్, రీ యూనియన్ ఐలాండ్స్, శ్రీలంక, మెక్సికో, కొలంబియా మొదలగు దేశాలలో ప్రదర్శించారు.

కల్కీ, కళాకార్ సమ్మేళన్, హరిదాస్ సమ్మేళన్, కూచిపూడి డాన్స్ ఫెస్టివల్, బంగళూరు, కూచిపూడి, యుఎస్‌ఎ, కాళిదాస్ సమారోహ్, నృత్యోత్సవ్, కేంద్ర సంగీత నాటక అకాడమీ నృత్యోత్సవ్, యక్షగాన ఫెస్టివ్-కేంద్ర సంగీత నాటక అకాడమీ, ఫెస్టివల్ ఆఫ్ హైదరాబాద్, ఇందూర్ ఫెస్టివల్, ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్, న్యూఢిల్లీ, సూరజ్‌కుంద్ ఫెస్టివల్ హర్యానా, 400 సంవత్సరాల శ్రీకృష్ణదేవరాయ ఉత్సవాలు, స్పిరిట్ ఆఫ్ యూనిటీ జాతీయ సమైక్యత ప్రదర్శనలు, పల్లవోత్సవ ఫెస్టివల్ మైసూరు, జగల్‌బందీ ఫెస్టివల్ జోనల్ కల్చరల్ సెంటర్లు, మిలీనియం ఫెస్టివల్- ఇలా ఎన్నో జాతీయ అంతర్జాతీయ ప్రదర్శనలిచ్చి కూచిపూడి కీర్తి పతాక నెగురవేశారు.

కళాంజలి
-డా. శ్రీలేఖ కొచ్చెర్లకోట, పిహెచ్.డి

పరిశోధకులకు మార్గదర్శిగా..

గురువు అంటే చీకటినుండి వెలుగుకు దారిచూపేవారు అని అర్థం. డా౹ వనజా ఉదయ్ శ్రీ మహంతి వెంకటేశ్వరరావు, వైజాగ్ వద్ద భరతనాట్యం నేర్చుకున్నారు. డా౹ ఉమారామారావు, హైదరాబాద్ వద్ద భరతనాట్యం, కూచిపూడి నేర్చుకున్నారు. డా౹ భాగవతుల సేతురాం, హైదరాబాద్ వద్ద కూచిపూడి, యక్షగానాలు నేర్చుకున్నారు. సి.ఆర్.ఆచార్యులు, పి.యు.జి.కృష్ణశర్మ, వేదాంతం సత్యనారాయణ శర్మ, కళానిధి నారాయణ, డా. నటరాజ రామకృష్ణలు నిర్వహించే సెమినార్లకు, వర్క్‌షాప్‌లకు వెళ్లి ఎంతో నేర్చుకున్నారు. వనజ గత 25 సంవత్సరాలుగా పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో నృత్య శాఖలో పనిచేస్తున్నారు. ఇపుడు పిహెచ్‌డి పరిశోధకులకు మార్గదర్శిగా ఒక దారి దీపం అయ్యారు.

కళాసేవకు అంకితం..

డా౹ వనజ ఉదయ్ ఎన్నో దేశ విదేశాలలో సెమినార్లు ఇచ్చి వర్క్‌షాప్స్ ద్వారా నృత్యానికి ఎంతో సేవ చేశారు. అందులో కొన్ని ముఖ్యమైనవి. -

- వరల్డ్ తెలుగు ఫెడరేషన్, మలేసియా



- సింగపూర్ తెలుగు సమాజం, సింగపూరు
- భారతీయ విద్యాభవన్, లండన్
- యూనివర్సిటీ ఆఫ్ పారిస్, పారిస్
- న్యూయార్క్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, న్యూయార్క్
- రట్గర్స్ యూనివర్సిటీ, న్యూజెర్సీ
- యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయ్, చికాగో
- యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్‌ఏంజిలిస్
- మహాత్మా గాంధీ యూనివర్సిటీ, మారిషస్
- ఇండియన్ కల్చరల్ సెంటర్, మారిషస్
- ఇండియన్ కల్చరల్ సెంటర్, కొలంబో
- ఇండియన్ కల్చరల్ అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా

ఇలా దేశ విదేశాలలో నృత్యాన్ని ప్రచారం చేస్తూ, కళకి ఎంతో సేవ చేస్తున్నారు కళారత్న డా౹ వనజా ఉదయ్.

ఎన్నో పురస్కారాలు..

ఎన్నో గౌరవాలు, మరెన్నో సత్కారాలు, పురస్కారాలు పొందారు డా౹ వనజా ఉదయ్. వాటిలో కొన్ని..

శృంగారమణి - సుర సింగార్ సంసద్
ఔట్‌స్టాండింగ్ పర్సన్ ఆఫ్‌ది ఇయర్ - బాలభారతి
నాట్యమయూరి - భరత్ భారతి
సరోజినీ నాయుడు అవార్డు - ఆరాధన
దుర్గాభాయి దేశ్‌ముఖ్ అవార్డు - అభినందన
కళాజ్యోడి - వైష్ణవి ఆర్ట్ థియేటర్స్
లలిత కళాభారతి - కమలాకర్ లలిత భారతి
నాట్య కళాతపస్వి - కళాభారతి
అభినయ తేజస్విని - నటరాజ కళా సమితి
నాట్యజ్యోతి - అకాడమీ ఆఫ్ ఇండియన్ ఆర్ట్స్
పద్మమోహన్ అవార్డు - పద్మా ఆర్ట్స్ అకాడమీ
రాష్ట్రీయ వికాస్ శిరోమణి - ఢిల్లీ తెలుగు అకాడమీ
ఇటిఎ అవార్డు - యూరోపియన్ తెలుగు అసోసియేషన్
ఔట్‌స్టాండింగ్ డాన్సర్ - మలేసియా తెలుగు అసోసియేషన్
గౌరవ పురస్కారం - ఢిల్లీ తెలుగు అకాడమీ
ఉగాది విశిష్ట పురస్కారం - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
కళారత్న అవార్డు - ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం
రాజీవ్ ప్రతిభా పురస్కారం - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రతిభా పురస్కారం - హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం
మెంబర్ రీజినల్ ఫిలిం సెన్సార్ బోర్డ్



పసందుగా పాయసం..

చిన్నపిల్లలకు పాయసం అంటే ఎంతో ఇష్టపడతారు. పుట్టిన రోజునాడు ఇంట్లో పాయసం తప్పనిసరిగా చేసుకుంటారు. ఇంటికి వచ్చిన అతిథులకు పాయసం వడ్డించేందుకు వీలుగా ఇవి తయారు చేసుకోండి.

ఓట్స్ పాయసం



ఓట్స్ - 2 కప్పులు
చిక్కని పాలు - 1 లీటరు
పంచదార - 250గ్రా.
నెయ్యి - 5 చెంచాలు
ఏలకులు - 6
బాదం, పిస్తా, జీడిపప్పులు - 1 కప్పు
కొబ్బరి కోరు - 5 చెంచాలు
కండెన్స్‌డ్ మిల్క్ - 2 కప్పులు

విధానం:ముందుగా ఓట్స్ నేతిలో వేయించాలి. డ్రై ఫ్రూట్స్ నేతిలో వేయించి ఉంచాలి. పాలు మరగనిచ్చి దానిలో ఓట్స్ వేసి మరగనివ్వాలి. మెత్తగా ఉడికాక కండెన్స్‌డ్ మిల్క్, కొబ్బరి, పంచదార, మిగిలిన నెయ్యి వేసి మరగబెట్టి, ఏలకులపొడి డ్రై ఫ్రూట్స్ వేసి కలిపి దింపాలి. వేడి వేడిగా కప్పుల్లో పోసి త్రాగండి.

బియ్యం, పెసరపప్పు పాయసం



బియ్యం - 1 కప్పు
పెసరపప్పు - 1 కప్పు
నెయ్యి - 1/2 కప్పు
ఏలకులు - 5
బెల్లం కోరు - 1 కప్పు
పంచదార - 1 కప్పు
పాలు- 2 లీ.
జీడిపప్పులు - 24
కిస్‌మిస్ - 24
కొబ్బరికోరు - 1/2 కప్పు

విధానం:ముందుగా పప్పు, బియ్యం కడిగి కప్పు నీరు చేర్చి కుక్కర్‌లో ఉడికించాలి. మూడు విజిల్స్ వచ్చాక దింపి చల్లార్చాలి. ఈలోగా పాలు బాగా మరిగించాలి. 1/4 మరిగాక దానిలో బెల్లం, పంచదార, కొబ్బరికోరు అన్నీ కలిపి మరో పావుగంట ఉడకనివ్వాలి. ఇపుడు మిగిలిన నెయ్యి పోసి బాగా కలియబెట్టి దింపి కప్పులో సర్దండి.

శెనగ పాయసం



శెనగపప్పు - 2 కప్పులు
బొంబాయి రవ్వ - 1/2 కప్పు
పాలు - 1 లీ.
పంచదార - 2 కప్పులు
ఏలకులు - 5
కొబ్బరి కోరు - 1/2 కప్పు
జీడిపప్పులు -24
కిస్‌మిస్‌లు - 24
నెయ్యి - 1/2 కప్పు

విధానం:ముందుగా బొంబాయి రవ్వ, జీడిపప్పులు నేతిలో వేయించాలి. శెనగపప్పు కుక్కర్‌లో పెట్టి 4 కప్పుల నీరుతో ఉడికించాలి. పాలు మరగనిచ్చి ఉంచాలి. ఇపుడు కుక్కర్ మూత తీసి అందులో పంచదార చేర్చి బాగా కలిపి పాలు డ్రై ఫ్రూట్స్ చేర్చి మరో పది నిమిషాలు ఉడకనిచ్చి జీడిపప్పులు, కిస్‌మిస్‌లు చేర్చి దింపాలి.

మిల్క్ బర్ఫీ



పాలు - 1 లీ.
శెనగపిండి - 1 కప్పు
నెయ్యి - 1 కప్పు
పంచదార - 2 కప్పులు
జీడిపప్పులు- 24
కొబ్బరి కోరు - 1/2 కప్పు
ఏలకులు - 5
డాల్డా - 1 కప్పు

విధానం:శెనగపిండి దోరగా వేయించాలి. నెయ్యి, డాల్డా కరగనిచ్చి ప్రక్కన పెట్టాలి. బాణలిలో పంచదార పాకం రానిచ్చి నెయ్యి మిశ్రమం పోసి బాగా కరగనిచ్చి శెనగపిండి, బాగా మరిగించిన పాలు పోస్తూ ఉడకనివ్వాలి. దోరగా వేగిన కొబ్బరి చేర్చి దగ్గర పడేలా కదిపి, పళ్ళానికి నెయ్యి రాసి పప్పులు కిస్‌మిస్‌లు పరచి ఈ మిశ్రమం పోసి ఆరనిచ్చి ముక్కలుగా చేసుకోవాలి. గిన్నె నుంచి మిశ్రమం విడిపోతుంటే ఉడికినట్లు అర్థం.

సేమ్యా, సగ్గుబియ్యం మిక్స్‌డ్ పాయసం



సేమ్యా - 1 కప్పు
సగ్గుబియ్యం - 1 కప్పు
క్యారెట్ కోరు - 1/2 కప్పు
పంచాదార - 1 కప్పు
నెయ్యి - 5 చెంచాలు
జీడిపప్పులు - 24
బాదం పప్పులు - 12, కిస్‌మిస్‌లు - 24, ఏలకులు - 6
పాలు - 2 లీటర్లు


విధానం: ముందుగా సగ్గుబియ్యానికి సరిపడా నీరు చేర్చి ఉడకనివ్వాలి. ఇది ఉడికాక నెయ్యి వేసి కలిపి పాలు పోసి సేమ్యా వేసి మరగనివ్వాలి. నేతిలో వేయించిన డ్రై ఫ్రూట్స్, పంచదార ఏలకులు పోసి మరగనివ్వాలి. ఈలోగా క్యారెట్ విడిగా ఉడికించి దాన్నిపై మిశ్రమానికి కలిపి బాగా ఉడికించాలి. బుడగలు వస్తుండగా దింపి, డిష్‌లో పోసి కప్పుల్లో సర్ది అతిథులకివ్వాలి.

-నారుమంచి వాణీప్రభాకరి


ముత్యాల ముగ్గు



డి. శ్రీలత,
మార్తశెట్టివారి వీధి,
కావలి.



17 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు
(సరిచుక్క)



23 చుక్కలు
1 వచ్చేవరకు

ఎ.కృష్ణవేణి,
సమతానగర్,
ఒంగోలు,
ప్రకాశం జిల్లా.

ముగ్గులు పంపాల్సిన చిరునామా

ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్-500003.
★కలర్ స్కానింగ్ చేసిన ముగ్గులను JPG ఫార్మాట్‌లో
bhoomika@andhrabhoomi.net కు మెయిల్‌లో కూడా పంపొచ్చు.



వ్యూహం

9 **అలపర్తి రామకృష్ణ**

''నా రూపం ఆయనకు నచ్చదు. ఆయన ప్రవర్తనా నాకు నచ్చలేదు. మనస్ఫర్థలు వచ్చాయి.. విడిపోయాం! నా లైఫ్‌బుక్‌లో వివాహానికి సంబంధించిన పేజీలన్నీ చించేశాను. విడాకులు తీసుకున్న సమయంలో మూడు నెలల గర్భవతిని.. అబార్షన్ చేయించుకుందామనుకున్నాను.. మనస్సు ఒప్పుకోలేదు. నిన్ను కన్నాక నిన్ను పెంచే భారం మీ అమ్మమ్మ, తాతయ్యలకు వదిలేసి అమెరికా వెళ్లిపోయాను.. అమ్మా నాన్నలు పెద్దవాళ్ళయ్యారు.. వాళ్ళను చూసుకోవాలి. నీకు పెళ్లి చేసి మనవడు, మనవరాలితో ఆడుకుంటూ కాలం గడిపేస్తాను.. మీ నాన్నగారి ప్రస్తావన మళ్లీ తీసుకురావద్దు.. ఆయన రూపం నీ మనస్సులో పడకూడదని ఇంట్లో వున్న మా పెళ్లి ఫోటోలు చించేశాను. ఇంట్లో ఆయన ఫొటో లేకుండా చేశాను. ఆయన ఎక్కడ ఉన్నాడో? ఏం చేస్తున్నాడోనని నేనెప్పుడూ ఆలోచించలేదు.. అంత అసహ్యం కల్గింది కొన్ని నెలల వైవాహిక జీవితంలో.. ఆ విషయం వదిలెయ్యి గాని, ఓ అమ్మాయంటే ఇష్టపడ్డానని మొన్న ఫోన్లో చెప్పావ్.. నాకు ఆ అమ్మాయిని చూపించవా?'' అడిగింది మానస.

''ముందు కార్లో కూర్చో! ఇంటికి వెళ్ళేక మాట్లాడుకుందాం'' అన్నాడు స్కంద.

⁂

దీపావళికి అతి కష్టంమీద నాలుగు రోజులు సెలవు మంజూరు చేయించుకుని హైదరాబాద్ వచ్చింది లోహిత.

''సావేరికి మంచి సంబంధం చూసి పెళ్లి చేద్దాం'' అంది లోహిత అన్నపూర్ణతో.

''పెళ్ళంటే మాటలా? కట్న కానుకలు ఇచ్చుకోవాల్సి వుంటుంది. పైగా పెళ్లి ఖర్చులు పెట్టుకోవాలి.. కనీసం ఇరవై లక్షలన్నా లేనిదే ఆ ప్రయత్నం చేయలేము.. ముందు నీ పెళ్లి కాకుండా దానికి సంబంధాలు వెతుకుతుంటే నలుగురూ నాలుగ రకాలుగా అనుకుంటారు''.

''మా హాస్పిటల్ వాళ్ళు యాభై లక్షలదాకా లోన్ ఇస్తారు.. నిదానంగా నా జీవితంలో ఆ లోన్ అమౌంట్ మినహాయించుకుంటారు'' అంది లోహిత.

''అంటే ఆ హాస్పిటల్లోనే సంవత్సరాలపాటు పనిచేస్తావా? మా అందరికి దూరంగా నువ్వు అక్కడ పని చెయ్యడం నాకు ఇష్టం లేదు'' అంది అన్నపూర్ణమ్మ.

''నా పెళ్ళి ముందు జరగడం నాకూ ఇష్టం లేదు. అక్కడ పెళ్లి తరువాతే నా పెళ్లి.. లేదా ఇద్దరి పెళ్లిళ్ళు ఒకేసారి జరిగేటట్లు ఏర్పాటు చేసుకోండి.. నేను రెడీ..!'' అంది సావేరి.

''ఇది చూడవే అమ్మా! పెళ్లికి ఎంత తొందర పడుతుందో? దీనికి పెళ్లి చెయ్యడం ఆలస్యం అయితే నేను చేసుకోబోయే అబ్బాయి చేతే తనూ మూడు ముళ్ళు వేయంచుకునేటట్లు వుంది'' అంది చెల్లెలు చెవి పట్టుకుని మెలిపెడుతూ.

''తీసుకోవాలా? తిరిగి ఇచ్చెయ్యాలా?'' అన్నట్లుగా అక్కవైపు చూసింది సావేరి.

అది గమనించి ''పరాయివాళ్ళం కాదులే! అయినవాళ్ళమే! అంటే బాగా పరిచయం వున్నవాళ్ళమే! మీ అక్కకు మా అబ్బాయి సన్నిహితుడు'' అంది మానస.



''అక్క ఎవరినో సెటప్ చేసుకున్నట్లుందే.. అందుకే నా పెళ్లి విషయం మాట్లాడుతూ వుంది'' అంది చక్కలిగింతలు పెడుతూ.

''ఏమిటా మాటలు.. పెద్దంతరం లేదు చిన్నంతరం లేదు''.

ఇంటిముందు కారు ఆగిన శబ్దం విన్పించింది.

స్కంద, మానస లోపలికి వచ్చారు.

మానస తన చేతిలో ఫ్రూట్స్, స్వీట్లు వున్న ప్లాస్టిక్ సంచులను సావేరికి ఇచ్చింది లోపల పెట్టమని సైగ చేస్తూ.

లోపలికి తీసుకువెళ్ళమని సైగ చేసి చెల్లెలు ప్రక్కకు వచ్చి ''ఫలహారాలు, కాఫీ ఏర్పాట్లు చూడు'' అని చెల్లెలు చెవిలో ఊదింది లోహిత.

''మా అమ్మగారు డాక్టర్ మానస.. మొన్నటి దాకా అమెరికాలో ప్రాక్టీస్ చేశారు. ఇండియా మీద గాలి మళ్లీ వచ్చేసింది.. ఇక్కడే వుంటారు.. మా ఇల్లు జూబ్లీ హిల్స్‌లో వుంది ఆంటీ! మీరు మీ అమ్మాయిని తీసుకుని మా ఇంటికి రండి'' ఇంతకు ముందు పరిచయం వున్నవాడిలా అన్నపూర్ణమ్మ గారితో మాట్లాడేశాడు స్కంద.

ఎదురుగా నిలబడ్డ లోహితను చూస్తూ వుండిపోయింది.

''డాక్టర్ లోహిత.. భద్రాచలంకు దగ్గరలో వున్న ప్రైవేట్ హాస్పిటల్లో పనిచేస్తూ వుంది'' అన్నాడతను లోహితను పరిచయం చేస్తూ.

''రామ్మా.. వచ్చి కూర్చో'' తన ప్రక్కన సోఫాలో కూర్చోమని చేతితో సైగ చేస్తూ అంది మానస.

తన ప్రక్కన ఆ అమ్మాయి కూర్చోగానే తలని మిరి 'గుడ్ సెలక్షన్... ముద్దమందారంలా వుంది' అందామె కొడుకు వైపు తిరిగి చిరునవ్వు చిందిస్తూ.

అన్నపూర్ణమ్మగారు కూడా వంట గదిలోకి వెళ్లింది.

''మీరు వస్తున్నట్లు ముందుగా చెప్పొచ్చు కదా!'' అంది లోహిత స్కంద వైపు తిరిగి.

''ముందుగా చెబితే ఏం ఏర్పాట్లు చేస్తావ్.. ముస్తాబై రెడీగా వుండేదానివా? నీకు ఏ అలంకరణ అవసరం లేదు.. ఏడు రంగుల హరివిల్లులా వర్ణశోభితంగా కన్పిస్తావ్'' అంది మానస లోహితను దగ్గరకు తీసుకుని ముచ్చటపడి బుగ్గమీద ముద్దుపెట్టుకుంటూ.

''అది కాదండి.. ముందుగా తెలిస్తే అమ్మ ఏదైనా టిఫిన్ చేసి రెడీగా వుంచేది'' అంది లోహిత.

''భోజనం చేసి వచ్చాం.. ఇపుడు టిఫిన్ తినే పరిస్థితి లేదులే'' అన్నాడు స్కంద.

ప్లేట్లలో ఫ్రూట్స్ ముక్కలు, స్వీట్లు తెచ్చి టీపాయ్ మీద ఉంచింది సావేరి.

''మేం తెచ్చినవి మాకే పెడుతున్నావా?'' నవ్వుతూ అంది మానస.

''మా దగ్గర ఏం వున్నాయి ఇవ్వడానికి.. మా అక్క తప్ప''

''నాకు ఇంకో కొడుకు వున్నట్లయితే నిన్ను కూడా కోడలిగా చేసుకునేదాన్ని.. అక్కా చెల్లెళ్లు ఇద్దరూ కవల పిల్లల్లా కనిపిస్తున్నారు. ఏదన్నా ఛాన్స్ వుందేమో మావాడిని అడిగి చూడు.. మీ అక్కకు బదులు నువ్వు మా ఇంటి కోడలిగా వద్దువుగాని'' అంది మానస.

పగలబడి నవ్వింది సావేరి.

''లేదు.. లేదు.. లోహితకు ఆల్రెడీ కమిట్ అయిపోయాను.. నో ఛాన్స్.. రాముడిది ఒకే బాణం, ఒకటే మాట, ఒకటే పత్ని.. 'ఏవండీ! ఆవిడ వచ్చిందని' మా ఆవిడ అనడానికినో ఛాన్స్!'' అన్నాడు స్కంద.

అందరూ నవ్వుకున్నారు.

- ఇంకాఉంది



నేర్చుకుందాం

శ్రీ నరసింహ శతకములోని పద్యము

సీ॥ నరసింహా! నీ దివ్యనామ మంత్రము చేత
దురిత జాలము లెల్లc ద్రోలవచ్చు
నరసింహా! నీ దివ్యమంత్రము చేత
బలుపైన రోగముల్ పాపవచ్చు
నరసింహా! నీ దివ్య నామ మంత్రముచేత
రిపు సంఘముల సంహరింపవచ్చు
నరసింహా! నీ దివ్యనామమంత్రము చేత
దండహస్తుని బంట్ల -దఱుమవచ్చు

తే. భళిర! నేనీ మహామంత్ర బలము చేత
దివ్యవైకుంఠపదవి సాధించవచ్చు
భూషణ వికాస శ్రీధర్మపురి నివాస!
దుష్టసంహార! నరసింహ ! దురిత దూర!

భావం: ఓ నరసింహస్వామీ! నీ పవిత్ర నామ మంత్రాన్ని జపించడం వల్ల పాపాలన్నింటిని పారద్రోలవచ్చు. కఠినమైన రోగాల్ని తొలిగించవచ్చు. శత్రువుల్ని తుదముట్టింపవచ్చు. ప్రాణాల్ని కొని పోవ వచ్చిన యమదూతల్ని తరుమవచ్చు. నీ నామ మంత్రాన్ని జపించి వైకుంఠధామాన్ని చేరవచ్చు. ఒక్క నారసింహుని మంత్రాన్ని అనుష్ఠించినట్లయితే ఆర్తిగా ఒక్కసారి పిలిచినట్లు అయితే పరమాత్మను కరుణించని ఘట్టం ఏదీ ఉండదు. ఆర్తిలేకుండాకేవలం డంబాచారాలను ప్రదర్శిస్తే భగవంతుడు కూడా అజ్ఞానాన్ని చూసి నవ్వుకుంటాడు. అట్లాకాక నిజమైన ఆర్తితో భగవంతునిపై అచంచలమైన నమ్మకంతో నామస్మరణచేసినవారికి భగవంతుడు తోడునీడై ఉంటాడు.

మాటాట : 1527

నిర్వహణ: సుధామ

1		2		■	3	4
	■		■	5	■	
6		■	7		■	
■	■	8	■		■	■
9	■	10		■	11	12
	■		■	13	■	
14					■	

ఆధారాలు

అడ్డం:
1. ఆంగ్లంలో కొత్త సంవత్సరం
3. దినచర్య రాసుకొనే పుస్తకానికి వ్యవహారం
6. శిరము
7. చివరకు వదిలేస్తే పాటించు
10. వస్త్రభూషణాదుల వలన కలిగిన శోభ , సంపద
11. కార్యము
14. క్యాలెండర్ లో చూసుకునేవి

నిలువు:
1. తక్కువ , కొరత
2. పూనిక
4. ఇంగ్లీషులో కారణం హేతువు
5. ఆంగ్లంలో శుభాకాంక్షలు
8. మధు క్షీర పదార్థం
9 .... రామరసం (పాట) రేదా ప్రథమాం.. వహ్ని (మాట)
12. ఏర్పాటు, తీర్పు , నిశ్చయించు
13. గారాబము, సుకుమారము

మాటాట - 1526 సమాధానం

1 వ	త్స	2 రాం	తం	■	■	3 మై
లు	■	రాం	■	4 వే	డు	క
5 వ	న్నె	■	6 బెం	గ	■	ము
■	■	7 ల	■	ము	■	■
8 కా	■	9 వ	డి	■	10 త్రి	11 వి
12 లి	గ్న	ము	■	13 నే	■	దు
ము	■	■	14 వీ	డు	కో	లు



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
మానసికాందోళన ఉంటుంది. ఆరోగ్యం విషయంలోజాగ్రత్త అవసరం. ప్రయత్న కార్యాలు సఫలమవుతాయి. వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ఆర్థిక ఇబ్బందులుండవు. నూతన వస్తు, ఆభరణాలను ఖరీదు చేస్తారు. స్నేహితులను కలుస్తారు. ఇతరులకు మంచి సలహాలు, సూచనలిస్తారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
మానసికాందోళనను తొలగించుటకు దైవధ్యానం అవసరం. శారీరక అనారోగ్యంతో బాధపడతారు. కుటుంబ విషయాలు సంతృప్తికరంగా నుండవు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలు ఖరీదు చేస్తారు. ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. అన్ని రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తారు. నూతన కార్యాలను ప్రారంభిస్తారు.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ఆర్థిక ఇబ్బందులనెదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగ రంగంలో అభివృద్ధి ఉంటుంది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
పట్టుదలతో కొన్ని కార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. పిల్లలపట్ల జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తిరీత్యా గౌరవ మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
ఆటంకాలెదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా నుండుట మంచిది. ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. అన్నింటిలో విజయం సాధిస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయాసలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నించాలి.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. ప్రయాణాలు జాగ్రత్తగా చేయుట మంచిది. అజీర్ణ బాధలు అధికమగును.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
వృత్తిరీత్యా ఇబ్బందులను అధిగమిస్తారు. మానసికాందోళనఉంటుంది. స్త్రీలు చేసే వ్యవహారాల్లో సమస్యలెదురవుతాయి. ధననష్టం ఏర్పడే అవకాశముంటుంది.



మంచిమాట

మేలుకొలుపులు

తిరుప్పావై 17వ పాశురం 'అంబరమే తుణ్ణీరే'

అమ్బరమే తుణ్ణీరే శోటే అఱమ్ శెయ్యుం
ఎంబెరుమాన్ నందగోపాలా ఎళుందిరాయ్
కొమ్బునార్కెల్లాం కొళున్దే కులవిళక్కే
ఎంబెరుమాట్టి యశోదాయ్ అఱివురాయ్
అమ్బరం ఊడరుత్తు ఓంగి ఉలకు అళంద
ఉమ్బర్ కోమానే ఉరంగాదు ఎళున్దిరాయ్
శెంపొన్ కోమానే ఉరంగాదు ఎళున్దిరాయ్
శెంపొన్ కళల్ అడిచ్చెల్వా బలదేవా
ఉంబియుం నీయుం ఉరంగు ఏల్ వార్ ఎంపావాయ్

భావం: ఈనాటి పాశురంలో శ్రీకృష్ణుని తండ్రియైన నందగోపుని, తల్లియైన యశోదాదేవిని, శ్రీకృష్ణుని అన్నగారైన బలరాముని నిద్ర లేపుతున్నది ఆండాళ్ తల్లి. ఈ పాశురంలో నందగోపుని దాతృత్వాన్ని, అజ్ఞానాన్ని దూరం చేసి దారిచూపే మంగళదీపం వంటి యశోదాదేవి స్వరూపాన్ని కరుణాహృదయాన్ని ప్రశంసిస్తున్నారు గోపికలు. శ్రీమన్నారాయణుడి సర్వవ్యాపకత్వాన్ని, దాతృత్వాన్ని, భాగవతులపైన వాత్సల్యం కలిగిన బలరామ దేవుడిని ప్రశంసిస్తూ మమ్ము కరుణించమని కోరుతున్నారు గోపికలు.

కరుణతో సున్నితమైన శరీరంగల స్త్రీలలో కరుణార్ద్ర హృదయంలో శ్రేష్ఠమైన చిగురువంటిదాని, మంగళదీపము వంటి దానివీ అయిన యశోదమ్మ తల్లీ! నీవు మేల్కోవాలి. మమ్ము రక్షించాలి. సమస్త లోకాలను కొలిచిన త్రివిక్రమ రూపా! నిరంతరం నిత్య సూరులను ప్రకాశింపజేసేవాడివి! నీవు మేల్కొని మమ్ము కూడా నీ దాతృత్వంతో కరుణించాలి. ఎఱ్ఱని బంగారు కడియాన్ని కాలికి ధరించిన ప్రేమ స్వరూపుడివి ఓ బలరామా!

తిరుప్పావై 18వ పాశురం 'ఉందుమదకళిత్తాన్'

ఉందు మద కళిత్తాన్ ఓడాద తోళ్‌వలియన్
నందగోపాలన్ మరుమగళే నప్పిన్నాయ్
కందం కమళుం కుళలీ కడైత్తిఱవాయ్
వన్దు ఎంగుం కోళి అళైత్తనకాణ్ మాదవి
ప్పన్దల్ మేల్ పల్ కాల్ కుయిలి నంగళ్ కూవినకాణ్
పన్దు ఆర్ విరలి ఉన్ మైత్తునన్ పేర్ పాడ
శెందామరై క్కైయాల్ శీర్ ఆర్ వళై ఒళిప్ప
వన్దు తిఱవాయ్ మగి ళిందు ఏలో రెమ్బావాయ్

భావం: ఈపాశురంలో పరాక్రమము గల నందగోపుని కోడలైన నీళాదేవిని నిద్రలేపి తలుపు తీసి శ్రీకృష్ణుని దర్శింపజేయవలసినదని ప్రార్థిస్తున్నది ఆండాళ్. స్థిర చిత్తాన్ని సాధించి, భగవంతుని దర్శించుకుందామనే ఆర్తితో వచ్చాము తల్లీ!


నీ హృదయ గుహల్లో దాగి ఉండే పరమాత్మను మాకు దర్శనం చేయించే శక్తి నీకే వుంది. కనుక ఆ ద్వారపు గడియను తీసి మమ్ము ఆయన చెంతకు చేర్చవమ్మా! ఉదారత, శక్తి కలిగిన నందగోపుడి కోడలివి నీవు అంటూ భక్తితో వేడుకుంటున్నారు గోపికలు.

ఏనుగులతో పోరాడగలిగిన వాడును, మథించిన ఏనుగు వంటి భుజబలము కలవాడును, మద జలము స్రవించే ఏనుగువంటి బలము కలవాడును అయిన నందగోపుని యొక్క కోడలైన ఓ నీళాదేవీ! పరిమళాలు వెదజల్లే కేశములు గల తల్లీ తలుపు గడియ తెరవాలి. కోళ్ళు అంతట లేచి కూస్తున్నవి. మాధవీలత ప్రాకిన పందిరిమీద కూర్చున్న కోయిలల సమూహాలు పలు మార్లు మధురంగా కూస్తున్నవి. లోకనాయకుడైన శ్రీకృష్ణ పరమాత్మ గుణములను కీర్తించుటకు మేము వచ్చి నిలిచాము. బంతిని చేతి వ్రేళ్ళతో పట్టుకొన్న తల్లీ!

సమస్త లోకాలను బంతిగా అలవోకగా పట్టి శ్రీమన్నారాయణునితో క్రీడా కాలక్షేపం చేసే తల్లి శక్తిరూపం. నీళాదేవి ఎఱ్ఱ తామరను బోలిన నీ చేతితో (అనురాగ బంధాన్ని జీవులపై ప్రసరింప జేసే తల్లి ప్రేమ రంగు ఎరుపు) కంకణాలు ధ్వనించేట్లుగా (తల్లి ప్రేమను తెలుపుతూ) లేచి వచ్చి (బిడ్డల కోసం ప్రేమతో లేచి) అజ్ఞానమనే హృదయ కవాటపు తలుపు తెరవాలి అని ప్రార్థిస్తున్నారు గోపికలు.

ఆండాళ్ తిరువడిగళే శరణమ్

- డాక్టర్. పరవస్తు కమల



యాజ్ఞసేని

-త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము

కొత్త సీరియల్ ప్రారంభం

కాంపిల్యము

పాంచాల దేశానికి రాజధాని

కురు సామ్రాజ్యానికి చుట్టూ వున్న జనపదాలలో పేరెన్నికగన్న ఒక జనపదము. భారతావనికి ఉత్తరాన పవిత్ర గంగానదికి ఇరుప్రక్కల వ్యాపించియున్న రాజ్యము. పృషతుడు పాలించిన అవిభక్త పాంచాల రాజ్యము.

కౌరవ పాండవులకు అస్త్రవిద్యా గురువైన ద్రోణాచార్యుడి కోపానికి విడదీయబడి దక్షిణ పాంచాలానికి రాజధాని అయింది.

'అహిచ్ఛత్రము' ఉత్తర పాంచాలానికి ముఖ్యపట్టణమిది.

మహాభారత ఇతిహాసంలో పాండవులు రెండుసార్లు మారువేషాలలో కాలం గడుపవలసి వచ్చింది.

లాక్షగృహం నుండి ప్రాణాలతో బయటపడి అందు మొదటిసారి మారువేషంలో కొంత కాలం తలదాచుకొన్నది ఈ కాంపిల్యంలోనే.

రెండవసారి పాండవులు మత్స్యదేశంలోని విరాట నగరంలో విరటుని కొలువులో మారువేషాలలో 'అజ్ఞాతవాసాన్ని' ఒక సంవత్సరకాలం గడిపారు.

ఈ కాంపిల్య నగరం నుండి పాండవులు హస్తినకు చేరారు. ధర్మరాజు యువరాజ పట్టాభిషిక్తుయ్యాడు.

అంత ప్రాముఖ్యాన్ని సంతరించుకున్న ఈ కాంపిల్య నగరము సప్తరాజ్యాంగాలలో వివరించబడిన విధంగా అతి ముఖ్యమైన ప్రాకారాలతో శత్రుదుర్భేధ్యమై విలసిల్లుచున్నది. ఈ నగరానికి ఒక ప్రక్క గంగానది అల్లంత దూరంలో పెట్టని కందకంగా ఏర్పడింది. లోపలి భాగంలోగల మూడు ప్రాకారాలు ఐష్టికం, దారవం, మానుషం అనేవి. మానుష ప్రకారాన్నే (నర) గర్భం అని అంటారు. ఇది లోపల వుంటుంది. ప్రాకారకర్తలు దీన్ని శ్రేష్ఠమైన ప్రాకారమని తలుస్తారు.

అట్టి ఈ నగరం తెల్లని నరగర్భంతో ప్రకాశిస్తున్నది.

ఎన్నో తాటిచెట్ల ప్రమాణంగల సాలవృక్షాలతో సంరక్షింపబడి యున్నది.

నగరం గోపురాలతో, అట్టాలకాలతో చుట్టూ నీటితో సంరక్షింపబడి యున్నది.

నాలుగు వైపులా గడ్డి, ధాన్యం, ఔషధాలు, తలుపులు, రథాలు, యంత్రాలు, ద్రవ్యాంగారాలు, ఊక మొదలైన వాటితో నింపబడి యున్నది.

భయంకరాలైన చక్రాలతో పెద్ద పెద్ద అట్టాలకాలతో, దృఢమైన చీలలు, ఘడియలు శతఘ్నులతో కూడి చొరరానిదై యున్నది.

దృఢమైన ప్రాకారాలతో నిర్మితమైన ఆ కోటలో సమృద్ధిగా ఆహార ధాన్యాలను గిడ్డంగులలో నిల్వచేసి ఉంచారు.

కొన్ని ప్రాకారాలలో కార్మికులు యుద్ధ పరికరాలను తయారుచేస్తున్నారు. అలాతములు, శరములు, చక్రాలు తమరములు, పరశువులు, అంకుశములు, చిల్లకోలలు, త్రాళ్ళు, చిరుకత్తుల్లాంటి మొనలుదేలిన బాణాలు, అర్ధచంద్రాకార బాణాలు, పరిగలలాగా ఉండే బాణాలు, కరవాలాలు, గనెరాకమ్ములు, కుప్పెకోలలు, కూర్మనఖరం, చక్రమార్గణం, చిపయమ్ము, వత్సదంతిశరాలు, శిలాశితశరాలు, గదలు, పరిఘలు, పాశములు, ముద్గరములు, ముసలములు, శక్తాయుధాలు, శూలములు, బళ్ళెములు, శతఘ్నులు మొదలైన వివిధాయుధాలను ఉత్పత్తి చేస్తున్నారు.

మరొక ప్రాకారంలో కొంతమంది కార్మికులు యుద్ధాలో పనికివచ్చే రక్షణ కవచాలైన కత్తులు, శిరస్త్రాణాలు, తనుత్రాణాలు (కవచములు) ప్రయోగానంతరం తిరిగి వచ్చి చేరే ముక్తాలు తయారుచేస్తున్నారు.

నగరం అనేక ఉద్యానవనాలతో శోభాయమానంగా వున్నది.

కాలంగాని కాలంలో పుష్పించి ఫలాల నొసగే విధంగా ఉద్యానవనాలలోని రక్షకులు పెట్టే ధూప ధూమములు పైకెగసి తెల్లని మేఘాలవలె పైపైకి పోతున్నాయి.

అట్లా ఎంతో ఎత్తుకు పైగెసిపోతున్న మేఘాలు ఇంకా పైకెగరలేక క్రిందికివంగి నీటికోసమై గంగానదిని చుంబిస్తున్నట్లుగా ఉన్నాయి.

నగరంలో పురవీధులు అతివిశాలంగా ఉన్నాయి. వీధులకిరువైపులాయున్న ఆకాశ హర్మ్యాలు వినువీధులను తాకుతున్నట్లున్నాయి. కొన్ని ప్రాకారాలలో కర్షకులు తాము పండించిన వివిధ అపరాలను, కూరగాయలను, నగరంలో విక్రయిస్తున్నారు.

వివిధ వృత్తులవారలు వారి వారి వృత్తి నైపుణ్యంతో తయారుచేసిన వస్తువులను రాజధాని అంగళ్లలో విక్రయిస్తున్నారు.


ప్రాకారాలలో మధ్య మధ్య నిర్మింపబడిన వలయాకార బురుజుల లోపలి భాగాలలో రాతి వేదికలను నిర్మింపజేశారు.

- ఇంకాఉంది

రచనలు పంపవలసిన చిరునామా: **ఎడిటర్,** ఆంధ్రభూమి దినపత్రిక,
36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

ఆంధ్రభూమి
బుధవారం
3 జనవరి 2018

ట్రంప్ పిడికిట ఎయిర్‌ఫోర్స్-1



అమెరికా అధ్యక్షుడి సకల సౌకర్యాల ఆకాశయాన సౌధం ఎయిర్‌ఫోర్స్-1. దాని రాజసం, దర్పం నిరుపమానమే. అమెరికా అధ్యక్షుడు ఎక్కడికి వెళ్లినా ఈ విమానంలోనే వెళ్తారు. అలాంటి ఈ విమానం సంక్షిప్త నమూనాను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తిగా వీక్షిస్తున్న దృశ్యమిది. ఇది తాను ప్రయాణించే విమానమే అయినా దాని మినీ రూపాన్ని చూసి ట్రంప్ ముచ్చటపడుతున్నారు.

ఇదో సంప్రదాయ క్రీడ!



ఒక్కో దేశానిది ఒక్కో సంప్రదాయ క్రీడ. దేని ప్రత్యేకత దానిదే. ఈ సంప్రదాయాల్లోనే ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. చూసేవారికి వింతగా, విడ్డూరంగా ఉన్నా ఈ క్రీడలో తలమునకలయ్యేవారికి మాత్రం పట్టలేని ఆనందమే. ఇక్కడ కనిపిస్తున్నది స్పెయిన్‌కు సంబంధించిన ఓ క్రీడ. ఎల్స్‌ఎన్‌ఫేరినెట్ అనే సంప్రదాయ ఉత్సవం సందర్భంగా కోడిగుడ్లు, పిండితో నిండిన ప్రాంతాల్లోనే క్రీడోత్సవం జరుపుకొంటారు. ఇలా పిండిని ఒకరిపై ఒకరు జల్లుకుంటూ మహదానందం పొందుతారు.

కత్తిమీద సాము

● తదుపరి బ్రెగ్జిట్ చర్చలు సంక్లిష్టమే ● బ్రిటన్ వేయబోయే అడుగేమిటి? ● ఇమిగ్రేషన్ సమస్య గట్టెక్కేదెలా?

ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగడం అన్నది అనుకూల ప్రతికూల వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్న నేపథ్యంలో ప్రధాని థెరిసామె వేయబోయే తదుపరి అడుగు ఏమిటన్నది అంతర్జాతీయంగా ఆసక్తిని కలిగిస్తోంది. ఐరోపా యూనియన్‌లో ఉండడం వల్ల బ్రిటన్‌కు అన్ని విధాలుగా నష్టమేనన్న భావనతో దీన్నుంచి వేరుపడాలంటూ దేశ ప్రజలు మెజారిటీ తీర్పునిచ్చారు. అయితే ఐరోపా యూనియన్‌లోనే ఉండాలంటూ పట్టుబట్టినవారి ఓటుకు వైదొలగాలని భావించినవారి ఓటుకూ మధ్య తేడా స్వల్పమే కావడంవల్ల ఇప్పటికీకూడా 'ముందుకా వెనక్కా' అన్న మీమాంస కొనసాగుతూనే ఉంది. పైగా నిన్న మొన్నటివరకూ ఐరోపా యూయన్‌తో చెట్టపట్టాల్ వేసుకున్న బ్రిటన్ ఉన్నపళంగా వైదొలగడం అన్నది అంత తేలికేమీ కాదు. పైగా ఐరోపా యూనియన్‌లోని సభ్య దేశాల్లో ఆర్థికంగానూ, ఇతరత్రానూ చాలా బలంగా ఉన్న దేశం బ్రిటన్. అలాంటిది బ్రిటన్ వైదొలగడం అంటే ఏళ్ల తరబడి పెనవేసుకుపోయిన అనేక సంక్లిష్ట అంశాలను ఉభయతారకమైన రీతిలో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. కాని ఈ దిశగా ప్రధాని థెరిసామె చేపడుతున్న చర్యలు గాని, విసురుతున్న పాచికలు గాని ఇప్పటివరకూ అనుకున్న ఫలితాలను ఇవ్వలేదు. పార్లమెంటులో మెజారిటీ వస్తే తాను అనుకున్న రీతిలో ఐరోపా యూనియన్‌తో బ్రెగ్జిట్ చర్చలను కొనసాగించవచ్చునని థెరిసామె భావించారు. అయితే పార్లమెంటు ఎన్నికల్లో ఉన్న మెజారిటీ కూడా తగ్గిపోవడంతో ఏ విధంగానూ ధైర్యంగా ముందుకు వెళ్ల లేని పరిస్థితి ఆమెకు ఏర్పడింది. ఐరోపా యూనియన్‌తో జరిపే చర్చల విషయంలో బ్రిటన్‌కు ఏ విధంగానూ అన్యాయం జరగడానికి వీల్లేదని, వలసదారుల సమస్యతోపాటు అన్నింటి విషయంలోనూ ఆచితూచి వ్యవహరించాలని ప్రతిపక్ష లేబర్ పార్టీ మరింతగా పట్టు బిగించింది. ఈ నేపథ్యంలోనే వాయిదాలమయంగా సాగుతూ వచ్చిన తొలిదఫా చర్చలు ఎట్టకేలకు ముగిసాయి. అయితే తదుపరి జరిగే సమావేశాలు అనేక రకాలుగా బ్రిటన్ ప్రధానికి కత్తిమీద సాము లాంటివేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది అంతా సమస్యల మయంగా ఎటూ తేల్చుకోలేని మీమాంస చందంగా సాగిన ప్రధాని కొత్త ఏడాదిలో నిర్ణయాత్మకంగా వ్యవహరించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఐరోపా యూనియన్ నుంచి వైదొలగినప్పటి నుంచీ ఎంతోకొంత చర్చాపథంలో ప్రగతిని నమోదు చేసుకుంటూ వచ్చినప్పటికీ తదుపరి జరిగే చర్చలన్నీ కూడా బ్రిటన్ తన వైఖరిని మరింత కఠినంగా, స్పష్టంగా వ్యక్తీకరించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ దిశగా ఇప్పటికే దేశీయ రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. ఏ విధంగానూ ఐరోపా యూనియన్ షరతులకు లొంబడి బ్రిటన్ వ్యవహరించకూడదని స్పష్టం చేసిన ఈ పార్టీలు అనేక రకాలుగా వాస్తవిక దృక్పథాన్ని కూడా కనబర్చడం కొంత మేర ప్రధానికి ఊరటనిచ్చే అంశం. ఐరోపా యూనియన్ నిబంధనల ప్రకారం ఒకదేశం తన సభ్యత్వం నుంచి వైదొలగితే యూనియన్ చెప్పినట్టుగానే దాని ఆదేశాలను అనుసరించే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. అంతేగాని, వైదొలగే దేశం తన హక్కులకు సంబంధించి ఎలాంటి షరతులనూ పెట్టే అవకాశం ఉండదు. అంటే ఐరోపా యూనియన్ నిబంధనల ప్రకారమే మారు మాటాడకుండా బ్రిటన్ తప్పుకునే పరిస్థితి ఎంతమాత్రం లేదు. అందుకే నొప్పించక తానొవ్వక రీతిలో తన ప్రయోజనాలను కాపాడుకుంటూ ఐరోపా యూనియన్ ప్రతిష్ఠను ఇనుమడింపచేస్తూ, ఇతర సభ్య దేశాల నుంచి ఏ రకమైన సమస్య తలెత్తని రీతిలోనే బ్రిటన్ నిష్క్రమణ మార్గాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఇమిగ్రేషన్ సమస్య అన్నది ఎప్పటికప్పుడు సంక్లిష్టంగా మారుతూనే వస్తోంది. ఈ కొత్త సంవత్సరంలో ప్రధాని థెరిసాకు ఇది మరింత తీవ్ర సమస్యగా మారే అవకాశమూ కనిపిస్తోంది. ఐరోపా యూనియన్‌లోనూ ఐరోపా యూనియన్ వెలుపలి దేశాల నుంచి వలస వచ్చిన వారి సంఖ్య లక్షల్లోనే ఉండడం వల్ల ఆయా దేశాల ఆర్థిక పరిస్థితిపై దీని ప్రభావం చాలా తీవ్రంగానే కనిపిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ స్వేచ్ఛాయుత వలసలకు అట్టుకట్ట వేయాలన్న డిమాండ్లు తీవ్రమవుతున్నాయి. వీటిని థెరిసామె ఏ విధంగా పరిష్కరించగలుగుతారు? దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలను ఈడేర్చే దిశగా ఆమె వేసే పావులు ఎలా ఉంటాయి అన్నది కూడా ఈయూ సభ్యదేశాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బ్రిటన్ చాలా బలమైన ఆర్థిక వ్యవస్థగా ఇన్నాళ్లూ రాణించగలిగిందంటే అందుకు ఇతర దేశాల నుంచి వలస వచ్చినవారి చేయూత కూడా ఎంతో ఉంది. ఇప్పుడు బ్రెగ్జిట్ పెను సమస్యగా మారుతున్న నేపథ్యంలో వ్యవసాయ, బ్యాంకింగ్, నిర్మాణ రంగాల్లోనూ తీవ్రస్థాయిలో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా ఆరోగ్య సేవా రంగం ఇప్పటికే తీవ్రస్థాయి సమస్యలను ఎదుర్కొంటోంది. బ్రెగ్జిట్ ఓటు జరిగినప్పటి నుంచీ వేల సంఖ్యలోనే నర్సులు ఇతర దేశాలకు వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో బ్రిటన్ పట్టిందే పట్టుగా తనమాటే నెగ్గాలన్న రీతిలో వ్యవహరిస్తే దేశంలోని కీలక రంగాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకునే తొలి దశ చర్చల్లో వ్యవహరించిన ప్రధాని థెరిసా తదుపరి కీలక అంశాల విషయంలోనూ ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అటు కఠినంగానూ, ఇటు సునిశితంగానూ వ్యవహరించకుండా బ్రిటన్ ప్రయోజనాలను కాపాడుకుంటూ ఐరోపా యూనియన్ ప్రతిష్ఠ దెబ్బతినకుండా వ్యవహరించడమే ఇప్పుడు బ్రిటన్ ముందున్న కర్తవ్యం. అలాగే ఇప్పటివరకూ ఐరోపా యూనియన్‌లో ఉండడంవల్ల ఇతర దేశాలతో పెద్దగా ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవాల్సిన అవసరం గాని, అవకాశం గాని బ్రిటన్‌కు ఏర్పడలేదు. కాని ఇప్పుడు ఏకాకిగా మారడంవల్ల అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను ఇనుమడింపజేసుకునే రీతిలోనే బలమైన ప్రపంచ దేశాలతో బ్రిటన్ ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలను పెంపొందించుకోవాల్సి ఉంటుంది. అది ఎంతవరకు సాధ్యమవుతుంది అన్నది కూడా బ్రిటన్ భవితను నిర్దేశించేదే అవుతుంది. రాబోయే అంతర్జాతీయ సదస్సుల్లో ముఖ్యంగా కామన్వెల్త్ దేశాల సదస్సు మరో కీలక పరిణామమే అవుతుంది. ఆ సమయంలో కూడా బ్రెగ్జిట్‌కు సంబంధించి బ్రిటన్ తన వైఖరిని కామన్వెల్త్ దేశాలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంటుంది. ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా హాజరుకానున్నందున దీని ప్రాధాన్యత మరింత పెరిగింది. వాస్తవికత, దూరదృష్టి రంగరించిన సమతూక విధానంతో ముందుకు వెళ్లడం ద్వారా బ్రెగ్జిట్ లక్ష్యాలను బ్రిటన్ సాధించుకోగలుగుతుంది.



బి.రాజేశ్వర ప్రసాద్

కల చెదిరింది కథ మారింది

అమెరికాను తాకిన పాక్ ఉగ్ర సెగ



అమెరికా, పాకిస్తాన్‌ల కథ మొదటికొచ్చింది. పాకిస్తాన్ సహాయ, సహకారాలు లేనిదే అఫ్గాన్ కేంద్రంగా పనిచేస్తున్న తాలిబన్, అల్‌ఖయిదా ఉగ్రవాదులను మట్టుబెట్టలేమని భావించిన అమెరికా ఏళ్ల తరబడి తన రవాణా అవసరాల కోసం ఇతర ప్రయోజనాలను తీర్చుకునేందుకు పాకిస్తాన్‌పై ఆధారపడింది. అందులో భాగంగా ఆ దేశానికి బిలియన్ల కొద్దీ డాలర్లను ఎందుకూ అని అడగకుండా ఉదారంగా అందించింది. అందుకు కారణం కూడా చాలా బలమైనదే. అఫ్గనిస్తాన్‌లో ఉగ్రవాదులను ఎదుర్కోవడంతోపాటు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర మూకల ఆటలు కట్టించడంలోనూ పాక్ సహకరిస్తుందని భావించడమే. నిన్న మొన్నటి వరకూ కూడా పాకిస్తాన్ మాటలను అమెరికా నమ్మింది. తామిచ్చే నిధులన్నీ ఉగ్రవాద నిర్మూలనకే ఉపయోగించుకుంటున్నామన్న పాక్ నాయకత్వ మాయమాటలను తప్పని సరి పరిస్థితుల్లో నిజమని విశ్వసించింది. జార్జిబుష్, బిల్ క్లింటన్, బరాక్ ఒబామా హయాంలో పాకిస్తాన్‌కు అమెరికా నుంచి సాయం అందుతునే వచ్చింది. అల్‌ఖయిదా అధినేత బిన్ లాడెన్ తమ ముంగిట్లోనే ఉన్నప్పటికీ ఆ విషయం తమకు తెలియదన్నట్టే పాక్ వ్యవహరించింది. అమెరికానూ నమ్మించింది. అయితే పాక్ మాటాల్లో విశ్వసనీయత లేదన్న అనుమానాలు మొదటి నుంచీ కూడా అమెరికాకు కలుగుతునే వచ్చాయి. అందుకే తమ సొంత ప్రయత్నాల ద్వారా లాడెన్ ఉనికిని పసిగట్టి మట్టుబెట్టింది. అప్పటి వరకూ అమెరికా పాకిస్తాన్ మధ్య నడిచిన స్నేహ సంబంధాల తీరువేరు. లాడెన్ మృతి తరువాత పరిస్థితి వేరు. ఎప్పుడైతే పాకిస్తాన్ ద్వంద్వవైఖరి, మోసగాని తీరును పసిగట్టిన అమెరికా అప్పటి నుంచి దానికి కీలెరికి వాతపెట్టింది. ఒబామా రెండో సారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనప్పుడు మొదలైన ఈ దండన ఇప్పుడు ట్రంప్ రాకతో పరాకాష్టకు చేరుకుంది. 15 ఏళ్లుగా పాక్ తమనను నమ్మించిందని, వంచిందని ఇచ్చిన నిధులు ఉగ్రవాద నిర్మూలనకు కాకుండా దాన్ని పెంచి పోషించేందుకే వినియోగించిందని ట్రంప్ ధ్వజమెత్తడం చూస్తే పాక్‌తో అమెరికా సంబంధాలు బెడిసికొట్టినట్టే కనిపిస్తోంది. పాక్‌కు ఇక సాయం చేయబోమని చెప్పడమే కాకుండా ఇప్పటి వరకూ చేసిన సాయం హామీలను, భారీ కోతలను ట్రంప్ ప్రతిపాదించడం మారనున్న పరిస్థితులకు సంకేతం. పాక్‌కు ఇబ్బడి ముబ్బడిగా నిధులను అమెరికా సమకూర్చడాన్ని గట్టిగా వ్యతిరేకించిన భారత్ ఒక దశలో వాస్తవ పరిస్థితులను అమెరికా నాయకత్వానికి కళ్లకు కట్టింది. అయినా సెగ తగిలితే గాని ముందుకు కదలని అమెరికాకు పాక్ నిజస్వరూపం బయటపడితే తప్ప దాని అసలు స్వరూపం కళ్లకుకట్టలేదు. ఆలస్యంగానైనా ట్రంప్ తీసుకున్న నిర్ణయం వాస్తవాలకు అద్దం పడుతుందన్నది స్పష్టం. అయితే మొదటి నుంచీ పాక్‌ను వెనకేసుకుంటూ వచ్చిన చైనా తాజా పరిణామాల విషయంలోనూ తన వంతు నైజాన్ని ప్రదర్శించింది. ఉగ్రవాద నిర్మూలనలో అమెరికాకు పాక్ అందించిన సహాయ, సహకారాలు నిరుపమానం అంటూ సన్నాయినొక్కులు నొక్కడం మొదలెట్టింది. ఈ నేపథ్యంలో పాక్‌పై ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తే చైనా తీసుకోబోయే చర్యలు ఎలా ఉంటాయి? ఇప్పటికే ఉత్తర కొరియా విషయంలో తప్పనిసరి పరిస్థితుల్లో అమెరికాకు సహకరిస్తూ వచ్చిన చైనా తన అనుంగ మిత్రదేశమైన పాకిస్తాన్‌పై ట్రంప్ కొరడా ఝుళిపిస్తే భరిస్తుందా లేక బరి తెగిస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే.

చైనా కవ్వింపు





సముద్ర జలాలపై వివాదాల రగడ

భారత్ యుద్ధం చేయాల్సివస్తే అది తొలుత పాకిస్తాన్‌తో కాదు, చైనాతోనే అనేది నిపుణుల అభిప్రాయం. ఆ వాదనకు ఆధారమేనా అన్నట్టు చైనా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. చైనా సామ్రాజ్యవాద కాంక్షకు పాక్ కూడా అండగా నిలుస్తోంది. దొంగచాటుగా పాక్ ఆక్రమించుకున్న గిల్గిత్-బాల్టిస్థాన్‌లోని చాలా భాగాన్ని చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ పేరిట చైనాకు విక్రయిస్తోంది. ఇంకో పక్క హిందూ మహాసముద్రంపై భారత్‌కు ఉన్న ఆధిపత్యాన్ని గండికొట్టేందుకు చైనా గత దశాబ్దకాలంగా అనేక కుయుక్తులు పన్నుతునే ఉంది. ఒక పక్క భూగర్భంపై కయ్యానికి కాలుదువ్వుతున్న చైనా మరో పక్క సముద్రజలాలపైనా వివాదాలకు తెరతీస్తోంది. మాటల దూకుడుతో పాటు హిందూమహాసముద్రంపై చైనా రక్షణ తంత్రాన్ని రచిస్తోంది. అస్త్ర శస్త్రాలు సిద్ధం చేస్తూ తన నిఘా వ్యవస్థ పరిజ్ఞానాన్ని విస్తరింపచేస్తోంది. భారత్ సైతం చైనా ఆక్రమిత ఆధిపత్య ధోరణికి చెక్ పెట్టేలా ముందడుగు వేస్తోంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో (ఐఓఆర్)లో చైనాకు దీటుగా అణ్వస్త్ర సహిత జలాంతర్గాములను మోహరించేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

ఆధునీకరించిన కొత్త పరిజ్ఞానంతో సముద్రగర్భంలోనూ నిఘా పెట్టేందుకు అవసరమైన సత్తాను చైనా సమకూర్చుకుంటోంది. దక్షిణ చైనా సముద్రం, హిందూ మహాసముద్రంలోఈ వ్యవస్థ ఏర్పాటుకు తద్వారా శత్రుదేశాలకు చెక్ చెప్పాలని చైనా చూస్తోంది. ఈ పరిజ్ఞానంతో నీటి అడుగున ఉష్ణోగ్రతలు, ఇతర అంశాలను అధ్యయనం చేసే సౌలభ్యం లభిస్తుంది. దీంతో చైనా జలాంతర్గాములకు ముందస్తు సమాచారం అందుతుంది, సాఫీగా ప్రయాణించడమే గాక, ఇతర దేశాల నౌకలు, జలాంతర్గాముల రాకపోకలపై కూడా కన్నేసి ఉంచే పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుంది. హిందూ మహాసముద్రంలో ప్రస్తుతం భారత్‌దే పైచేయిగా ఉంది. తాజగా చైనా ఈ నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయడం హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశాలకు ఆందోళన కలిగించే పరిణామమే. దీంతో దక్షిణ చైనా సముద్రంతో పాటు హిందూ మహాసముద్రంలో చైనాకు ఆధిపత్యం లభిస్తుందని చైనా రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే చైనా పరిజ్ఞానం అమెరికా అంత ఆధునికమైనది కాదని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. అయినా ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రాబల్యం పెరగడంపై అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాలు సైతం ఆందోళనగా ఉన్నాయి. దక్షిణ చైనా సముద్రంలో దాదాపు 90 శాతం తమదేనని చైనా వాదిస్తోంది. ఈసముద్ర తీరంలో బ్రూనై, మలేషియా, తైవాన్, ఫిలిప్పైన్స్, వియత్నాం వంటి దేశాలకు చైనా వ్యవహారం మింగుడుపడటం లేదు. దక్షిణ చైనా సముద్రంతో ఈ దేశాలకు తీరం ఉన్నా వాటికి హక్కు లేదనే విధంగా చైనా ఏకపక్షంగా వాదిస్తోంది.

నేలపై, సముద్రంపై...

చైనా దూకుడు వైఖరి భారత్‌కు ఇబ్బందిగానే తయారైంది. ఇప్పటికే ఆఫ్రికాలోని జిబౌటీలో చైనా తన రక్షణ స్థావరాన్ని ఏర్పాటుచేసింది. బెల్ట్ అండ్ రోడ్ కార్యక్రమం, సముద్రమార్గాలతో ఆసియా, ఆఫ్రికాల్లో తన ప్రాబల్యాన్ని చాటుకునేందుకు చైనా పన్నుతున్న వ్యూహాలతో వివిధ దేశాల మధ్య ఉద్రిక్తవాతావరణం ఏర్పాడుతోంది. డ్రాగాన్‌కు ధీటుగా ఎదుర్కొనేందుకు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కలిసి వ్యూహచరన చేయాల్సిన అవసరం భారత్‌పై పడింది.

దేశీయ పరిజ్ఞానంతో 90 వేల కోట్ల వ్యయంతో నాలుగు ఎస్ఎన్‌బిఎన్‌లలో రెండోదైన ఐఎన్ఎస్ అరిధమన్‌ను విశాఖపట్టణంలో అభివృద్ధి చేస్తున్నారు. ఐఎన్ఎస్ అరిధమన్‌నువచ్చే ఏడాది ఐఓఆర్‌లో మోహరించేందుకు నావికాదళం సిద్ధమవుతోంది. ఇప్పటికే దాని నిర్మాణం కూడా పూర్తికావచ్చింది. దాంతో పాటు 60వేల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్ సహకారంతో ఆరు స్కార్పియన్ ఎస్ఎస్ఎన్‌లను భారత్ నిర్మిస్తోంది. అందులో ఒకటి ఐఎన్ఎస్ కల్వరి ఇటీవల ప్రధాని జాతికి అంకితం చేశారు. ముంబైలోని మజ్‌గావ్ డాక్ యార్డు దీనిని తయారుచేసింది. దీంట్లో అనేక ప్రత్యేకతలున్నాయి. దీనిలో స్టెల్త్ యుద్ధ విమానాలలో వాడే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడారు. దీనిని శత్రువుల రాడార్స్ గుర్తించడం కష్టం.

దీనిలో చాలా బరువైన అన్ని రకాల ఆధునిక క్షిపణులను మోసుకువెళ్లి ప్రయోగించవచ్చు. దీంతో శత్రువుల సబ్ మెరైన్స్, యుద్ధనౌకలను దూరం నుండే సులువుగా గుర్తించి నాశనం చేసే పరిజ్ఞానం ఇమిడి ఉంది.శత్రువుల ఆయుధాలను గుర్తించి దాడి చేసే టోర్పోడ్‌లను అమర్చారు. హిందూ మహాసముద్రంలో సంచరించే అత్యంత ప్రమాదకరమైన షార్క్ చేపల్లో టైగర్ షార్క్ జాతికి చెందిన కల్వరి షార్క్ పేరును ఈ సబ్‌మెరైన్‌కు పెట్టారు. డీజిల్, ఎలక్ట్రానిక్ విధానంతో నడిచే ఈ జలాంతర్గామి 67 మీటర్ల పొడవు, 6.2 మీటర్ల వ్యాసార్ధంతో 1550 టన్నుల బరువు ఉంటుంది. హిందూ మహాసముద్రంపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్న చైనా కుతంత్రాలకు కల్వరి అడ్డుకట్ట వేస్తుంది. హిందూ మహాసముద్రాన్ని ప్రధాని నరేంద్రమోదీ 'సాగర్'గా వ్యవహరిస్తున్నారు. సాగర్ అంటే అన్ని ప్రాంతాల భద్రత - అభివృద్ధి (సెక్యూరిటీ గ్రోత్ ఫర్ ఆల్ ఇన్ ద రీజియన్) అని అర్థం.

మలక్కా, లోంబాక్, సుందా సంధులలో వ్యూహాత్మకంగా పట్టుసాధించాలంటే ఎప్పటికపుడు ఉత్తర అరేబియా సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఒమన్, పర్షియన్ గల్ఫ్, అండమాన్‌లలో యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల మోహరింపు నిర్వహణ చాలా ముఖ్యమని భారత్ ఇప్పటికే గుర్తించింది. గల్ఫ్ ఆఫ్ అడెన్ నుండి పశ్చిమ పసిఫిక్ ప్రాంతం వరకూ 24 గంటలూ పర్యవేక్షించే యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలను ఇప్పటికే భారత్ మోహరించింది. సముద్ర జలాలు, తీర ప్రాంతాల్లో పొంచి ఉన్న ముప్పును ఎదుర్కొని వెనువెంటనే ఆ ముప్పును అరికట్టే చర్యలను చేపట్టాలంటే స్థిరమైన సావధానత అవసరం అనేది భారత్ యోచన. సముద్ర దొంగల అణచివేత కోసమే హిందూ మహాసముద్రంలో జలాంతర్గాములను మోహరిస్తున్నామని చైనా బుకాయింపులు తోసిపుచ్చిన భారత్ వ్యవహారాన్ని సీరియస్‌గానే తీసుకుంటోంది. భారత్‌ను దిగ్బంధం చేసేందుకే చైనా జలాంతర్గాములను మోహరిస్తోందని ఇప్పటికే ఆ దేశ విదేశాంగ శాఖకు సమాచారాన్ని కూడా ఇచ్చింది. పాకిస్తాన్‌లోని గ్వదార్ పోర్టులో చైనా మోహరింపు వల్ల కూడా భవిష్యత్‌లో ఉన్న ముప్పును కూడా భారత్ విస్మరించలేదు. ఒక వేళ గ్వదార్‌కు చైనా యుద్ధనౌకలు వస్తే వాటిని ఎదుర్కొనేందుకు సైతం భారత్ సిద్ధమైంది.

-బి.వి ప్రసాద్

ఇప్పట్లో పెళ్లిలేదు!



అటు సౌత్ ఇటు నార్త్‌లో గుర్తింపు తెచ్చుకున్న శృతిహాసన్ ఈమధ్య ప్రేమలో పడిందన్న వార్త మీడియాలో హల్‌చల్ చేస్తూనే వుంది. ఇప్పటికే వీరిద్దరి వ్యవహారంపై జోరుగా ప్రచారం కూడా జరుగుతోంది. శృతిహాసన్ మైఖేల్ కోర్సాల్ అనే లండన్ నటుడితో ప్రేమాయణం సాగిస్తోందంటూ వినిపిస్తున్న వార్తల సారాంశం. అతనితో పీకలోతు ప్రేమలో మునిగిపోయిందని, తన కుటుంబానికి కూడా అతన్ని పరిచయం చేసిందని అంటున్నారు. ఈ విషయంపై శృతిహాసన్ స్పందిస్తూ తనతో కలిసివున్నంత మాత్రాన అతనితో లవ్‌లో వున్నట్లు కాదని, అతను కేవలం మంచి స్నేహితుడే తప్ప, పెళ్లి చేసుకోవాలన్న ఆలోచన లేదంటూ కొట్టిపారేసింది. మరో రెండేళ్ల తరవాతైనా సరే పెళ్లిచేసుకుంటానా? లేదా? అన్న విషయం తానిప్పుడే చెప్పలేనని, ఎవరిని పెళ్లిచేసుకుంటాను అన్న విషయం ఆ సమయం వస్తే ఖచ్చితంగా చెబుతానని, అయినా ఇప్పుడు తన దృష్టి అంతా సినిమాలపైనే వుందని చెప్పుకొచ్చింది.

'హార్ట్‌బీట్' సెన్సార్ పూర్తి



ధృవ, వెంబ జంటగా వేదాస్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ద్వారక్ రాజా దర్శకత్వంలో శ్యాం దేవ భక్తుని రూపొందిస్తున్న చిత్రం 'హార్ట్‌బీట్'. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని క్లీన్ యు సర్టిఫికెట్ పొందింది. సినిమాకు సంబంధించిన టీజర్, పోస్టర్ ఇటీవల విడుదలై మంచి ఆదరణ పొందిందని దర్శక నిర్మాతలు తెలియజేస్తున్నారు. ఇంకా వారు మాట్లాడుతూ- అమ్మాయి తనకంటే 16 ఏళ్ల వయసు పెద్దవాడైన యువకుడిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే ఎలా వుంటుంది? అనే అంశంతో ఈ చిత్రాన్ని రూపొందించామని తెలిపారు. ఎక్కడా అసభ్యతకు, అశ్లీలతకు తావు లేకుండా ఆసక్తికరంగా తెరకెక్కించామని, వినోదాత్మకంగా కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని వారు తెలిపారు. ఈ చిత్రానికి దర్శకత్వం: ద్వారక్ రాజా.

ప్రభాస్ దందా



బాహుబలి చిత్రంతో దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ క్రేజ్ మరింత పెరుగుతోంది. ఆయనతో సినిమా చేయడానికి బాలీవుడ్‌తో పాటుగా కోలీవుడ్ నిర్మాతలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ 'సాహో' చిత్రానికి సంబంధించిన షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. సుజిత్ దర్శకత్వంలో రూపొందిస్తున్న ఈ చిత్రం తరువాత కృష్ణంరాజు దర్శకత్వంలో ఓ చిత్రంలో కూడా ప్రభాస్ నటించనున్నాడట. 'ఒక్క అడుగు' పేరుతో ఓ సినిమా చేయాలనుకున్నారు కానీ కుదరలేదు. ఇప్పటికే పలువురు దర్శక నిర్మాతలు ప్రభాస్‌కోసం ఎదురుచూస్తుండగా కృష్ణంరాజు ఈ ఏడాది చివరలో తన సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నాడు. ఈ చిత్రానికి 'దందా' అన్న పేరును పెడతారట. గోపీకృష్ణ పతాకంపై రూపొందిస్తున్న ఈ చిత్రంలో కృష్ణంరాజు కూడా నటిస్తారట. ఇద్దరూ కలిసి నటించిన 'బిల్లా' సినిమా గుర్తుంది కదా! మరోసారి ఇదే కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రం ఎలా ఉండబోతుందో చూడాల్సిందే!

నటుడిగా గుర్తింపు దక్కింది

యువ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్



'అల్లుడు శీను' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన బెల్లంకొండ శ్రీనివాస్ మొదటి చిత్రంతోనే హీరోగా మంచి విజయాన్ని అందుకున్నాడు. భిన్నమైన కథలతో సినిమాలు చేస్తూ క్రేజ్ తెచ్చుకుంటున్న శ్రీనివాస్ తాజాగా 'సాక్ష్యం'తో ముందుకొస్తున్నాడు. శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఇప్పటికే ఎనభై శాతం పైగా షూటింగ్ పూర్తిచేసుకుంది. నేడు సాయి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఆయన చెప్పిన విశేషాలు

ప్రకృతికి సాక్ష్యం

'సాక్ష్యం' సినిమాను మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా విషయంలో చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాం. దర్శకుడు శ్రీవాస్ అద్భుతంగా రూపొందిస్తున్నారు. ప్రతి విషయంలో ఎంతో కేర్ తీసుకుని యూనిట్ అహర్నిశలు శ్రమిస్తోంది. కథ విషయానికొస్తే పంచభూతాలతో కలగలిసిన కథ ఇది.

ఎన్‌ఆర్‌ఐ యువకుడిగా..

ఈ చిత్రంలో నేను అమెరికాలో పుట్టిపెరిగిన యువకునిగా కనిపిస్తాను. వీడియో గేమ్ కంపెనీకి డైరెక్టర్‌గా వుంటాను. కథ మొత్తం నేచర్ చుట్టూ తిరుగుతుంది. నాకు మంచి గుర్తింపు ఇచ్చే పాత్ర ఇది. నటుడిగా నన్ను మరో కోణంలో చూపిస్తుంది.

ప్రత్యేక శిక్షణ

ఈ సినిమాలో ఐదు మేజర్ యాక్షన్ ఎపిసోడ్స్ వుంటాయి. పంచభూతాలకు సంబంధించిన ఈ యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దానికోసం దుబాయ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. యాక్షన్‌తోపాటు అన్నిరకాల ఎమోషన్స్ వుంటాయి.

దర్శకుడు శ్రీవాస్‌తో..

శ్రీవాస్ ఈ కథను చెప్పినప్పుడు చాలా ఎగ్జయిట్ అయ్యాను. అంతగా ఆకట్టుకుంది. దానికితోడు తను ప్రతి విషయంలో ఎంతో కేర్ తీసుకుని చిత్రీకరిస్తున్నాడు. చాలా సరదాగా షూటింగ్ జరుగుతుంది. శ్రీవాస్‌తో పనిచేయడం మరచిపోలేని అనుభూతి. ఇప్పటికే ఎనభై శాతం షూటింగ్ పూర్తయింది. ఈ నెలలో న్యూయార్క్‌లో ఓ షెడ్యూల్ తీస్తే చిత్రీకరణ పూర్తవుతుంది. ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం.

తదుపరి చిత్రాలు

ప్రస్తుతం రెండు కథలు వింటున్నాను. ఇంకా ఏదీ ఓకే కాలేదు.

- శ్రీ

చిరంజీవి చేయూత



పాత తరం హాస్యనటుడు పొట్టి వీరయ్య ఆర్థిక ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్న నటుడు చిరంజీవి ఆయనకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మా అధ్యక్షుడు శివాజీరాజా ఆధ్వర్యంలో సోమవారం చిరంజీవి ఇంటికి పొట్టి వీరయ్య స్వయంగా వెళ్లి ఆయన్ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తన ఆరోగ్యం ప్రస్తుతం సరిగా లేదని, చిరంజీవి కొండంత అండ మరువలేనిదని పొట్టి వీరయ్య తెలిపారు. కొత్త ఏడాదికి స్వాగతం చెబుతూ పాత సంవత్సరానికి బైబై చెబుతున్నామని మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో శివాజీరాజా, ఏడిద శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



నాగశౌర్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'ఛలో' చిత్రంలోని రెండవ పాటను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.ఏ రాజు, పసుపులేటి రామారావు, సీనియర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'రంగులరాట్నం' సిద్ధం



రాజ్‌తరుణ్ కథానాయకుడిగా అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై శ్రీరంజని దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'రంగులరాట్నం'. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిత్రాశుక్లా కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సితార, ప్రియదర్శి తదితరులు నటించారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, కెమెరా: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, దర్శకత్వం: శ్రీరంజని.

రేసులో ముందుకు..!



దక్షిణాది స్టార్ కథానాయికల రేసులోముందు వరుసలోనే ఉంది రకుల్ ప్రీత్‌సింగ్. ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడిపేస్తోంది. తెలుగులో మూడు, తమిళంలో రెండు భారీ ప్రాజెక్టులు ప్రస్తుతం ఆమె చేతిలో వున్నాయి. అలాగే మహేష్‌బాబు సినిమా చర్చల దశలో వుంది. నాలుగేళ్లుగా వరుసగా సినిమాలు చేస్తూ విరామం లేకుండా వుంది. కొంచెం కష్టమే అయినా మంచి కథలు వదులు కోవడం కోసం ఇష్టం లేక నటిస్తూనే వుంది, సంఖ్య కాకుండా, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ కెరీర్‌లో దూసుకు వెళుతోంది. ఇదిలా వుండగా తాజాగా రవితేజతో మరోసారి జోడీ కట్టబోతోందిట. రవితేజ హీరోగా నటించిన 'కిక్-2' బాక్సాఫీస్ వద్ద బోల్తాకొట్టినా అందులో అతడి సరసన ఆడిపాడిన అందాలబొమ్మ రకుల్ ప్రీత్‌సింగ్‌కు మాత్రం హీరోయిన్‌గా మంచి పేరే వచ్చింది. ఈ చిత్రం ద్వారా రవితేజ - రకుల్ ప్రీత్‌సింగ్ సూపర్ జోడీగా అందరూ కొనియాడారు. ఇందులో ఇద్దరి క్యారెక్టర్స్‌కు భలే గుర్తింపు, క్రేజ్ ఏర్పడింది. ఈ జోడీ మరోసారి వెండితెరపై కనువిందు చేయబోతోందని సమాచారం. కళ్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వంలో రవితేజ హీరోగా ఈ చిత్రం రూపొందనుందట. కళ్యాణ్ చెప్పిన కథకి రవితేజ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. ప్రస్తుతం రవితేజ చేస్తున్న 'టచ్ చేసి చూడు' చిత్రం పూర్తి కాగానే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లడానికి సిద్ధమవుతోంది. రవితేజకు జోడీగా రకుల్ ప్రీత్‌సింగ్‌ను ఎంపిక చేశారట. కళ్యాణ్ కృష్ణ ఇది వరకు తీసిన 'రారండోయ్.. వేడుక చూద్దాం'లో రకుల్ కథానాయికగా చేసిన విషయం తెలిసిందే. అయితే రవితేజ కోసం తయారు చేసిన కథలోనూ తన పాత్ర నచ్చడంతో రకుల్ ఈ సినిమాకు ఓకే చెప్పినట్టుల తెలిసింది. బాలీవుడ్ 'అయ్యారీ' సినిమాలో నటించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తున్న రకుల్.. మంచి పాత్రలు ఎక్కడ లభిస్తే అక్కడ చేస్తానంటూనే టాలీవుడ్‌ని మాత్రం వదిలేదిలేదంటోంది. చేసే ఏ చిత్రంలోనైనా కథలో సత్తా వుండాలేగానీ భాషతో పనేంటి? అంటోంది రకుల్.